దివ్యయోగీంద్రులును, ఆ లోకములో రూపమును ధరించి, నిత్యము మ్రోగు పురాణ, తర్క, ఆమ్నాయ, నియమ, ఇతిహాస, ధర్మ, సంహితాదులును, గురువుల బోధలచే జ్ఞానాగ్ని దగ్ధకర్ములై యున్నవారును, ఇతరులును, సత్యలోకమునకు చొచ్చివచ్చిన సర్వేశ్వరుని పాదమును జూచి, మిక్కిలి భక్తితో మ్రొక్కి, తమ మనస్సులలో నెంతకాలము నుండియో కాంక్షించుచుండు భాగ్యమును నేడు గంటిమి, పొందితిమి, అని సంతసించిరి.

మ. తన పుట్టిల్లిదె పొమ్మటంచు నజుఁడుం దన్నాభి పంకేరుహం
బు నిరీక్షించి నటించి యున్నతపదంబుం జూచి తత్పాదసే
చనముం జేసెఁ గమండలూదకములం జల్లించి తత్తోయముల్
వినువీథిం బ్రవహించె దేవనదినావిశ్వాత్ము కీర్తిప్రభన్

విష్ణుపాదము సత్యలోకమును జొచ్చినపుడు ఆ విరాట్ స్వరూపుడు బ్రహ్మలోకముతో సహా బ్రహ్మాండమంతటా వ్యాపించినప్పుడు, బ్రహ్మదేవుడు శ్రీహరి నాభిస్థలమును జూచి అదియేతన జన్మస్థలమని గుర్తించి, తన కమండలములోని జలముతో, ఆ శ్రీహరి పాదమును ప్రక్షాళించి పూజించెను. ఆ పరమేశ్వరుని మహిమచే ఆ జలమే దేవనదియై ప్రవహింపసాగెను. అప్పుడు

ఆ సత్యలోకవాసులు యోగశక్తిచే శ్రీహరి రాకను గ్రహించినవారై, నానావిధ పుష్పములచే శ్రీపాదమునకు పూజచేసి, దివ్యగంధములను సమర్పించి, ధూపదీపములను చూపి, అక్షతలను చల్లి, ఫలములను నివేదించి, కీర్తనలచే స్తుతించి, శంఖతాళాదులచే జయజయధ్వనులను చేసి, త్రివిక్రమా, కరుణాసాగరా, యని పిలిచి, బ్రహ్మదేవుడు, లోకపాలురు, స్తుతించిరి. వనచరేశ్వరుడైన జాంబవంతుడు అన్నిదిశలకును పోయి శ్రీమహావిష్ణువు యొక్క విజయము యెలుగెత్తి చాటిచెప్పెను. అన్ని జగములందు తానెయై నిండియున్న జగన్నాథుని గాంచి, ఆనందముతో నిండిన మనస్సులతో, బలి, తదితర వ్యక్తులు సన్నుతులు చేసిరి. అంత తిరిగి పూర్వపు వామనరూపమును ధరించిన విష్ణువునుగాంచి అసురేంద్రుని భృత్యులైన విప్రచిత్తి, రాహు, హేతి ప్రహేతి మొదలగు రాక్షసగణముఖ్యులు, యిట్లు తలపోసిరి: "ఈ పొట్టివాడు మూడడుగుల మేరను దానమడిగి సకల మహీమండలము నాక్రమించెను.

వీడు కపటబ్రహ్మచారి రూపమున వచ్చిన శత్రువైన విష్ణువని యెఱుంగని సత్యసంధుడైన మనరాజు, మాటకు కట్టుపడి యిచ్చెను. అతనితప్పేమియును లేదు. ఈ గుజ్జు వాడు ఎదిరింప శక్యముకాని తేజఃప్రభావముచే నీ జగములను పరిగ్రహించి, ఇంద్రాదులకు ఇచ్చివేయదలచినాడు. వీనిని పోనివ్వకుండ పట్టుకొని బంధించుటయే కర్తవ్యము" అని తమలో తాము చర్చించుకొని, గర్జించుచు, యుద్ధమునకు సిద్ధపడిన వారై ఆయుధములను ధరించి, చుట్టుముట్టుటను గాంచి, విష్ణు పరిచరులైన సునంద, నంద, జయ, జయంత, విజయ, ప్రబలోద్బల, కుముద, కుముదాక్ష, తార్క్ష్య పుష్పదంత, విష్వక్సేన, శ్రుతదేవ, సాత్త్వతులనబడు దండనాథులు తమ తమ సేనలతోను ఆయుధములతోను గూడుకొని, రాక్షసమూకల నంతము చేయుటకు సిద్ధపడుచుండగా, శుక్రశాపమును గుర్తుకు తెచ్చుకొని ఆ దానవేశ్వరుడు, తన భృత్యులతో నిట్లనెను:

రాక్షసోత్తములారా! దేవతలతో పోరాడక యిటురండు. పోరాడుటకు ఇది సమయము కాదు. సర్వభూతములకు, సర్వసంపదలకు ప్రభువైన దైవము ఇప్పుడు మనలను తిరస్కరింప, ఆయననెదిరించగలమా మనము? మొదట మనకు రాజ్యమునిచ్చి, సురలకు నాశము చేసిన ప్రభువు యిప్పుడు తారుమారు చేసినచో మన మేమనగలము? మనయొక్క భాగ్యము వక్రించినదని గుర్తించాలి కదా! అనేకమాఱులు మనతో పోరుటకు భయపడి పారిపోవుచుండు విష్ణుభటులు, ఇప్పుడు మిమ్ములను గెల్చుట దైవచేష్టితముగాదా? అందుచేత వీరులారా! మనకు ఎప్పుడు దైవము అనుకూలముగ నుండునో, అప్పుడే మనము గెలిచెదము. నేడు మనము పోరవలదు, అంతేకాకుండ, అనేకమైన కోటలు, మంత్రులు, సేనలు, ఉపాయములు, తెలివితేటలు, గలిగి యున్నప్పటికిని, కాలమును (అవకాశమును) తెలుసుకొని, సామోపాయముచే రాజు, శత్రువుతో పోరుట సముచితమగును. అందుచేత శత్రువును ఎదుర్కొనుట ఇప్పుడు మంచిపనికాదు. మనకు అనుకూల సమయమున మనము జయింతము. కావున మీరు కోపగించుకొనక తొలగిపొండు అని దానవరాజు చెప్పగా అందరును రసాతలమునకు పారిపోయిరి. అప్పుడు

గరుడుడు శ్రీహరి భావమెఱిగి, అసురప్రభువును వరుణపాశముచే బంధించెను.

బాహువులు, పాదములు, బంధించుట శ్రీహరి కృపయే గనుక నేనేమి చెయ్యగలను అని ఏ మాత్రము సందేహింపక, భయపడక, బలి నిలిచెను. దిశదిగంతములలో హాహాకారములు నిండెను.

తనయొక్క సర్వ సిరిసంపదలు నష్టమైనను, దైన్యము, భయము లేక మునుపటి కంటెను శ్రేష్ఠత, ఔదార్యము, ధైర్యము, ఎఱుకయు, నేమాత్రము తగ్గని దానవశ్రేష్ఠుని జూచి వామనమూర్తి యిట్లనెను:

ఓ దానవధీరా! నాకు మూడు పాదముల మేర నిత్తునంటివి కదా! భూమితో సహా సూర్యచంద్రులుండు స్థలము వరకు నాకొక్క పాదమైనది, స్వర్గాది ఊర్ధ్వలోకము లింకొక చరణమైనది. నీది యైన దంతయును రెండు పాదములకే సరిపోయినది. ఇక మూడవ పాదమునకు నీదియైన దేదియును లేదు గావున, యిచ్చెదనని చెప్పి, ఇవ్వని పాపమునకు, నీకు నిశ్చయముగ నరకప్రాప్తియగును, కదా! కావున దుర్గతి కలుగుటకు ముందే, సత్వరముగ నిప్పుడే, నాకివ్వవలసిన మూడవ పాదమునకు స్థానము జూపుము. ఏలనన బ్రాహ్మణునకు చెందినదానిని తిరస్కరించుటకు బ్రహ్మదేవునికికూడ వశముగాదు.

అని యిట్లు వామనుడు పలుకగా, సత్యభంగదోషము తగులరాదని నిశ్చయించినవాడై శోకమునకు లోనుగాక, నా దానవశ్రేష్ఠుడు ప్రసన్న వదనముతో నా చిన్నివటునితో నిట్లనెను :

ఆ. సూనృతంబు గాని నుడియదు నాజిహ్వ
బొంకఁజాల నాకు బొంకు లేదు
నీ తృతీయపదము నిజము నా శిరమున
నెలవుసేసి పెట్టు నిర్మలాత్మ!

ఆ. నిరయమునకుఁ బ్రాప్త నిగ్రహంబునకును
బదవిహీనతకును బంధనమున

కర్థభంగమునకు నఖిలదుఃఖమునకు
వెఱవ దేవ! బొంక వెఱచినట్లు

ఓ నిర్మలాత్మా! సత్యవాక్కులేగాని వేఱొకపలుకు నా జిహ్వ పలుకజాలదు. నేనెన్నడును బొంకజాలను. నా మనస్సులో బొంకుకు తావులేదు. నీ మూడవ పాదమును నిజముగ నా శిరమున నిలుపుము బ్రాహ్మణోత్తమా! ఓ దేవా! నేను అసత్యమాడుటకు భయపడు నంతగా నరకమునకుగాని, ప్రాప్తమగు భాగ్యమున కడ్డమైనను (అవరోధమైనను) గాని, పదభ్రష్టతకుగాని, బంధింపబడుటకు గాని, ధననష్టమునకు గాని, సకలమైన దుఃఖములు సంభవించినగాని, భయపడను.

ఓ ఆనందమూర్తీ! తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్నేహితులు, గురువులు, శిక్షించినచో మేలు కలుగునే గాని, నష్టమే మీలేదు కదా! రాజ్యమదాంధులును, రాక్షసులును యగు మావంటివారికి బుద్ధి చలించి వక్రమార్గమున పోవునప్పుడు సరియైన సమయమున వచ్చి, గురువులలో నాది గురువువైన నీవు బంధించినచో నది దండనయో, అవమానమో, నష్టమో, బాధయో యని తలంచనగునా? తొల్లి కొందరసురులు వైర భక్తులై నిన్నెదిరించి పోరాడి, అసువులు బాసి, గొప్పయోగీంద్రులు పొందినట్టి ఉన్నత పదమునే పొందియుంటిరి కదా!

ఓహో! ఎంత దౌర్భాగ్యము! మూఢుడు సత్యము, దానగుణము, కరుణ, ధర్మవర్తనాది సద్గుణములకు దూరుడై, ఈ మిథ్యాప్రపంచమే నిజమని, జీవితము దృఢమైనదని నమ్మి, జీవితము గడిచిపోవుటను గుర్తించక, చెలియ (భార్య) మృత్యు సమానమని, చుట్టములు యమునివంటివారని, పరిచారకులు యమకింకరుల వంటివారని యెఱుంగక సంసారసాగరములో కొట్టుకొను చుండును.

సీ. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు కాంతలు సంసార కారణములు
ధనము లస్థిరములు దను వతి చంచల కార్యార్థు లన్యులు గడచుఁగాల
మాయువు సత్వర మతిశీఘ్ర మని కాదె తమతండ్రి నధికరించి
మాతాత సాధుసమ్మతుఁడు ప్రహ్లాదుండు నీపాదకమలంబు నియతిఁజేసె

తే. భద్రుఁడతనికి మృతిలేని బ్రతుకు గలిగె
వైరులై కాని తొల్లి మావారు గాన
రర్థివై వచ్చి నీవు నన్నడుగు టెల్లఁ
బద్మలోచన! నాపుణ్యఫలము గాదె

మహాత్మా! పరమపవిత్రుడు, సాధుసత్తముడు, మా తాతగారు అయిన ప్రహ్లాదుడు, తన తండ్రిని కాదని, నీపాదకమలములచెంతకు నిష్ఠతో చేరెను. ఆయన గారిట్లు చెప్పుచుండిరి. చుట్టాలు దొంగలవలె దోచుకొందురు, పుత్రులప్పులవారివలె ధనము కొఱకు పీడింతురు, స్త్రీలు సంసారమోహబంధమునకు కారకులు ధనసంపదలు, అస్థిరములు, తనువు అతిచంచలమైనట్టిది (ఎప్పుడు పోవునో తెలియదు), కార్యార్థులు ఇబ్బందిపెట్టేవారు, కాలము గడచిపోవునట్టిది, ఆయువు అతి శీఘ్రముగ పోవునట్టిది అని చెప్పిరి. ఆ భద్రునికి మృతిలేని బ్రతుకు కలిగెను కదా! తొల్లి మావారు (అసురులు) నీకు శత్రువులై గాని నిన్ను దర్శింపలేకపోయిరి. ఓ పద్మలోచనా! అర్థివై నీవు వచ్చి, నన్నడుగుట నా యొక్క విశేషమైన పుణ్యఫలము కాదా! - అని చెప్పుచున్న దైత్యేంద్రునకు, అప్పుడే ప్రవేశించుచున్న ప్రహ్లాదుడు కన్పించెను.

వరుణపాశ బద్ధుడైయున్న బలి, తాతగారికి సరియైన విధముగ ప్రణామము లాచరింపజాలక ఖిన్నుడై అశ్రుధారలతో తలవంచి మ్రొక్కెను. అంతప్రహ్లాదుడు యజ్ఞవేదికపై సునందాది పరిచర సమేతుడై కూర్చొనియున్న వామనమూర్తిని గని, పులకిత శరీరుడై ఆనందబాష్పములు రాల్చుచు దండప్రణామం బాచరించి, యిట్లు విన్నవించెను.

దేవదేవా! ఈ బలికి ముందు ఇంద్రపదమిచ్చి ఇప్పుడు తొలగించుటయు మిక్కిలి శ్రేయస్కరమే యైనది. అహంకార మోహములవలన గర్వాంధ తమస్సు వికారముదయించును. దానిని పోగొట్టి, కరుణతో రక్షింపడమే అయినది. ఇది, బంధించుటకాదు, కాపాడుటయే! తత్త్వజ్ఞునకు మహేంద్రత్వమేల? నీ పాదకమలములను నియతితో కొల్చిన, దానికి తులతూగునా యీ దేవేంద్ర భోగపరత? గర్వము పెరిగి, కన్నులు కానరావు, చెవులు వినరావు, చిత్తము చిక్కుపడును. నీ సేవలన్నియు మఱచిపోవును. ఇంద్రపదమును తొలగించి, గొప్ప మేలు చేసితివికదా! స్వామీ!

అని పలికి, జగదీశ్వరుడును, అఖిలలోక సాక్షియునగు నారాయణునకు నమస్కరించి ప్రహ్లాదుడు పలుకుచుండగా - నచ్చటికి వ్యాకులచిత్తయై బాష్పజలధారలు కారుచుండగ చేతులు జోడించి "పతి భిక్షాం మమదేహి కోమలమతే! పద్మాపతే!" యని ప్రార్థించుచు బలిదైత్యుని ధర్మపత్ని వింధ్యావళి వినమ్రయై వామనమూర్తి కడకు చేరెను. చరణములకు ప్రణామములుచేసి, యిట్లనెను.

నిఖిలలోకములచే స్తుతింపబడు స్వామీ! లోకములకు రాజువు నీవేయై యుండగా, నీ క్రీడాస్థలములైన లోకములను చూచి లోకులు, పరులు కుమతులు, తామే లోకాధీశులమని గర్వపడుచుందురుకదా!

ఓ ఆశ్రితమందారా! ఈ దైత్యనాథుడు నీకు దానమివ్వననలేదు, ఇవ్వరాదు పొమ్ము అనలేదు, మూడులోకముల రాజ్యము నీకే యిచ్చెను. మరి ఆ దైత్యునీ విధముగ బంధింపనేల ఓ చిత్తచోరా, శ్రీహరీ! - అని వింధ్యావళి విన్నవింపగా బ్రహ్మదేవుడచటకు వచ్చి యిట్లనెను :

సీ. భూతలోకేశ్వర! భూతభావన! దేవదేవ!జగన్నాథ!దేవవంద్య!
తనసొమ్ము సకలంబుఁ దప్పక నీ కిచ్చె దండయోగ్యుఁడు గాఁడు దానపరుఁడు
గరుణింప నర్హుండు కమలలోచన! నీకు విడిపింపు మీతని వెఱపుఁ దీర్చి
తోయపూరము చల్లి దూర్వాంకురంబులఁజేరి నీ పదము లర్చించునట్టి

తే. భక్తియుక్తుఁడు లోకేశపదము నందు
నీవు ప్రత్యక్షముగ వచ్చి నేఁడు వేఁడ
నెఱిఁగి తన రాజ్య మంతయు నిచ్చి నట్టి
బలికిఁదగునయ్య దృఢ పాశబంధనంబు

ఓ దేవదేవా! దేవవంద్యా! భూతలోకేశ్వరా! భూతభావనా! ఈ బలిదైత్యుడు గొప్పదానపరుడు. తనకున్నదంతా మాట తప్పకుండా నీకే అర్పించినవాడు. కమలలోచనా! ఇతడు దండింపదగినవాడు కాడు. కరుణింపవలసినవాడు. ఇతనిని బంధవిముక్తుని జేసి, భయమును తొలగింపుము. నీ పాదపద్మముల నభిషేకించి దూర్వాక్షతలతో అర్చించినట్టి భక్తియుక్తుడు, సర్వలోకేశ్వరుడవైన

నీవు వచ్చి స్వయముగ అడిగితివని, నీవు సర్వమును హరించి వేయగలవని తెలిసియు తన రాజ్యమంతా ధారపోసినట్టి ఈ బలికి ఈ దృఢపాశబంధనము తగునా, జగన్నాథా? అని అడిగిన బ్రహ్మతో భగవంతుడిట్లనెను:

సీ. ఎవ్వని(గరుణింప నిచ్ఛయించితిని వాని యఖిలవిత్తంబు నే నపహరింతు
సంసార గురుమద స్తబ్ధు(డై యెవ్వ(డు దెగడి లోకము నన్ను ధిక్కరించు
నత( డెల్లకాలంబు నఖిలయోనులయందు( బుట్టును దుర్గతి( బొందు(బిదప
విత్తవయో రూప విద్యా బలైశ్వర్య కర్మ జన్మంబుల గర్వ ముడిగి.

తే. యేక విధమున విమలు(డై యెవ్వ(డుండు
వా(డు నాకూర్చి రక్షింపవలయువా(డు
స్తంభ లోభాభిమాన సంసారవిభవ
మత్తు(డై చెడ నొల్ల(డు మత్పరుండు

పద్మాసనా! నీకు తెలుసుకదా! యెవ్వనిపైన నేను కరుణ జూపదలచెదనో వాని యొక్క సకలసంపదలను అపహరించెదను. ఎవడు అహంకారముతో గూడి మిక్కిలి మదముతో సంసార మైకములో మునిగి నన్ను తిరస్కరించి దూషించునో వాడు నానా రకముల గర్భములలో జన్మించి, దుర్గతియందు పడియుండును. కాని, అట్టివాడు పిదప ఎప్పుడు ధన, యౌవన, రూప, విద్యా, బల, ఐశ్వర్య, జన్మకర్మల ఆధిక్యతచే కలిగిన గర్వాహంకారములను ఒదిలించుకొని, నిర్మలుడై యుండునో వాడు, నాచే రక్షింపబడుటకు యోగ్యుడగును. నా యందు మనస్సు లగ్నము చేసినవాడు, అజ్ఞాన, లోభ, దురభిమాన, సంసార, వైభవమత్తుడై నశించుటకు ఇష్టపడడు.

ఈ పుణ్యాత్ముడు, గురుశాప వశమున రాజ్యభ్రష్టుడైనను, నిర్మలచిత్తుడై సన్మార్గమును, దయను, సత్యమును, ధర్మమును, విడువకుండ, జ్ఞానియై దుస్సాధ్యమైన మాయను జయించిన మహనీయుడీతడు. అల్పుడు కాడు.

ఇతడు అసురనాథుడని, పాపరహితుడని, ఇతని కట్టుబాట్లెంతవరకు నున్నవో చూచెదమని నేనింత మాట్లాడితిని. ఇతడు నిజముగానే సత్యవ్రతుడు, నిర్మలాచారుడు. మేలు మేలు. నాకు చాలా సంతోషము కల్గినది.

ఇతడు సావర్ణి మన్వంతరములో నింద్రుడగును. తదుపరి దేవతలకు అర్హత కలుగు నా ధామమునకు రావించెదను. అంతవరకు ఇతనిని దయతో రక్షించెదను. అంతవఱకు నీతడు వృద్ధిచెందిన వైభవముతో సుతలలోకమున నుండును. అచ్చట వ్యాధులు, దప్పులు, నొప్పులు, బాధలు ఉండవు. ఇది విశ్వకర్మచే నిర్మింపబడి దనుజులు ఆకాంక్షించే లోకము అని పలికి, బలితో భగవంతు డిట్లనెను:

ఓ ఇంద్రసేన మహారాజా! నీకు శుభమగుగాక! భయపడకుము. నీ దానశీలత అతి ఉత్తమమైనట్టిది. సుతలలోకములో దేవతలు కూడ నివసించుటకు ముచ్చటపడుదురు. అచ్చట నుండు వారికి దుఃఖములు, కష్టములు, ఆతురతలు, దుర్మరణము, నొప్పులు, ఉండవు. నీవును సుతలములో నుండుము. నీ ఆజ్ఞను, నీ శాసనమును మన్నింపని నీ శత్రువులను నా చక్రమువచ్చి సంహరించును. నీవు లోకపాలుర (మనువుల) పాలనలో నుండవు. అన్యులెంతటి వారైనను నిన్నేమియు చేయజాలరు. నేనెల్లప్పుడును వచ్చి, నిన్ను రక్షించెదను. కరుణతోడ నీకు నేను దర్శనమిచ్చుచుందును. నీవు నన్ను ధ్యానించుచుండుటచేత నీలోని ఆసురీ భావములు తొలగిపోయి, నీవు నిర్మలుడ వగుదువు. నా యొక్క ఆజ్ఞగా భావించి సుతలములో మనోజ్ఞముగ జీవింపుము.

అని పలికిన శ్రీహరియొక్క అమృతవాక్కులు వీనులవిందులవగ, కన్నులనుండి ఆనందబాష్పములు కురియగ, మేనుపులకింపగ, చేతులు మోడ్చి రాక్షసపతి యిట్లనెను.

ఓ శేషతల్పశయనా! శ్రీహరీ! ఎన్నడును, లోకపాలకులకైనను, ఇంతటి కృపజూపని నీవు, నా బ్రతుకును, నా జీవన క్రమమును నిర్దేశించి, కాపాడితివి. నీ యొక్క దయారసమును, నీవు నన్ను ఉన్నతునిజేసి, పలికిన పలుకులు, చేసిన మన్నన, ఇచ్చిన పెద్దరికము, ఈ జీవితమునకు చాలవా! ప్రభూ! నిన్నెఱిగి నీ పాదములబట్టిన నిక ఆపద కల్గునా!

అని పలికి, బలి, బంధ విముక్తుడై, శ్రీహరికి నమస్కరించి, బ్రహ్మకు ప్రణామముచేసి, శివునకు వందనమాచరించి, తనవారల తోడ్కొని

సుతలమునకు పయనమయ్యెను. అంత, శ్రీహరి కృపావశమున కృతార్థుడైన, కులోద్ధారకుండైన మనుమని జూచి, సంతోషించి, ప్రహ్లాదుడు భగవంతున కిట్లనెను.

ప్రభూ! మంగళాత్మా! ఈ బలికి నీవు అనుగ్రహించిన ఇంతటి మహద్భాగ్యము బ్రహ్మ రుద్రాదులు కూడ పొందలేదు. ఇక ఇతరులకు గాని, అసురులకుగాని ఎట్లు లభించును? బ్రహ్మాదిదేవతలచే నీవు సతతమూ పాదపూజ చేయబడువాడవు. అతి దుర్లభుడవైన నీవు అసురులమైన మా యొక్క దుర్గపాలుడ వైతివి. బ్రహ్మాదిదేవతలు నీయొక్క పాదపద్మ మకరంద పాన ఐశ్వర్యమును పొందినవారు. మరి మేము అల్పబుద్ధులము నీచయోనిజులము, కుటిలాత్ములము, అయియుండియు, నీ యొక్క యిట్టి కృపాదృష్టిని దివ్యమార్గమును, స్థానమును పొందుటకేమేమి తపముల నాచరించితిమో తెలుసుకోగలమా! నీవు మమ్మిట్టి విధముగ రక్షించుట విచిత్రము గాదా! దేవదేవా!

మఱియును, దేవదేవా! నీవు సర్వాంతర్యామివి, సమదర్శనుడవు (అందరిని సమముగ జూచువాడవు). అయినను పరికించి చూడగా నీ కిష్టములేని వారికేమియు నివ్వవు (దుష్టులకు, దైవద్వేషులకు, లోకకంటకులకు ఏమియు నివ్వవు) కాని, భక్తుల కోర్కెలను కల్పతరువువలె తీర్చెదవు. అనిన ప్రహ్లాదునితో పరమపురుషుడిట్లనెను:

వత్సా! ప్రహ్లాదా! మంచిది. నీవారు, నీవు, నీ మనుమడును, సుతలమునకు పయనమైపొండు. నేను గదాధారినగుచు జేరి రక్షింతును. అచ్చట పాపము దరి జేరదు. అని నియమించిన పరమేశ్వరునకు ప్రహ్లాదుడు నమస్కరించి, ప్రదక్షిణచేసి, చేతులుజోడించి నుదుటిపై నిడుకొని, బలిని తోడ్కొని, సకల అసుర సమూహముతో నొక మహాబిలద్వారమున ప్రవేశించి, సుతల లోకమునకు వెడలెను. అప్పుడు నారాయణుడు, శుక్రాచార్యుని, ఋత్విక్కులను జూచి యిట్లనెను:

ఓ విప్రోత్తమా! ఈ బలిచేసిన యాగమున కెట్టి లోటుయు లేకుండ చివరివరకు కొనసాగించి, సమాప్తము చేయవలెను. అసంపూర్ణముగ

నుండిపోయిన కర్మలను బ్రాహ్మణులు చేపట్టినచో పరిపూర్ణమగును కదా! అనిన, శుక్రాచార్యుడిట్లనెను:

ఓ పురుషోత్తమా! నీవు యజ్ఞేశుడవు, యజ్ఞపురుషుడవు, అఖిల కర్మలకు అధినాథుడవు కదా! ప్రత్యక్షముగ నున్న నీవు పరితుష్టుడవైనచో, నే కర్మముల కైనను లోపమెట్లు కలుగును? ధన, దేశ, కాల, అర్హత, మంత్ర తంత్రముల యందు ఎటువంటి కొఱతలు కలిగినను, నీ నామము నుచ్చరించినంతనె పోవును కదా! అయినను నీ వాజ్ఞాపించితివి గావున నేను యాగ నిర్వహణచేసి సమాప్తి చేసెదను. నీ యాజ్ఞప్రకారము మెలగుట జనులకు మేలు గాదా! ఇంతకంటెను శుభము నా కెచట గలుగును? అని శ్రీహరి యాజ్ఞను శిరసావహించి, శుక్రాచార్యుడు దానవేంద్రుని యజ్ఞమును, మునులు, బ్రాహ్మణులు సహాయపడగా, పరిసమాప్తము చేసెను.

ఈ విధముగ శ్రీహరి వామనుడై, బలినడిగి, భూమిని పరిగ్రహించి, అన్నయైన దేవేంద్రునకు స్వర్గలోకమును దయతో నిచ్చెను. అప్పుడు చతుర్ముఖ బ్రహ్మ, దక్ష భృగు ప్రజాపతులను, శివుని షణ్ముఖుని, దేవర్షి పితృగణములను, రాజులను, తోడ్కొని వచ్చి కశ్యపునకు అదితికి సంతోషము కలుగునట్లుగా, లోకములకు లోకపాలకులకు వామనుడు ప్రభువని నియమించెను. అందరును, ఉపేంద్రుడు (వామనుడు), ధర్మమునకు , యశమునకు, ఐశ్వర్యమునకు, శుభములకు, దేవతలకు, వేదములకు, స్వర్గమునకు, మోక్షమునకు, ప్రధానుడని సంకల్పించిరి. ఆ సమయంబున

బ్రహ్మ, లోకపాలురు, దేవేంద్రునితో సహా, వామనుని అమరావతికి గొనిపోయిరి. మిక్కిలి శక్తివంతమైన అండ (వామనుని) వలన ఇంద్రునికి ఇంద్రపదము లభించెను. తనకు ఆద్యుడై తమ్ముడు సంభవింపగా, అన్నయొక్క కోర్కెలు ఎందుకు తీరవు? భగవంతుడైన తమ్ముడు రాజ్యభాగమడుగడు, తన మేలు కోరుకొనడు, రాజ్యమేలెదనని యడుగడు, బిచ్చమెత్తి సంపాదించి మూడు జగములను అన్నకిచ్చెను. దేవతల తల్లియైన అదితి యొక్క ఆఖరి బిడ్డడివంటి ఇచ్చుటకు వెనుదీయని తమ్ములెచ్చటనైన గలరా! తల్లి కడుపుకు బాధ కలిగించు పెక్కురు కొడుకులను కనుట కంటె,

శ్రేష్ఠుడైన శక్తిమంతు డొక్కడు చాలును, అదితి కన్న ముప్పది మంది దేవగణముకంటెసమస్య తీర్చిన చిన్నమేటి వడుగు శ్రేష్ఠుడైనట్లు.

ఇట్లు దేవేంద్రుడు, వామనుడు సంపాదించి తెచ్చిన త్రిభువన సామ్రాజ్యమును మఱల గైకొనెను. అప్పుడు బ్రహ్మ, శివుడు, కుమారుడు, భృగు ప్రముఖులైన మునులు, పితృదేవతలు, దక్షాది ప్రజాపతులు, సిద్ధులు, వైమానికులు, ఇతరులు, అద్భుత ప్రకాశుడైన విష్ణుప్రభావమున కాశ్చర్యచకితులై ప్రశంసించుచు, ఆడుచు, పాడుచు, తమతమ తావులకు మఱలిరి; అని చెప్పి శుక్రుడిట్లనెను:

పరీక్షిన్మహారాజా! భూమియందుండు ఇసుకరేణువుల నెవ్వరును లెక్కింపలేనట్లు త్రివిక్రముని మహిమను కొద్దిపాటి తెలుసుకొని, తర్కించుటకు లెక్కించుటకు ఎవ్వరికిని శక్యముకాదు.

అద్భుత వర్తనుడగు ఆ శ్రీహరి యొక్క విమలచరితము వినువాడు గొప్ప పరాక్రమశాలియై చివరకు ఉత్తమ గతులను పొందును.

ఈ త్రివిక్రమ విక్రమచరితమును గృహస్థ కర్మలు, పితృకర్మలు, దైవకర్మలు చేయునప్పుడు ఎవ్వరైనను, ఎక్కడెక్కడనైనను కీర్తింతురో వారు నిత్య సౌఖ్యంబులు పొందుదురు, భూపరేంద్రా!

అని యిట్లు శుకుడు పరీక్షిన్మహారాజుకు, వామనావతార చరితమును చెప్పెను, అని సూతుడు మునులకు చెప్పిన, వారానందభరితులైరి.

శ్రీవామనచరిత్ర సమాప్తము.

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

# 4. రుక్మిణీ కల్యాణము

శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజు కిట్లు చెప్పెను: రాజా! నీకు ఇదివరకే చెప్పియుంటిని కదా! బ్రహ్మదేవుని సలహాపై ఆనర్తదేశపురాజైన రైవతుడు, తన పుత్రికయైన రేవతిని బలరామునకిచ్చి వివాహము చేసెను.

చేదిరాజు శిశుపాలుని మిత్రులైన సాల్వాదులైన రాజులనోడించి, శుభగుడైన శ్రీకృష్ణుడు, భీష్మక రాజపుత్రియు, రమాదేవి అంశతో పుట్టినదియు మహాగుణమణియు, పుష్పగంధియు, బాలామణియునైన రుక్మిణిని వరించెను.

అనగా, రాజిట్లడిగెను : యోగీంద్రా! శ్రీకృష్ణుడు స్వయంవరమునకు వచ్చి రుక్మిణిని రాక్షస వివాహమున నెత్తుకు పోయెనని మునుపు చెప్పియుంటిరి కదా! మరి శ్రీకృష్ణుడొక్కడే సాల్వాదులందరిని ఎట్లు ఓడించగలిగెనో చెప్పుడు, అదీ కాక,

కళ్యాణాత్మకమైన విష్ణుగాథలను వీనులవిందుగ వినువానికి ఎన్నడైనను తృప్తి కలుగునా! వినుచున్నకొద్ది యింకను వినవలెనని యుండునుకదా! కావున నాకు రుక్మిణీ కల్యాణగాథను వినవలెనను కోర్కె కలుగుచున్నది. విప్రవర్యా! చెప్పుము.

క. భూషణములు సెవులకు బుధ
తోషణము లనేకజన్మదురితౌఘవిని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమనుగుణభాషణముల్

యోగీంద్రా! గరుడ గమనుడైన విష్ణువుయొక్క గుణగణగాథలను వినుట, చెవులకు అలంకారములు, సజ్జనులకు సంతోషదాయకములు, అనేకజన్మల దుష్కర్మములను పాపములను శోషింపజేయునట్టివి. అవి, మంగళకర శబ్దములు కదా అనిన శుకుడిట్లనెను.

రాజశ్రేష్ఠా! వినుము. విదర్భదేశమున కుండినపుర ప్రభువైన భీష్మకుడను ఒక దొడ్డరాజుండెను. అతనికి ఐదుగురు పుత్రులు. పెద్దవాడు రుక్మి.

అందరికంటె చివరిదైపుట్టెను రుక్మిణీ కన్య. ఆమె, బాలచంద్రరేఖవలె రాజు యింట వెలసి, దినదిన ప్రవర్థమానయై మెలఁయుచుండెను. వేర్వేరు దేవతలకు పేరుపేరున బొమ్మలపెండ్లిండ్లు చేయుచు, గుజ్జనగూళ్లను వండించి చెలులకు పెట్టించుచు, రమణీయమైన మందిరములలోను, ఆరామప్రదేశములలోను విహరించుచు, పువ్వులమొక్కలు లతలను పోషించుచు, మణిమయ సౌధములలో ఊయలలూగుచు, బాలికలతో బంతులాడుచు, చిలుక గోరువంకలకు పాటలనేర్పుచు, నెమళ్లకు నాట్యము నేర్పుచు రాజహంసలకు మందగమనము నేర్పుచు నుల్లాసముగ నెదుగుచుండెను. అంతట,

సీ. దేవకీసుతుకోర్కి తీగెలు వీడంగ వెలఁదికి మైదీగె వీడఁ దొడఁగెఁ
గమలనాభునిచిత్తకమలంబు వికసింపఁ గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ బొలఁతికి జనుదోయి పొడవుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ జలజాక్షిమధ్యంబు సన్న మయ్యె

ఆ. హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ
బద్మ నయనువలనఁ బ్రమదంబు నిండార
నెలఁతయౌవనంబు నిండి యుండె

దేవకీనందనుడైన శ్రీకృష్ణునియొక్క కోరికలను తీగలు పెరిగి ప్రాకు చుండగా నిచ్చట రుక్మిణీ కన్యయొక్క శరీరము మెఱుపుతీగవలె పెరగసాగెను. పద్మనాభుని (శ్రీకృష్ణుని) చిత్తకమలము వికసింపగా, ఆ కాంతకు (రుక్మిణికి) ముఖకమల మతి సుందరముగా వికసించి, వెలిగెను. శ్రీకృష్ణునకు మదనాగ్ని (కామ-తాపము) అంకురింపగా, ఆ యవ్వనవతికి వక్షము పైకుబకసాగెను. శ్రీకృష్ణునకు (రుక్మిణి తనకు లభించునను) ధైర్యము సన్నగిల్లి కృశింపగా, రుక్మిణీ సుందరి నడుము సన్నబడెను. శ్రీకృష్ణునకు ప్రేమబంధము అధికము కాగా, రుక్మిణీ కన్యకు కేశపాశబంధము పెరిగి అందముగ నమరెను. శ్రీకృష్ణుని రూపశౌర్యభావముల వలన కలిగిన సంతోషము పూర్తియగునట్లు, సుందరి యొక్క యౌవనము పరిపూర్ణత్వము నొందెను.

ఈ విధముగ భీష్మక పుత్రులైన రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మమాలి, యను ఐదుగురికిని ప్రియమైన చెల్లెలైన రుక్మిణీ కన్య, తన యౌవనప్రాయమున, తన తండ్రి గృహమునకు వచ్చుచుండు అతిథి జనులవలన శ్రీకృష్ణుని రూప, యౌవన, బల, గుణాదులను గుఱించి వినుచుండుటచే శ్రీకృష్ణుడే తనకు తగిన విభుడని నిశ్చయించుకొనెను.

అచ్చట ద్వారకలో, శ్రీకృష్ణుడు రుక్మిణియొక్క రూపము, బుద్ధి, శీలము, లక్షణము, గుణముల గుఱించి వినివిని, ఆలోచించుచు, ఆ కన్యారత్నమే తనకు తగిన యిల్లాలని తలంచి ఆమెనే పొందవలెనని నిశ్చయించుకొనెను; అంత,

బంధువులందరును, శ్రీకృష్ణునకే రుక్మిణి నిచ్చుట యుక్తమని బాగుగ నాలోచించి చెప్పుచుండగా, దుష్టబుద్ధియగు రుక్మి, శ్రీకృష్ణుని యందు మిక్కిలి శత్రుత్వము గలవాడై, తన చెల్లెలిని తన మిత్రుడైన శిశుపాలునకే యిచ్చెదనని, ద్వేషాంధుడై పట్టుబట్టెను.

అన్నయొక్క మూఢ పట్టుదలను ఎఱిగి ఆ రుక్మిణీ కన్య, తనలో మిక్కిలి భీతి జెందినదై, విశ్వాసపాత్రుడు, ఆప్తుడునైన ఒక బ్రాహ్మణుని పిలిపించి, "బ్రాహ్మణోత్తమా! గర్వముతో నిండియున్న రుక్మి నన్ను తన మిత్రుడైన శిశుపాలున కిచ్చెదనని యనుచున్నాడు. ఓ బుధశ్రేష్ఠా! నీవు ఎట్లైనను ద్వారకకు పోయి, శ్రీకృష్ణునకు, నా మాటగా విన్నవింపుము" అని వేడుకున్నది. మఱియును,

"అయ్యా! నా తండ్రి, కొడుకు యొక్క ఆలోచనను కాదని అడ్డుకొనలేదు. మా అన్న తలచినట్లు జరుగకుండ, భక్తరక్షకుడైన యా శ్రీకృష్ణుని వెంటనే రావలసినదిగా జెప్పుము" అని,

కొన్ని రహస్య వచనములను చెప్పిన విని, బ్రాహ్మణుడు ద్వారకా నగరమునకు బోయి, ద్వారపాలకుల ద్వారా తన రాకను గిరిధారికి ఎఱింగించెను. లోనికి ప్రవేశించి, బంగారు సింహాసనముపై కూర్చున్న పురుషోత్తముని గాంచి, "పెండ్లి కొడుకువు కమ్ము"ని దీవించెను. ముసిముసి నవ్వులు నవ్వుచు ఆ శ్రీహరి, తన ఆసనమునుండి దిగి బ్రాహ్మణునికి

ఉచితాసనమున కూర్చుండబెట్టి, తనకు దేవతలు చేయు విధముగ ఆ బ్రాహ్మణునకు పూజలుచేసి, ప్రశస్తమైన భోజనము పెట్టించి, అతని పాదముల నిమురుచు నిట్లనెను.

భూసురోత్తమా! సంతోషచిత్తముతోనున్నచో ధర్మపాలన మతి సులభము, బుధసమ్మతమగును. అదియేదన, ప్రాప్తించిన విత్తముతోసంతోషించు బ్రాహ్మణుడు తన ధర్మమున నుండును, చలింపడు. ఆ ధర్మమే అతనికి కోరికలనన్నిటిని తీర్చును. సంతోషి కాకున్నచో ఇంద్రునివంటి గొప్పవాడైనను నశించును. నిర్ధనుడైనను సంతుష్టుడై సంతోషముతో నున్న వాడు సుఖముగా నిద్రించును. సర్వభూతముల మేలుకోరువారు, ప్రాప్తించిన దానితో సంతోషించువారు, శాంతులు, సజ్జనులు, గర్వములేనివారు, నైనట్టి వారల సకలకోరికలను నేను తీర్చెదను.

బ్రాహ్మణశ్రేష్ఠా! నీ ఉనికి ఎవ్వని దేశమందు? ఎవ్వనిచే మీ సంక్షేమము కలుగుచున్నది? ఎవ్వని రాజ్యమందు ప్రజలు సుఖింతురో వాడు నాకు ప్రియుడు. నీవు ఈ జలదుర్గము నందున్న ఇచ్చోటి కెట్లు రాగలిగితివి? నేను పరిహసించుట లేదు. నీ మనస్సులో నున్న కోరికను నేను తీర్చెదను లెమ్ము.

అని యిట్లు ఆ లీలా మానుష విగ్రహుడైన పరమేశ్వరుడు అడిగిన ప్రశ్నలకు ఆ భూసురుడిట్లు బదులు చెప్పెను:

దేవా! విదర్భ దేశాధీశుడైన భీష్మకుని పుత్రికారత్నము రుక్మిణి యను కన్యకామణి గలదు. ఆమె నీకు తనను అర్పణము చేసుకొనగోరి, మంగళప్రశస్తమైన ఒక సందేశమును నీకు విన్నవించుటకు నన్నిక్కడికి పంపించినది. ఆలకింపుము.

సీ. ఏ నీగుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు
నే నీశుభాకార మీక్షింపఁ గన్నుల కఖిలార్థలాభంబు కలుగుచుండు
నే నీచరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనోన్నతత్వంబుఁ బొందఁ గలుగు
నే నీలసన్నామ మేప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు

తే. నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి ఖలవిదారి
శ్రీయుతాకార మాననీచిత్తచోర

ఓ కంసాంతకా! ఎట్టి నీ గుణగణములు చెవులకు సోకగానే శరీర తాపములన్నియు తీరిపోవునో, ఏ మంగళకరమైన నీ శుభాకారమును చూడగనే కన్నులకు సకల ఫలములు సిద్ధించునో, ఏ నీ చరణసేవ చేసినంతనే ఉత్తమ లోకములు ప్రాప్తమగునో, ఏ నీ దివ్యనామమును భక్తితో స్మరించిన బంధములన్నీ వీడిపోవునో, అట్టి నీ యందు నా చిత్తమెల్లప్పుడును నిలిచి యున్నది. ఇది నీ సాక్షిగా నిక్కమునుమా! ఓ మానినీ మానస చోరా! శ్రీయుతా కారా! నాపై కరుణ జూపవా?

శా. ధన్యున్ లోకమనోభిరాముఁ గులవిద్యారూపతారుణ్యసౌ
జన్య శ్రీబలదానశౌర్యకరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు కోరదే మును రమాకాంతాలలామంబు రా
జన్యానేకపసింహ నావలననే జన్మించెనే మోహముల్

ఓ రాజసింహమా! ధన్యుడవు, లోకమనోభిరాముడవు, వంశ, విద్యా, రూప, యౌవన, సౌజన్య, సంపద, బల, దాన, శౌర్య, కరుణా సంశోభితుడవును, నైన నిన్ను ఏ కన్యలు మాత్రము వరింపకుండ నుండగలరు? ఆనాడు, ఆ లక్ష్మీదేవియే నిన్ను వరించలేదా? నేనొక్కతెనే నిన్ను ప్రేమించితినా యేమి? నా కోరికను మన్నింపుము స్వామీ!

ఉ. శ్రీయుతమూర్తి యో పురుషసింహమ సింహముపాలిసొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయిని నైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్న వాఁ
డా యధమాధముం డెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపముల్

ఓ పురుష సింహమా! లక్ష్మీపతీ! సింహము తినబోవు (సింహము తినుటకు యోగ్యమగు) ఆహారమును నక్క తినుట కాశించునట్లు, అహంకారి యైన

ఆ చైద్యుడు (శిశుపాలుడు), నీ పాదముల కంకితమై, నిన్నే ధ్యానించుచుండు నన్ను, శీఘ్రముగ కొనిపోవుటకు సిద్ధముగ నున్నాడు. నీ ప్రతాపమెట్టిదో, ఆ యధము దెలుగడు కదా!

మ. వ్రతముల్ దేవగురుద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితినేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశముఖ్యాధముల్

ఓ కృష్ణస్వామీ! నేను వ్రతములు చేసి, దేవతలను, గురువులను, బ్రాహ్మణోత్తములను గత జన్మలలో పూజించి వసుదేవనందనుడైన శ్రీకృష్ణుడే నా చిత్తేశుడు (భర్త) యగు గాక యని కాంక్షించి, ఆ శ్రీహరిని కొలిచియున్న దాననైనచో, నతడే నా భర్తయగుగాక. యుద్ధములో శిశుపాలాది యధములు పరాజితులై పోవుదురుగాక!

ఉ. అంకిలి సెప్ప లేదు చతురంగ బలంబులతోడ నెల్లి యో
పంకజనాభ నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయశౌర్యమే
యుంకువ సేసి కృష్ణ పురుషోత్తమ చేకొని పొమ్ము వచ్చెదన్

ఓ పురుషోత్తమా! పంకజనాభా! కృష్ణా! నేనేమీ అసత్యము చెప్పుటలేదు. నీవు రేపు చతురంగబల సమేతముగ వచ్చి శిశుపాల జరాసంధాదులను జయించి, నావైపునకు వచ్చి, నన్ను రాక్షస వివాహమున గొనిపొమ్ము. నన్ను పొందుటకు నీ యొక్క శౌర్యమే కన్యాశుల్కముగ భావించి నీతోడవచ్చెదను.

సీ. లోపలిసౌధంబులోన వర్తింపంగఁ దే వచ్చునే నిన్ను దెత్తునేనిఁ
గావలివారలఁ గలబంధువులఁ జంపి కాని తే రా దని కమలనయన
భావించితేని నుపాయంబు సెప్పెద నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు

తే. నెలమి మావారుఁ బంపుదు రేను నట్లు
పురము వెలువడి యే తెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్య చరిత

ఓ ఉత్తమచరితా! అంతఃపురములో మసలుచుండు నన్ను కొనిపోవుటకు అక్కడ నున్న కావలివారలను, బంధుజనులను, చంపినగాని సాధ్యపడునా యని శంకించెదవేని, నేనొక ఉపాయమును చెప్పెద వినుము. నగరము వెలుపలనున్న పార్వతీదేవి మందిరమునకు పెండ్లికి ముందు పెండ్లికూతురును పంపించు సాంప్రదాయమున్నది. ఆ ప్రకారము నేను ఆ శివాని ఆలయమునకు పోయి, ఆ దేవిని మ్రొక్కు సమయమున నీ వచ్చుటికి వచ్చి నను కొనిపోవ వచ్చును.

మ. ఘనులాత్మీయతమో నివృత్తికొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజతో యమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా

ఓ ప్రాణేశ్వరా! సజ్జనులు తమ అజ్ఞాన నివృత్తికై గౌరీశునివలె నెవ్వని పాదపద్మ జలమున (గంగాజలమునందు) మునుగ వాంఛింతురో అట్టి నీ యొక్క కృపకు నేను అర్హురాలిని కాకున్నచో తీవ్రమైన వ్రతదీక్షనుబూని నూఱు జన్మలకైనా నిన్నే స్మరించుచు ప్రాణములను విడిచెదను. ఇది మాత్రము నిక్కము సుమా!

సీ. ప్రాణేశ నీమంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబులకలిమి యేల
పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని తనులతవలని సౌందర్య మేల
భువనమోహన నిన్నుఁ బొడగానఁగా లేని చక్షురింద్రియముల సత్త్వ మేల
దయిత నీయధ రామృతం బానఁగా లేని జిహ్వకు ఫలరససిద్ధి యేల

ఆ. నీరజాతనయన నీవనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణ మేల

ధన్యచరిత నీకు దాస్యంబు సేయని
జన్మ మేల యెన్ని జన్మములకు

ప్రాణేశ్వరా! నీ యొక్క మృదుమధుర భాషలు వినలేని చెవులుండి యెందుకు? నీవు అనుభవింపలేని సుకుమార కోమల శరీరముయొక్క సౌందర్య మెందులకు? భువన మోహనా! నిన్ను సందర్శింపగా లేని కన్నులుండియు నేమి ప్రయోజనము? దేవా నీ అధరసుధారసము నాస్వాదింపలేని నాలుక యేల? కమలాక్షా! నీవు ధరించువనమాల యొక్క సుగంధము నాఘ్రాణింపలేని నాసిక ఎందుకు? ధన్యచరితా! నీకు సేవ చెయ్యలేని జన్మము యెన్ని జన్మలెత్తినను వృధాయే కదా!

అని యిట్లు రుక్మిణీ కన్య చెప్పిన సందేశమును విన్నవించి, ఆమె యొక్క అసమాన రూప సౌందర్యాది విశేషములను వర్ణించి చెప్పెను, మఱియు

సీ. పల్లవవైభవాస్పదములు పదములు కనకరంభాతిరస్కారు లూరు
లరుణ ప్రభామనోహరములు కరములు కంబుసౌందర్యమంగళము గళము
మహితభావాభావమధ్యంబు మధ్యంబు చక్షురుత్సవదాయి చన్ను దోయి
పరిహసితార్ధేందుపటలంబు నిటలంబు జితమత్తమధుకరశ్రేణి వేణి

ఆ. భావజాశుగముల ప్రాపులు చూపులు
కుసుమశరునివింటికొనలు బొమలు
చిత్తతోషణములు చెలువభాషణములు
జలజనయనముఖము చంద్రసఖము

ప్రభూ! ఆ రుక్మిణీ కన్యయొక్క పాదములు చిగురాకువలె మృదువుగా నుండునట. (అని అంతఃపుర పరిచారికల వర్ణన). ఆమె తొడలు సువర్ణఛాయతో అరటి బోదెల వలె నుండునట. చేతులు అరుణకాంతులీనుచు, మనోహరముగ నుండునట. కంఠము శంఖమువలె శోభిల్లుచుండునట, నడుము సింహము నడుమట, ఆమె చన్నులు నేత్రపర్వములుగ నుండునట, ఆమె ఫాలభాగ మర్ధచంద్రునివలె మెఱయుచుండునట. ఆమె వేణి (జడ) గండు తుమ్మెదల వరుసవలె నుండును. ఆమె చూపులు మన్మథబాణమువలె నుండునట.

కనుబొమలు మన్మథుని వింటి కొనలవలె నుండునట. ఆమె భాషణములు (పలుకులు) మనస్సు కాహ్లాదము కలిగించునట్టివి. ఆమె ముఖము చంద్ర సదృశమే!

ఉ. ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనకుం దగు దీవు మాయుపా
ధ్యాయులయాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యము లేల నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తు గాని వి
చ్చేయుము శత్రులన్ నుఱుముసేయుము సేయుము శోభనం బిలన్

ప్రభూ! ఆ సుందరియే నీకు తగిన జంట, మఱియు నీవే యామెకు సరియైన పతివి, ఇది నిజము, మా గురువుల సాక్షిగా చెప్పుచుంటిని, మీ యిరువురకు నిశ్చయముగ పెండ్లియగును. ఇక జాగేల? నీ పరివారము వారిని తోడ్కొనిపోయి, పద్మాననయైన యా రుక్మిణిని తెచ్చెదవుగాక! విచ్చేయుము. శత్రువులను నశింపజేయుము లోకమునకు శుభము చేయుము.

అని యిట్లు పలికిన బ్రాహ్మణుని వలన విదర్భరాజు తనయ పంపించిన సందేశమును, ఆమెయొక్క రూప, సౌందర్యాది విశేషములను విని, సంతసించి తనచేతితో బ్రాహ్మణుని చేతిని పట్టుకొని, నవ్వుచు ఆ యాదవేంద్రుడిట్లనెను:

ఉ. కన్నియమీఁద నాతలఁపు గాఢము కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు నావివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే
మున్నె యెఱుంగుదున్ బరులమూఁక లడంచి కుమారిఁ దెత్తువి
ద్వన్నుత మ్రాను ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁ దెచ్చుకైవడిన్

ఓ విద్వత్పూజ్యుడా! రుక్మిణీ కన్యపై నా కిదివరకే మనస్సు గాఢముగ లగ్నమైపోయెను. రాత్రులందు నాకు నిద్రపచ్చుటలేదు. (రుక్మిణి యన్న) రుక్మి నాయెడల ద్వేషభావముతో ఈ వివాహమును సహింపలేక కీడు తలపెట్టునని నే నిదివరకే యెఱుగుదును. శత్రుమూకల నణచివేసి కన్యను నేనిచ్చుటికి తీసుకొని వచ్చెదను.

క. వచ్చెద విదర్భభూమికిఁ
జొచ్చెద భీష్మకునిపురము సురుచిరలీలన్
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్

భూసురోత్తమా! నేను విదర్భరాజ్యమునకు వచ్చెదను. భీష్మకుని నగరమందు అవలీలగ ప్రవేశించెదను. బాలామణియైన రుక్మిణిని తెచ్చెదను. నా కడ్డము వచ్చి యుద్ధము చేయు శత్రువులను చిటికలో చీల్చివేసెదను.

అని పలికి, రుక్మిణి పెండ్లి ముహూర్తమెప్పుడో తెలుసుకొని, ప్రయాణమునకు సిద్ధపడగా, రథసారథియైన దారుకుడు, శైబ్య సుగ్రీవ, మేఘపుష్ప, వలాహక మనెడి అశ్వములను పూన్చి, రథమును తీసుకొనిరాగా, శ్రీహరి, బ్రాహ్మణుని తోడ్కొని, విదర్భదేశమునకు వెళ్లెను. ఆ సరికి కుండినపురాధీశుడైన భీష్మకుడు, కొడుకునకు వశుడై రుక్మిణిని శిశుపాలున కిచ్చుటకు పెండ్లి ప్రయత్నములు చేయించెను. అప్పుడు :

దారులు, బాటలు, రాజమార్గములు, అంగడిప్రదేశములు, విశాలముగ చేసి, సుగంధజలములు చల్లి, తోరణములు ముగ్గులతో నలంకరించి, నగర వీథులను, గృహములను, తోరణ పతాకములతో సుందరముగ నలంకరించిరి, మంగళ వాద్యములతో నగరమంతా మారుమ్రోగెను. అంతటను ఉత్సవ వేడుకలు నిండియుండెను.

భీష్మకుడు, విహిత ప్రకారముగ పితృదేవతల నర్చించి బ్రాహ్మణులచే మంగళాశీర్వచనముల జదివించి, రుక్మిణీ కన్య కభిషిక్తము చేయించి, వస్త్రములను ధరింపజేసి, మణిమయ రత్నభూషణములతో నలంకరింపజేసి, ఋుక్ యజుః సామవేదమంత్రములచే మంగళాచరణములు చేయించెను. బ్రాహ్మణులు రక్షాకరణము లాచరించిరి. పురోహితులు గ్రహశాంతి కొఱకు హోమము చేసిరి. వధూవరుల మేలుకొఱకు రాజు, తిలదాన, గోదాన, వస్త్రదాన, కనక దానములను ధరణీదేవతలకిచ్చెను.

ఆ సమయమున, అనేకమైన రథములు, అశ్వములు, గజములు, భటులతో కూడిన పటాటోపముతోను బంధుమిత్ర పరివారములతోను, మిక్కిలి

అహంకార బలదర్పములతో, చైద్యరాజైన శిశుపాలుడు విదర్భరాజ పుత్రికయైన రుక్మిణిని పొందుటకు, వచ్చి చేరెను. కృష్ణబలరాములు వచ్చినచో పారద్రోలుటకు సిద్ధముగ శిశుపాలుని మిత్రులును, కృష్ణ శత్రువులును, అయిన జరాసంధ, దంతవక్త్ర సాల్వ విదూరథ, పౌండ్రకాదులు, రథగజ తురగ పదాతి సేనలతో, ఎట్టి ఆటంకము కలుగకుండ శిశుపాలుని వివాహము జరిపించుటకు వచ్చిచేరిరి. మఱియు, నానాదేశముల రాజులనేకులు వచ్చిచేరిరి. భీష్మకుడు శిశుపాలునకు ఎదురువెళ్లి సత్కరించి, విడిదిజూపెను.

బలరాముడిట్లు తలంచి, ఒక పెద్దసేనతో శ్రీకృష్ణునివెనుక తరలివచ్చెను కృష్ణుడొక్కడే విదర్భకు వెళ్లెను. శిశుపాలుని మిత్రులందరు సేనలతో వచ్చెదరు. ముఖ్యముగ కంసపత్నుల తండ్రియైన జరాసంధుడు కృష్ణునిపై కక్షకట్టి యున్నాడు. రుక్మిణిని తెచ్చునప్పుడు వీరందరితో యుద్ధము జరుగును. గావున కృష్ణునకు సహాయమవసరము - అని భావించి సేనను తీసుకొని వెళ్లెను.

ఇంతలో ఆ రుక్మిణీ కన్య శ్రీకృష్ణుడు వచ్చి తన్ను కలియడేమో యని శంకాకుల చిత్తయై యిట్లు తలపోసెను.

శా. లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁడు
దుగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నాయత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృతమెబ్బంగిన్ బ్రవర్తించునో

రేపే లగ్నము, వివాహము దగ్గర పడినది. గోవిందు డింకను రాడేమి? నా మనస్సు అలజడి చెందుచున్నది. ఆ బ్రాహ్మణుడు అగ్నిద్యోతనుడేల ఆలస్యము చేసెనో! బ్రాహ్మణుడు చెప్పిన వృత్తాంతమంతయును శ్రీకృష్ణుడు వినెనో, వినలేదో! నా ప్రయత్నము సిద్ధించునో భగ్నమైపోవునో! ఇంతకూ ఆ బ్రహ్మదేవుని చేష్టితమే విధముగ జరుగనున్నదో!

మ. ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది దప్పుగాఁ దలఁచెనో విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నాభాగ్య మెట్లున్నదో

ఆ భూసురోత్తముడు సుఖముగ ద్వారక చేరగలిగెనో, లేక మధ్యలో నెక్కడైనను మార్గాయాసముచే చిక్కుకొనెనో! అతడు క్షేమముగ చేరి, నా సందేశమును శ్రీకృష్ణునకు సమముగ విన్నవించెనో, లేదో! శ్రీకృష్ణుడది విని తప్పుగా తలచెనేమో! (ఒక రాజవంశపు కన్య ఒక అపరిచితున కిట్లు సందేశము పంపుట, లేదా, రాక్షసపద్ధతిని కన్యనెత్తుకొని పోవుట సరికాదని భావించెనేమో!) లేక, (దయామయుడు గాన, నన్ను రక్షించుటకు) విచ్చేసెనేమో! పరమేశ్వరుడు నా సంకల్పమునకు అనుకూలించునో లేదో! గౌరీమహాదేవి నన్ను కాపాడ దలచునో లేదో! ఇంతకూ, నా భాగ్యమెట్లున్నదో, యని పరిపరివిధముల తర్కించుకొనుచు, నిఃస్పృహ చెందుచు నిట్లు తలపోసెను:

ఉ. పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవువీటికి వాసుదేవుడున్
రాఁ డను వింకఁ బోయి హరి రమ్మని చీరెడి యిష్టబంధుఁడున్
లేఁ డను రుక్మికిం దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు ను
న్నాఁడను గౌరి కీశ్వరికి నావలనం గృప లేదు నేఁ డనున్

యదువీరుని యింటికి బ్రాహ్మణుడు చేరియుండడు, చేరలేడు, వాసుదేవుడు రాలేడు, రాడు. ఇక నేనేమి చేయగలను? శ్రీహరిని పిలుచుకొని రమ్మని పంపించుటకు విశ్వాసపాత్రుడు, ఇష్టబంధువు ఇంకెవ్వడును లేడు, సమయము కూడలేదు. శిశుపాలునకు నన్నిచ్చెదను అనుచున్న రుక్మికిప్పుడు ఎట్టి ఆటంకమును లేదు. ఇప్పుడు ఈశ్వరియైన గౌరికి కూడ నా యందు కృపలేదు, అని చింతించుచు, నామె,

ఉ. చెప్పదు తల్లికిం దలఁపుఁజిక్కు దిశల్ దరహాసచంద్రికన్
గప్పదు వక్త్రతామరసగంధసమాగతభృంగసంఘమున్
రొప్పదు నిద్రఁ గైకొన దురోజపరస్పరస క్తహారముల్
విప్పదు కృష్ణమార్గగతవీక్షణపంక్తుల ద్రిప్ప దెప్పుడున్

ఆ కన్య తన మనస్సులో నున్న ఆలోచనల జటిల సమస్యను తల్లికైనను చెప్పుకొనదు. చిరునవ్వులను చిందించదు. పెదవులు కలువలని భ్రమపడి తననోటివద్ద సంచరించు భ్రమర సమూహము నైనను రొప్పదు. నిద్రపోవదు.

మెడలో చిక్కుపడియున్న హారముల నైనను విప్పి, సవరించుకొనదు. చూడ్కులను కృష్ణుడు రాబోవు మార్గముననే నిలిపి, ఒక్కక్షణమైనను ఇటు నటు త్రిప్పదు.

చ. తుడువదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
ముడువదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జన దన్న మేమియుం
గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్
నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్

శ్రీకృష్ణాగమన నిరీక్షణయందు మునిగియున్న రుక్మిణీ కన్య, నిర్విరామముగ ప్రవహించు కన్నీటి ధారలనైనను తుడుచుకొనదు. చిందరవందరగా చెదిరియున్న జుట్టునైనను సవరించి ముడివేసుకొనదు. చెలికత్తెలతో నైన ముచ్చట లాడదు. అన్నము తినదు. నీరైనను త్రాగదు. చిలుకకు మాటలు నేర్పదు. వీణను మీటి వినోదింపదు. ఎవ్వరినీ సమీపింపదు.

సీ. మృగనాభి యలఁదదు మృగరాజమధ్యమ జలముల నాడదు జలజగంధి
ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ తొడవులు దొడవదు తొడవుతొడవు

ఆ. తిలక మిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవు మాలి యనుచు

తనను గౌరవించి, కరుణతో స్వీకరించుటకు కొంటె కృష్ణయ్య రాడేమి యను రోషముతో రుక్మిణీ కన్య కస్తూరిని అలదుకొనదు. ఆ పద్మగంధి జలక్రీడలాడదు, అద్దమువంటి మోముగల ఆ సుందరి అద్దమైనను చూచుకొనదు. పువ్వులను తలలో తురుముకొనదు. ఆ పూబోణి, వన విహారమునకు పోవదా వనజాక్షి. పుష్పలతలను పోషింపదా లతాంగి. హంసలను పోషింపదా హంసగమన. కొలనులో కమలములతో నాడుకొనదా కమల హస్త

ఆభరణములను ధరింపదా అందాలరాశీ. తిలకము పెట్టుకొనదా సౌందర్య తిలక.

ఇట్లు శ్రీహరి రాకకెదురు చూచుచు, అన్ని విషయములయందును విరక్తయై మనోవేదనతో క్రుగ్గిపోవుచున్న మగువకు శుభమును తెలుపునట్లు ఎడమకన్ను భుజము, తొడ అదిరినది. అప్పుడు శ్రీకృష్ణుని కడకు వెళ్లిన బ్రాహ్మణుడు తిరిగివచ్చెను. అతని ముఖలక్షణములను పరికించి చూచినదా బాలామణి. చిరునవ్వుతో వచ్చి ఎదురుగా నిల్చున్న బ్రాహ్మణోత్తముడా కన్యతో నిట్లనెను:

ఉ. మెచ్చె భవద్గుణోన్నతి కమేయధనావళు లిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునన్ గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా

రాకుమారీ! ఆ సుదర్శనాయుధుడు వచ్చెను. అతడు నీ యొక్క ఉత్తమ సద్గుణములకు మెచ్చుకొనెను. నేను చెప్పిన నీయొక్క సందేశమునకు మిక్కిలి సంతసించినవాడై నాకు అమితమైన ధనము నిచ్చెను. అతడు వచ్చెను గనుక ఇక నీ కెట్టి భయమును ఉండదు. దేవదానవులేకమై యుద్ధము వచ్చినను, నిన్ను రాక్షసవివాహ పద్ధతిని కొనిపోవును. నీ యొక్క సచ్చరిత్రము, భాగ్యమును నేడు ఫలించినవి గదమ్మా! అనిన ఆ బ్రాహ్మణునితో రుక్మిణి యిట్లనెను:

మ. జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి నన్
నిలువంబెట్టితి నీకృపన్ బ్రదికితిన్ నీయంత పుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలిఁ గావించెద భూసురాన్వయమణీ సద్బంధుచింతామణీ

ఓ భూసురరత్నమా! నా సందేశమును విన్నవించి, శ్రీకృష్ణుని తోడ్కొని వచ్చితివి. నా ప్రాణముల నిలబెట్టితివి. నీ యొక్క కృపచే నేను బ్రతికిపోయితిని. నీ వంటి పుణ్యాత్ములింకెవ్వరైన నుందురా! దీనికి నేను నీ కెటువంటి ప్రత్యుపకారము చెయ్యగలను? ఏమియును చెయ్యలేనట్టి నిస్సహాయను. ఓ సద్బంధు చింతామణీ! నీకు దోసిలొగ్గి నమస్కరించెదను.

అంత, బలరామకృష్ణులు తమ పుత్రిక వివాహమునకు విచ్చేసిరని వినిన భీష్మకుడు మంగళవాద్యములతో నెదురుగా వెళ్లి విధిప్రకారము, వారిని పూజించి, మధుపర్కములిచ్చి, వివిధ అంబర ఆభరణములు మొదలైన కానుకలిచ్చి, బంధుజన సేనాసమేతులై వచ్చిన వారికి ఉచిత వసతులు కల్పించెను. అట్లే విచ్చేసిన ఇతర రాజులను సత్కరించి వసతులు కల్పించెను. శ్రీకృష్ణుడు విచ్చేసెనని విని విదర్భపురవాసులు గుంపులుగా వచ్చి కన్నులపండువుగా అతనిని తిలకించి, ఆనందబాష్పముల రాల్చి ఆ దివ్యసుందర వదనకమలమునుండి చూడ్కులు మరలింప జాలకుండిరి. మఱియు, వారు తమలోతామిట్లు చర్చించుకొనిరి: మహానుభావుడైన హరికి ఈ విదర్భరాజపుత్రి చక్కగ తగియుండును, మఱియు నీపై దర్భికి అతడే ముమ్మూర్తుల తగియున్న వరుడు. ఇంత మంచి దాంపత్యము కుదిరి యుండగా మఱి ఆ బ్రహ్మ ఎందులకు తన తెలివినుపయోగించి అట్లుకాకుండ తగులబెట్టెనో! మా అందరి పుణ్యవిశేషము చేత మా రాకుమారియైన ఈ రమణికి ఆ హరియే భర్త యగుగాక! అని యనుకొనిరి.

ఆ సమయమాసన్నమయ్యెను. రుక్మిణీ కన్య గౌరీ మందిరమునకు వెళ్లవలసియున్నది. చుట్టును, వీరభటులు, ఆయుధధారులై నడుచుచుండ, ముందర, వారకాంతలు, దేవికి ఉపహారములు కానుకలు పట్టుకొని నడచుచుండ, పుష్పములు, గంధము, కుంకుమపువ్వు, మొదలైన సుగంధ ద్రవ్యములను ధరించి, కీర్తనలు పాడుచు, బ్రాహ్మణ పుణ్యస్త్రీలు నడువగ, వేణువు, మద్దెలలు, శంఖములు, భేరీనాదములు మంగళధ్వనులు చేయు చుండగ, సఖులు, తల్లులు, బంధువుల భార్యలు, వెంట నడచుచుండగ, రుక్మిణీ వధువు, వినయ మందగమనయై కురులు ఫాలముపై కదిలి యాడుచుండగ, ఆదిశక్తి మందిరమునకు నడచి వెళ్లుచుండెను.

మఱియు, వందిమాగధులు, గాయక పాఠకజనులు, అభినందించు చుండగ, కన్య, మందగమనమున పోవుచు, ముకుంద చరణార విందములను హృదయములో తలచుచు, గౌరీమందిరమును సమీపించి, కాలుచేతులు కడుగుకొని శుచియై దేవి చెంతకు చేరెను. బ్రాహ్మణ ముత్తైదువులు పార్వతీ

పరమేశ్వరులకు అభిషేకము చేసి గంధాక్షతల నిడి, వస్త్రమాల్యాది భూషణములతో నలంకరించి, ధూపదీపములను జూపి, నానావిధ ఉపహారములను సమర్పించి, కానుకలిచ్చి, దీపమాలికల నివాళులర్పించి, రుక్మిణీ కన్యచే మ్రొక్కించిరి. అప్పుడా కన్య ఆదిదంపతుల నీవిధముగ మనస్సులో ప్రార్థించెను.

ఉ. నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ మేటిపె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతిఁ జేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ

అమ్మా! సనాతనులైన ఆదిదంపతులు మీరు, ఉమామహేశ్వరులైన మిమ్ములను నేను మదిలో నమ్మితినమ్మ! అమ్మలగన్నయమ్మ! మేటి పెద్దమ్మా! మిమ్ములను నేను బాగుగ భజించుచుంటిని గదమ్మా! నీవు దయాసాగరివి కదమ్మా! శ్రీహరిని నాకు పతిగా ప్రసాదింపుమమ్మా! నిన్ను నమ్మిన వారికెన్నటికిని, నాశములేదు గదమ్మా! సర్వేశ్వరీ! అని మ్రొక్కి, బ్రాహ్మణ ముత్తైదువులకు అపూపములను, కంఠసూత్రములను, ఫలతాంబూలములను చెఱకు గడలను ఇచ్చి, రుక్మిణి, వారలను పూజించెను. వారు ఆమెను శిరముపై అక్షతలు చల్లి ప్రేమతో అమితముగ దీవించిరి. ఆమె తలనిండ అక్షతలతో శివానికి నమస్కరించి, తేలిక పడిన మనస్సుతో నెమ్మదిగ బైటకు వచ్చెను.

అప్పుడా కన్య ఏ రీతిగ కన్పించె ననగా -

కారుమేఘముల మధ్యను మెఱిసే విద్యుల్లతవలెను, చంద్రమండలము నుండి దిగివచ్చిన లేడిపిల్లవలెను, విష్ణుమూర్తి దేవదానవులకు అమృతమును పంచి యిచ్చుటకై అవతరించిన మోహిని వలెను, సాగరమథనమున ఉద్భవించిన లక్ష్మీదేవివలెను, మానససరోవరమున స్వర్ణకమలముల మధ్య దర్పముతో విహరించు రాజహంసవలెను, వక్షోజ భారమును మోయలేని సన్నని నడుము గలదిగను, రత్నఖచిత కాంచన కర్ణాభరణకాంతులు చెక్కిళ్లపై మెఱయునదిగను, కమలముల సుగంధముచే నాకర్షింపబడిన నల్లని గండు

తుమ్మెదల సమూహమువలె కనబడు కురులతో నున్నదిగను, సుందర మందహాస కాంతులు, బాలచంద్రికా సౌందర్యశోభను వెదజల్లు వదనము గలదిగను, సువర్ణవర్ణ చంద్రవదనమునకు శోభను చేకూర్చునట్టి యెఱ్ఱని అధరములు కలదిగను, మన్మథ బాణముల వంటివియును రాజపుత్ర వీరుల హృదయములను భేదించునట్టివియును అయిన వాడిచూపులు గలదిగను, వీనుల విందుగ వినిపించు, గజ్జలందియల ధ్వనులను వెదజల్లునదిగను, కనిపించుచున్న రుక్మిణీ వధువు, శ్రీహరి రాకకు ఎదురుచూచుచు, పాదచారిణియై, వీరమోహినియై వచ్చుచుండగా -

తుమ్మెదల వంటి నల్లని ముంగురులతో పూర్ణచంద్రబింబమువంటి ముఖముతో, లేడికనులవంటి కన్నులతో, లేతమామిడిచిగురువంటి పెదవులతో, కోకిల కంఠముతో, లేత తమలపాకువంటి పాదములతో, చక్కగ సౌష్ఠవముగ పెరిగిన చన్నులతో, మదపుటేనుగు మందగమనముతో నడచుచు, ఎఱ్ఱకలువలవంటి హస్తములుగల సింహమువంటి నడుముగల పద్మగంధియైన రుక్మిణి చూపరులను విభ్రాంతులుగ చేసెను.

మఱియు, ఆ సుందరి యొక్క సిగ్గుతో కూడిన మందహాసమును చూచిన రాజ కుమారులందరును, బాటకిరువైపుల నిల్చొని, మతులు పోగొట్టుకొని, ధైర్యములు దిగనాడి, గాంభీర్యములను విడిచి, గౌరవములు మఱచి చేష్టలు మాని, ఎఱుకలుడిగి, ఆయుధములు చేజార్చుకొని, వాహనముల నెక్కుట మఱచి నిర్వీర్యులై నేల చదికిలబడిరి. ఆహరిణాక్షి తన ఎడమచేతితో, నుదుటిపై నాడుకొనుచున్న ముంగురులను ఎగద్రోయుచు, ఉత్తరీయమును (పైటచెంగును) సరిజేసుకొనుచు క్రీగంటి చూపులతో, శ్రీకృష్ణుని గురించి వెదుకుకొనుచు, ఆ రాజకుమారులను ఒక్కొక్కరిని పరికించి చూచుచుండెను: అప్పుడు -

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖున్ గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశదే
హు నగారాతిగజేంద్ర హస్తనిభబాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్

చంద్రబింబమువంటి మోము కలవానిని, సింహనడుము గలవానిని, కమలరేకులవంటి నేత్రములు గలవానిని, విశాలవక్షుని, నీలమేఘశ్యాముని, ఏనుగు తొండములవంటి బాహువులు గలవానిని, సర్వాలంకార భూషితుని, శంఖమువంటి కంఠముగలవానిని, చక్రహస్తుని విజయోత్సాహిని, జగన్మోహనుని, శ్రీకృష్ణుని గాంచెను.

చూచి, అతని రూప వయో లావణ్య వైభవ గాంభీర్య చాతుర్య తేజోవిశేషములకు సంతసించి, మన్మథబాణ పీడితయై రథమునెక్క గోరుచుండు కన్యకారత్నమును జూచి, శత్రురాజులు చూచుచుండగా, మందగమనమున వచ్చు మదపుటేనుగువలె వచ్చి, అచ్చటనున్న రాజుల గుంపులను లక్ష్యపెట్టక, తృణీకరించి, రాజ కన్యకను తెచ్చి, తన రథముపై నిడుకొని, భూమి ఆకాశములు దద్దరిల్లునట్లుగ శంఖము పూరించుచు, శ్రీహరి బలభద్ర సమేతుడై యాదవసేనవెంట వచ్చుచుండగ, ద్వారకానగర మార్గము పట్టి పయనించెను. అంత జరాసంధునికి లోబడియున్న రాజులందరును శ్రీకృష్ణుని సాహసకృత్యమును సహింపలేని వారై - యిట్లు భావించిరి-

సింహము చేసిన వేటయొక్క ఘనతను, దానివెనుకను తిరుగు క్షుద్రజంతువు కాజేయునట్లు, మనవంటి గొప్ప రాజరికపు చిహ్నమైన ఈ రాజకన్యను, మతిచెడిన ఈ గొల్లలు ఎత్తుకొనిపోవుచుండగా మన శౌర్యమెందులకు? ఈ శస్త్రాస్త్రములన్నీ ఎందుకు? కాల్పనా? ఈ సుందరిని మనము విడిపింపకున్న, పురవీథులందును నగరములందును ప్రజలు నవ్వరా, గేలి చేయరా?

అని ఆ జరాసంధాది రాజులు తమలో తాము తర్కించుకొని, రోషములను మనస్సులలో నింపుకొని, వెంటనే ఉద్యమించి, కవచ, ధనుర్బాణాది సాధనములను ధరించి, పంతము లాడుకొని, తమతమ చతురంగ బలములతోగూడ, యాదవులవెంటబడి, సమీపించి, నిలువుడు, నిలువుడు, అని ధిక్కరించి పలికి, అతిశయించి, వారిపై బాణవర్షములను కురిపింపగా, యాదవవీరులు బాణములనెక్కుపెట్టి, ధనుష్టంకారములు చేసి నిలువబడిరి. అప్పుడు.

శత్రుసేనలు, బలపటాటోపములతో యాదవసైన్యములను బాణవర్షముచే గప్పివేయుటను గాంచిన రుక్మిణి, సిగ్గుతోను, భయముతోను, భీతహరిణము వలె శ్రీహరి వంక జూచెను.

అప్పుడు శ్రీకృష్ణుడామె భయమును గుర్తించి యిట్లనెను : పద్మాక్షీ! చూచుచుండుము; మన యాదవవీరులు శత్రుసేనలయందెట్లు చొచ్చుకొని పోయి, వారి నేవిధముగ చీల్చిచెండాడెదరో నేడు జూడుము, అని ఆమె నూఱడించి భయము దీర్చెను.

అంత, బలభద్రప్రముఖులైన యదువీరులు ప్రళయకాలపు పిడుగులవలె విరుచుకుపడుచు, జరాసంధాది శత్రురాజ సమూహముల సేనలపై అసమాన పరాక్రమముతో బాణపరంపరలను కురిపింపగా, ఆ బీభత్సమైన రణరంగ మెట్టులుండె ననగా - చీల్చబడిన మత్తగజములతోను, విచ్ఛిన్నమైన గుఱ్ఱములతోను, విరిగిముక్కలైన రథములతోను, చంపబడిన పదాతిసేనలతోను, ఖండింపబడిన మస్తకములు, వక్షములు, కంఠములు, హస్తములు, తొడలతోను, విరిగిపోయిన గదలు, ఖడ్గములు, శూలములు, బాణములతోను, పతనమైన ధ్వజములు, చామరఛత్రములు, రక్తప్రవాహముతోను, భూతబేతాళ కలకల ధ్వనులతోను, రక్తమాంసాదులను తినగోరు జంబుకములు, గ్రద్దలు రాబందులతోను కోలాహలముగ నుండెను. యాదవులచేత బాగుగ దెబ్బతిని ప్రాణభయముతో జరాసంధాది రాజులు వెనుకకు మరలి దుఃఖితుడైయున్న శిశుపాలుని అవస్థను జూచిరి. శిశుపాలుడు భార్యను పోగొట్టుకొన్న వానివలె, శోకముతో నిట్టూర్పుచుండుటను గాంచి, యాదవులచేత జిక్కకుండ ప్రాణముతో నున్నందుకు సంతోషింపుమని చెప్పి, వారిట్లనిరి :

ఆ. బ్రదుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండిన
బ్రదుకు గలిగె నేని భార్య గలదు
బ్రదికి తీవు భార్యపట్టు దైవ మెఱుంగు
వగవ వలదు చైద్య వలదు వలదు

మిత్రమా! ఓర్చుకొనుము. శరీరమందు ప్రాణముండిన బ్రతుకవచ్చును. బ్రతికియున్నచో భార్యయే దొరకకుండునా! ఆ యాదవుల చేజిక్కకుండ బ్రతికిపోయితివికదా! సంతోషించు. భార్య విషయమా! దైవమే చూచుకొనునులే, విచారింపవలదు. వలదు వలదు, చైద్యరాజా! జరాసంధు డింకా ఇట్లు చెప్పెను:

మిత్రమా! వినుము. దేహధారి స్వతంత్రుడు గాడు. యంత్రగానిచేతిలో కీలుబొమ్మవలె, ఈశ్వరుని విధాన పరతంత్రుడై సుఖదుఃఖములందు నటించును. (తన పాత్రను వహించును). నా విషయమే చూడు, తొల్లి నేను మధురాపురముపై పదునేడు మాఱులు పరాక్రమముతో దండెత్తి పోరి, కృష్ణునిచేత సేనలను పోగొట్టుకొని, బలరామునిచేత పట్టుబడి, కృష్ణుడు కరుణింపగా విడిపింపబడి, పదునెనిమిదవ మాఱున ఇరువది అక్షౌహిణుల సేనతో దాడిచేయుగా బలరామకృష్ణులు పారిపోయిరికదా! జయాపజయములందు ఎన్నడును హర్షశోకములు పొందరాదు, నేడు, ఈ రాజులేకాక శివుడైనను కృష్ణునెదిరించిన ఓడిపోవుట తథ్యము. అంతేకాక, దైవయుక్తమైన కాలవశమున లోకములు పరిభ్రమించుచుండును. అదియును కాక,

యాదవులకు ఇప్పుడు కాలమనుకూలముగ నున్నది గావున, మూడు లోకములను జయింపగలిగిన మనలను వారు జయింపగలిగిరి. అట్లే, మనకు కాలమ్ములై అనుకూలమైనప్పుడు మనమును, శత్రువులను జయించెదము. ఇంత మాత్రమునకు శంకించి, శోకింపనేటికి?

ఇట్లు జరాసంధుడును, ఇతరరాజులును, శిశుపాలుని ఊరడించి, అతని పరితాపమును నివారించి తమతమ రాజ్యములకు జనిరి. శిశుపాలుడును, తన అనుచరులను తోడ్కొని తన నగరమునకు మఱలెను. అప్పుడు, రుక్మిణి పెద్ద అన్న అయిన రుక్మి, కృష్ణుడు రాక్షసవివాహము కొఱకై తన చెల్లెలిని కొనిపోవుటను సహింపలేక, ఒక అక్షౌహిణీ సైన్యమును తీసుకొని యుద్ధసన్నద్ధుడై, కృష్ణుని వెంబడించుచు, తన సారథితో నిట్లనెను:

భీష్మక మహారాజపుత్రుడను, బలవంతుడను అయిన నన్ను అవమానించి, నా చెల్లెలిని, రుక్మిణిని గొప్పయోధుని వలె చిక్కకుండ, ఈ గొల్లడు తీసుకొని పోవుచున్నాడు. ఆ రథమును కలుసుకొనునట్లుగ, నింకను శీఘ్రముగ

త్రోలుము. ఈ గొల్లల వంశముయొక్క మదమును అణచివేసెదను. నా ప్రతాపమును జూపెదను.

అని యిట్లు రుక్మి, హరియొక్క శక్తిని తెలియనివాడై, సారథిని తొందరపెట్టి, రథమును కృష్ణుని రథముతో సమానముగ నడిపింపజేసి, "నిలు నిలు, గోపాలక! వెన్నదొంగ! ఒక్కనిముషమాగు. నీ పని పట్టించెదను, అని తిరస్కరించి, బాణముసంధించి మూడు వాడియైన బాణములనువేసి శ్రీహరికి నొప్పి కలిగించి యిట్లనెను:

సీ. మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ నేపాటిగలవాఁడ వేది వంశ
మెందు జన్మించితి వెక్కడఁ బెరిగితి వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాదలును లేవు మాయ గైకొని కాని మలయ రావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు వసుధేశుఁడవు గావు వావి లేదు

ఆ. కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువ వేని విలయకాల
శిఖిశిఖాసమానశితశిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు

ఓరీ గోపాలకా! నీవు మాకు సరిసమానుడవా ఏమి? మా చెల్లిని కొనిపోవుటకు నీవు ఏపాటివాడవు? నీ సంపదలేమిటి? నీ వంశమెట్టిది? నీవెక్కడ జన్మించితివి? నీవెక్కడ పెరిగితివి? నీ ప్రవర్తన యెట్టిది? నిన్నెఱిగిన వాడెవ్వడు? నీవు మానహీనుడవు, మర్యాద లెఱుంగని వాడవు; మాయతోనే సర్వమును ఆడించెదవు. మాయలేకుండ నీ నిజరూపమున సంచరింపవు. శత్రుసమూహములపై దండెత్తగల రాజువుకావు. రాజులతో బంధుత్వము లేదు. నా చెల్లెలినిచ్చివేయుము. నీవు గుణములు లేనివాడవు (గనుక మా చెల్లెలికి తగినవాడవు కావు) ఆమెను విడువుము. విడువకున్నచో యుద్ధమందు ప్రళయకాలాగ్నివంటి నా యొక్క వాడియైన బాణములతో నీగర్వమంతయు హరించివేసెదను. (రుక్మి కృష్ణునియందు ద్వేషముచే అన్నమాటలు ఆధ్యాత్మికముగ భగవంతునకు అన్వయించును) అని రుక్మి అనగా, శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి,

ఒకబాణమున రుక్మియొక్క విల్లును ఖండించి, ఎనిమిది బాణములతో రథమును అశ్వములను కూల్చి రెండు బాణములతో సారథిని పడగొట్టి, మూడు బాణములతో రథధ్వజము నెగులఁగొట్టి, అతడు వేరొక విల్లునందుకొనదానిని గూడ విరిచి ఒక్కొక్క బాణముచే రుక్మియొక్క ఆయుధములను (పట్టిస, పరిఘ, శూల, చర్మాసి, శక్తి, తోమర మొదలైనవి) ముక్కలు చేసి, ఇంకను ఇతర ఆయుధము లెన్నిటిని రుక్మి ఎత్తిన, అన్నిటిని ఖండములజేసెను. ఇక చేయునది లేక రుక్మి రోషముతో ఖడ్గమును చేతబూని, అగ్నిమంటవైపు జోరుగ నెగిఱిపోవు మిడుతమాదిరి, శ్రీకృష్ణుని మీదికి దూసుకొని పోయి, ఎగిసిపడెను. శ్రీకృష్ణుడు వాని ఖడ్గకవచములను ముక్కలుచేసి, తన ఖడ్గమును దూసి రుక్మి శిరస్సును తెగగొట్టుటకు సిద్ధపడగా రుక్మిణి అడ్డమువచ్చి, శ్రీకృష్ణుని పాదములు పట్టుకొని ఇట్లు వేడుకొనెను:

ఓ అనాథనాథా! దయానిధీ! నీవు ఈశ్వరుడవు, దేవదేవుడవు అని తెలుసుకొన లేక వినియున్నను విశ్వసింపలేక, మా అన్నయైన ఇతడు నీ యెడల గొప్ప అపరాధము చేసెను. ఓ అమరసన్నుతా! నన్ను మన్నించి, మా అన్నను కాపాడుము సర్వలోకశరణ్యా!

ప్రభూ! ఇతడు పరుషవాక్కులాడి నీ యెడల అపరాధము చేసినవాడే, దండనార్హుడే, నేను కాదనను. అయినను, ఇతనిని నీవు చంపినచో, స్వయంగా ఈశ్వరుడైన ముకుందుడే మా అల్లుడైనాడు, మేమెంత భాగ్యవంతులము అని ఆనందించుచున్న మా తల్లిదండ్రులు పుత్రశోకములో చిక్కుకొని కృంగిపోవుదురు స్వామీ! కరుణింపుము -

అని మహాభయముతో, వణకుచున్న శరీరముతో, గద్గద స్వరముతో చెమర్చిన కన్నులతో, కన్యారత్నము మ్రొక్కగా శ్రీకృష్ణుడు ప్రసన్నుడై, రుక్మిని చంపకుండ, బావా రమ్మని, చిరునగవుతో పిలిచి, బంధించి, తల, గడ్డము, మీసము గొఱిగి, విరూపునిగ జేసెను అంతట, శత్రువులను తఱిమివేసి బలభద్రుడు వచ్చి చేరి, రుక్మి అవస్థను గాంచి, జాలిపడి, కట్లువిప్పి, శ్రీకృష్ణునితో యిట్లనెను.

తమ్ముడా! ఈ భీష్మక పుత్రుని దూరముగ పొమ్మనకుండ ఈ విధముగ

తలను, మీసమును గొఱుగుట నీకు తగునా? ఇతడిప్పుడు మన బంధువు కూడను. బంధువునకు తలయు మీసమును గొఱుగుట తలనఱకుట కంటెను అవమానకరము కాదా! కొందఱు శత్రువులని వారికి కీడును, కొందఱు మిత్రులని వారికి మేలును చేకూర్పవు. నీవు అందరిపట్ల సముడవు కదా! మరి ఇతనిపట్ల ఈ భేదబుద్ధి ఏలనయ్యా - అని పలికి, రుక్మిణితో నిట్లనెను:

శా. తోడంబుట్టినవానిభంగమునకున్ దుఃఖించి మాకృష్ణు నె
గ్గాడం జూడకు మమ్మ పూర్వభవకర్మాధీన మైప్రాణులన్
గీడున్ మేలును జెందు లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మ శేషపరిభూతుం డయ్యె నేఁ డియ్యెడన్

అమ్మా! రుక్మిణీ! మీ యన్న యొక్క భంగపాటుకు నీవు మా కృష్ణుని నిందింపబోకుము. ప్రాణులు పూర్వజన్మ కర్మాధీనులై మేలు కీడులను పొందెదరు. అంతేగాని, శిక్షించుట, రక్షించుట, ఎవ్వరో చేయుదురని భావింపరాదు. మీ అన్న యొక్క అవమానమునకు కారణము, అతని కర్మశేషమేయని భావింపుము.

చంపదగునట్టి దోషము చేసినను, బంధుజనుల జంపరాదు. అట్టివారిని విడిచిపెట్టుటయే ధర్మము. చంపినచో దోషము సిద్ధించును. మొదటనే చచ్చిన వానిని మఱల చంపుట యికనేల? (మరణ శిక్షార్హులు ఎట్టెనను ప్రభుత్వముచే శిక్షింపబడుదురు గావున ఇతరులు దోషులను చంపరాదు. అట్లు చంపినచో వారు హత్యాదోషమునకు పాల్పడుదురు - అని భావము)

బ్రహ్మచేత రాజులకీ ధర్మము కల్పింప (నిర్దేశింప) బడినది. కాని కొందరు దుష్టరాజులు, రాజ్యకాంక్షచేత తోబుట్టువులనైనను అతి క్రూరులై చంపుదురు. అహంకారులు (కొందరు రాజులు) భూమికొఱకును, ధనధాన్యముల కొఱకును, భామలకొఱకును, దురభిమానముచేతను, అధికారము కొఱకును, కాంక్షించి, మంచీచెడు గానక ఐశ్వర్యమదమున ఇతరులపై దాడిచేయుదురు.

ఇంకను వినుము. దైవమాయచేత, దేహాభిమానులైన మానవులకు బంధువు శత్రువు తటస్థుడు అను భేదభావములుండును. వేర్వేరు జలపాత్రలలో, ఒకే

సూర్యుడు వేర్వేరుగ ననేకములుగ నున్నట్లు కన్పించు మాదిరిగ, ఆత్మ ఒక్కటే అయినను, దేహధారుల కనేకముగనున్నట్లనిపించును. తటస్థముగ నుండు సూర్యునివలన దృశ్యమానములైన వస్తువులన్నీ ప్రకాశించునట్లు, తటస్థముగ నుండు ఆత్మవలన దేహేంద్రియములు ప్రకాశించుచుండును. ఆత్మకు దేనితోను సంయోగ వియోగములుండవు. జనన మరణములు దేహమునకేగాని, ఆత్మకు లేవు.

అమ్మా! శోకము అజ్ఞానమువలన కలుగును. నీవు విజ్ఞానవతివి గావున నీకు మీ అన్న విషయమై శోకము తగదు.

ఈ విధముగ బలరామునిచే బోధింపబడి, రుక్మిణి ఊరట జెందెను. పరాభవింపబడిన రుక్మి తన వికృతాకారమునకు మిక్కిలి ఖిన్నుడై కృష్ణుని గెల్చిగాని కుండిన పురమున ప్రవేశింపనని ప్రతిజ్ఞచేసి, ఆ దగ్గరలోనే నివసించు చుండెను. ఈ విధముగ

క. రాజీవలోచనుఁడు హరి
రాజసమూహముల గెలిచి రాజస మొప్పన్
రాజిత యగుతనపురికిని
రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్

పరీక్షిన్మహారాజా! రాజీవనేత్రుడైన శ్రీహరి, తన్నెదిరింపవచ్చిన రాజసమూహములను ఓడించి, రాజఠీవితో శోభిల్లుచుండు ద్వారకానగరికి, తేజస్విని యైన రుక్మిణిని, బంధువర్గమంతా మెచ్చునట్లుగ, గొనివచ్చెను.

ద్వారకానగరిలో వివాహప్రయత్నములు ప్రారంభింపబడినవి. అంతటను గీత, నృత్య, వాద్యములు మారుమ్రోగినవి. ప్రతి గృహమందును నరనారీ సమేతముగ గృహస్థులు అలంకరించుచుండిరి. వీధులు మార్గములు పన్నీటి జల్లులతో తడిసి యున్నవి. ప్రతిద్వారము వద్దను అరటి మొక్కలతోను, కర్పూరకుంకుమ అగరు ధూప, దీప, పూర్ణకుంభములతోను అలంకరించిరి. ఇంటి అరుగులు, ద్వారములు గడపలు, సుగంధపుష్పతోరణములతోను, దీప స్తంభములతోను, ఎగురవేయబడిన పతాకములతోను శోభాయమానముగ నుండెను.

మ. ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతో హారిణిన్ మానవై
భవగాంభీర్యవిహారిణిన్ నిఖిలసంపత్కారిణిన్ సాధుబాం
ధవసత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్యసంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీచూడామణిన్ రుక్మిణిన్

మహోన్నత యశోవిలాసినియు, తనమానస హారిణియు, మానవతి, ఐశ్వర్యవతియు, సాగర విహారిణియు, సకలసంపదల నొసంగునదియు, సాధువులను, బంధువులను ఆదరించునదియు, పుణ్యచరితయు, మహాదారిద్ర్య నాశినియు, చక్కని వస్త్రాభరణ భూషితయు, గుణవతీ శ్రేష్ఠయు నైన రుక్మిణీదేవిని ఆ శ్రీహరి వివాహమాడెను అని శుకయోగీంద్రుడు పరీక్షిత్తుకు చెప్పెను.

ద్వారకానగరిలోని పుణ్యసతులు, పౌరులును, కరుణామయులు, తేజస్స్వరూపులు అయిన రుక్మిణీ కృష్ణులకు ప్రేమతో భూరికానుకలను తెచ్చి అర్పించిరి.

శ్రీహరి పెండ్లికి కేకయ, కురు, సృంజయ, యదు, విదర్భ, కుంతి దేశముల రాజులు అమితమైన ఆసక్తితో వచ్చి, పరమానందము పొందిరి.

అన్నిదిశల యందున్న రాజులు, రాజపుత్రులు, శ్రీకృష్ణుడీవిధముగ రుక్మిణిని గొనివచ్చి పెండ్లియాడుట అతి దుష్కరము, అపూర్వము, అని ఆశ్చర్యపోయిరి.

మహారాజా! ఆదిలక్ష్మియైన రుక్మిణితోడ క్రీడ సలుపుచున్న శ్రీకృష్ణుని జూచి, పట్టణములో ప్రజలు నిర్భయులై ప్రీతితోను, ఉల్లాసముగాను ఆనందించిరి. అని చెప్పి, ఇట్లు స్తుతించెను.

క. కువలయ రక్షాతత్పర!
కువలయదళ నీలవర్ణ కోమలదేహా!
కువలయనాథ శిరోమణి!
కువలయజన వినుత విమలగుణ సంఘాతా!

భూమండలమును రక్షించు నిష్ఠగలవాడా! నల్లకలువవంటి నీలవర్ణదేహము వాడా! రాజులకు శిరోభూషణ మనదగువాడా! భూమండలములోని ప్రజలందరిచే నుతింపబడు నిర్మల గుణనిధీ! నీకు వందనములు.

మాలిని. సరసిజనిభ హస్తా! సర్వలోక ప్రశస్తా!
నిరుపమ శుభమూర్తీ! నిర్మలారూఢ కీర్తీ!
పరహృదయ విదారీ! భక్త లోకోపకారీ!
గురు బుధజన తోషీ! ఘోర దైతేయ శోషీ!

కలువపుష్పములవంటి చేతులు గలవాడా! సర్వలోకములచే ప్రశంసింపబడువాడా! సాటిలేని శుభంకరా! ప్రసిద్ధమైన నిర్మలకీర్తి గలవాడా! శత్రు హృదయములను చీల్చువాడా! భక్తజనులకు క్షేమము కలిగించువాడా! గురుజనులను, బుధజనులను పోషించువాడా! ఘోరరాక్షసులను దహించువాడా! నీకు ప్రణామములు.

పరీక్షిన్మహారాజా! లక్ష్మీనారాయణులు ఈ విధముగ తమ లీలానాటక ప్రదర్శనమునకు భూలోకములో నిట్లు కలుసుకొనిరి అని శుకయోగీంద్రుడు చెప్పెను.

రుక్మిణీ కల్యాణము సమాప్తము
హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

## 5. కుచేలోపాఖ్యానము

పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రునితో నిట్లనెను : మహాత్మా! శ్రీహరి కథలెన్నివిన్నను తనివితీరదుకదా! అంతియేకాక,

చ. హరి భజియించు హస్తములు హస్తము లచ్యుతుఁ గోరి మ్రొక్కు త
చ్ఛిరము శిరంబు చక్రధరుఁ జేరిన చిత్తము చిత్త మిందిరా
వరుఁ గను దృష్టి దృష్టి మురవైరి నుతించిన వాణివాణి య
క్షరు కథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుఁ బో భువిన్

యోగీంద్రా! నా ఉద్దేశములో శ్రీహరిని భజించే హస్తములే నిజమైన హస్తములు. అచ్యుతుని కోరి మ్రొక్కు శిరమే శిరము. చక్రధరుని చేరు చిత్తమే చిత్తము. ఇందిరానాథుని గాంచు దృష్టులే దృష్టులు; మురవైరిని స్తుతించువాణియే వాణి, అక్షరుని (పరమాత్ముని) కథలను వినెడి కర్ణములే కర్ణములై విలసిల్లు నీ పృథివియందు.

మఱియును, శ్రీహరియొక్క పాదతీర్థ సేవాపరుడై విలసిల్లునట్టి భాగవతుని ప్రకాశమానమైన అంగములే అంగములు కదా! మునీంద్రా! ఆ పరమేశ్వరుని గుఱించి నాకు ఇంకను చెప్పుడు. అనగా ఆ యోగీంద్రుడు ఇట్లు పలికెను. ఓ పరీక్షిన్మహారాజా! కుచేల నామధేయుడొక విప్రుడుండెను. అతడు శాంతుడు, విజ్ఞాననిధి, గర్వరహితుడు, ధర్మవత్సలుడు, విజితేంద్రియుడు, బ్రహ్మవేత్త. అయినను ఆగర్భదరిద్రుడు. దారిద్ర్యమెంత బాధించినను దైన్యత జెందడు. ఎవ్వరినీ యాచింపడు. తనకు లభించినది ఒక కాసు అయినను పదివేల నాణెములుగా దలచి సంతోషించి భార్యాబిడ్డలను ఏదోయొకవిధముగ పోషించుకొని వచ్చుచుండ, ఒకనాడు,

పతివ్రతా శిరోమణియు, ఉత్తమవంశ సంజాతయునగు నతని భార్య, దుస్సహ దారిద్ర్యముచే పీడింపబడుచు, శిశువులాకటి చిచ్చుచే కృశించి, మాడుచు, ఆకుదొన్నెలు పట్టుకొని తినుటకేమైన నిమ్మని హృదయ విదారకముగ నేడ్చుచుండ, భరింపజాలనిదై భర్తచెంతజేరి యిట్లనెను: జీవితేశా! దుర్భరమైన ఈ దారిద్ర్యమునుండి గట్టెక్కుటకు ఏదైన ఉపాయమును

యోచింపవలెను. నాకొక ఊహవచ్చినది. నీ బాల్యసఖుడైన శ్రీకృష్ణుని దర్శించిన, అతని కరుణాకటాక్ష కిరణమొకటి మనపై ప్రసరించిన ఈ దరిద్రాంధకారము తొలగి మనముద్ధరింపబడుదుము. మఱియును,

చ. వరదుఁడు సాధుభక్తజన వత్సలుఁ డార్తశరణ్యు డిందిరా
వరుఁడు దయాపయోధి భగవంతుఁడు కృష్ణుఁడుఁ దాఁ గుశస్థలీ
పురమున యాదవప్రకరముల్ భజియింపఁగ నున్న వాఁడు నీ
వరిగిన నిన్నుఁ జూచి విభుఁ డప్పుడ యిచ్చు ననూనసంపదల్

స్వామీ! మీ చిన్ననాటి మిత్రుడు, శ్రీకృష్ణుడు, భగవంతుడే, అతడు భక్తవత్సలుడు, వరదాత, దయాసాగరుడు, ఇందిరాపతి, అతడిప్పుడు యాదవులచే సేవింపబడుచు, కుశస్థలీపురమున నున్నాడు. మీరొకసారి అచ్చటికిపోయినచో, ఆ ప్రభువు మిమ్ముజూచి, భూరి సంపదల నిచ్చును కదా! మఱియును,

మ. కలలోనం దను ము న్నె ఱుంగని మహాకష్టాత్ముఁ డైనట్టి దు
ర్బలుఁ డాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబు ల్లంబులో
దలఁప న్నంతనె మెచ్చి యార్తిహరుఁ డై తన్నైన నిచ్చున్ సుని
శ్చలభక్తిన్ భజియించువారి కిడఁడే సంప ద్విశేషోన్న తుల్

నాథా! ఆయనను చూడ సంకోచింపవలదు. ఏలనన - కలలోనైనను, ఎన్నడును, ఆ మహాత్ముని స్మరింపని కఠినాత్మునికైనను, వాడు నిస్సహాయుడై ఆపదలో నున్నప్పుడాయన యొక్క పాదపద్మముల మనస్సున స్మరించి నంతనె, వాని ఆర్తిని హరించి తన్నుతానైనను అర్పించుకొను దయాసాగరుడాయన. అట్టితరి, నిశ్చలభక్తితో నిత్యమూ కొలిచెడి మీవంటి సజ్జనునకు సంపద్విశేషముల నివ్వకుండునా!

అని పలికిన ఆ యిల్లాలి మాటలువిని, ఆలోచించి ఆ బ్రాహ్మణోత్తముడు శ్రీకృష్ణుని దర్శించుటయే, ఇహపర సాధనమని తలచినవాడై ఆమెతో నిట్లనెను:

తే. నీవు చెప్పినయట్ల రాజీవనేత్రు
పాదపద్మంబు లాశ్రయింపంగఁజనుట
పరమశోభన మా చక్రపాణి కిపుడు
కాను కేమైనఁ గొంపోవ, గలదె మనకు

మానవతీ! నీ యాలోచన ఆచరింపదగినదిగానే ఉన్నది. ఆ రాజీవలోచనుని పాదపద్మముల నాశ్రయించుట పరమ శుభకరము. మఱి ఆ చక్రపాణికి కానుకగా గొనిపోవుట కేమైనా మన యింటనున్నదా! అనగా నామె -

తే. అనిన న య్యింతి యౌఁగాక యనుచు విభుని
శిథిల వస్త్రంబు కొంగునఁ బృథుక తండు
లముల నొకకొన్ని ముడిచి నెయ్యమున ననుపఁ
జనియె గోవింద దర్శనోత్సాహి యగుచు

అని భర్త చెప్పగా ఆ యిల్లాలు, సరే యని, అతని చినిగిన ఉత్తరీయపు కొంగున కొన్ని ముదుక తండులములను (అటుకులు) ముడివేసి, ప్రీతితో నతనిని సాగనంపగా నతడు గోవింద సందర్శనోత్సాహియై వెడలెను.

అట్లు పోవుచు, తన మనస్సులో నిట్లు తలపోసెను: ద్వారకానగరములో నేనెట్లు ప్రవేశింపగలను? దివ్యమైన అంతఃపురవాసియు, అఖిలేశ్వరుడును అయిన ఆ శ్రీకృష్ణమూర్తిని నేనెట్లు దర్శింపగలను? ఆ ద్వారపాలకులు నీవెక్కడివాడివి, ఇచ్చటి కేల వచ్చితివి, ఎందులకు వచ్చితివి అని యడ్డుపెట్టిన నేనేమి చెప్పగలను, మఱి వారికేమైన కానుక నిచ్చుటకు శూన్యహస్తుడనైన నేనేమివ్వగలను? నా అదృష్టము, ఆతని దయాదృష్టి తప్ప, ఆలోచించుట కేమున్నది? అతడు నన్ను ఉపేక్షింపడు. అట్లెందుకు నేను భావించాలి? అని ద్వారకను ప్రవేశించెను. ముందఱకు పోయిపోయి,

సీ. విశదమై యొప్పు షోడశ సహస్రాంగనా కలిత విశాల సంగతి దనర్చి
మహనీయ తపనీయ మణిమయ గోపుర ప్రాసాద సౌధహర్మ్యములఁ జూచి
మనము బ్రహ్మానందమును బొందఁగడు నుబ్బిసంతోషబాష్పముల్ జడిగొనంగఁ
బ్రకట మై విలసిల్లు నొక వధూమణి మందిరమున నింతులు చామరములు వీవఁ

తే. దనరు మృదు హంసతూలికా తల్పమందుఁ
దానుఁ బ్రియయును బహువినోదములఁ దనరి
మహిత లావణ్య మన్మథమన్మథుండు
ననఁగఁ జూపట్టు పుండరీకాయతాక్షు

అప్పుడు కుచేలుడు గాంచెను - విశాలముగ కన్పించు పదునారువేల భార్యలతో కూడిన మహనీయమైన బంగారు మణిమయ రత్నములు పొదగబడిన గోపురములు ప్రాసాదములతో నున్న సౌధములు చూడగనే అతని మనస్సు బ్రహ్మానందముతో నిండిపోయెను. కన్నులు ఆనందబాష్పములతో వర్షించెను. ఒక పెద్ద సౌధమునందు భామలు చామరములతో వీచుచుండగ మృదువైన హంసతూలికా తల్పముపై విభుడు, తన ప్రియపత్నితో వినోదించుచు మహిత లావణ్యమన్మథ మన్మథుని వలె మెఱిసిపోవుచున్న శ్రీకృష్ణుని కుచేలుడు గాంచెను.

సీ. ఇందీవర శ్యాము వందితసుత్రాముఁ గరుణాలవాలు భాసురకపోలుఁ
గౌస్తుభాలంకారుఁ గామిత మందారు సురుచిరలావణ్యు సురశరణ్యు
హర్యక్షనిభ మధ్యు నఖిలలోకారాధ్యు ఘన చక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధిపయానుఁ గౌశేయపరిధానుఁ బన్నగ శయను నబ్జాతనయను

తే. మకరకుండల సద్భూషు మంజుభాషు
నిరుపమాకారు దుగ్ధసాగర విహారు
భూరి గుణసాంద్రు యదుకులాంభోధి చంద్రు
విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణుఁ గృష్ణు

ఆ శ్రీకృష్ణుడెట్లు కనిపించెను? - నల్లకలువవంటి శ్యామలవర్ణుడు, దేవేంద్రునిచే వందనములను పొందువాడు, కరుణా నిలయుడు, మెఱయుచుండు చెక్కిళ్లు గలవాడు, కౌస్తుభమణిచే నలంకరింపబడినవాడు, కోర్కెలను దీర్చు మందారము వంటివాడు, సుందర లావణ్య రూపుడు, దేవతలకు శరణ్యమైనవాడు, సింహనడుమువాడు, అఖిలలోకములచే నారాధింపబడు వాడు, గొప్ప సుదర్శన చక్రమును చేత ధరించువాడు, మూడు జగములలోను

శ్రేష్ఠుడు, గరుడవాహనుడు, పీతాంబరధారి, శేషతల్పశయనుడు, అరవిందాక్షుడు, మకరకుండలాభరణుడు, మృదు భాషణుడు, సాటిలేని సుందరరూపుడు, క్షీరసాగర విహారి, ఘనమైన గొప్పగుణములు గలవాడు, యాదవ కులచంద్రుడు, విష్ణుడు (సర్వవ్యాపి) జిష్ణుడు (విజయశీలి) రోచిష్ణుడు (తేజస్వి) సహిష్ణు (శాంత సహనశీలి) యైన శ్రీకృష్ణుని కుచేలుడు దర్శించెను.

మ. కని దాయం జనునంతఁ గృష్ణుఁడు దళత్కంజాక్షుఁ డప్పేదవి
ప్రుని నశ్రాంత దరిద్రపీడితుఁ గృశీభూతాంగు జీర్ణాంబరున్
ఘన తృష్ణాతురచిత్తు హాస్యనిలయున్ ఖండోత్తరీయుం గుచే
లుని నల్లంతనె చూచి సంభ్రమ విలోలుండై దిగెన్ దల్పమున్

కుచేలుడు నెమ్మదిగా శ్రీకృష్ణుని చెంతకు చేరుచుండగా, ఆ పేద విప్రుని, నిరంతర దరిద్రపీడితుని, కృశించిన శరీరముగలవానిని, చినిగిన వస్త్రధారిని, దాహపీడితుని, (శ్రీకృష్ణదర్శన పిపాసతో నిండిన చిత్తము గలవానిని) నవ్వుపుట్టించు ఆకారముగల వానిని, చినిగిన ఉత్తరీయముతో నున్నవానిని, కుచేలుని స్వామి అల్లంతదూరమున చూచి, వెంటనే పాన్పుదిగి, సంభ్రమ ముతో, మిత్రునాహ్వానించుటకు ఎదురేగెను.

క. కర మర్థి నెదురుగా జని
పరిరంభణ మాచరించి బంధు స్నేహ
స్ఫురణం దోడ్తెచ్చి సమా
దరమునఁ గూర్చుండఁ బెట్టెఁ దన తల్పమునన్

శ్రీకృష్ణుడు కుచేలునిజూచి, చేతులు చాచి ఎదురువెళ్ళి, ఆలింగనము చేసుకొని, పూర్వపు స్నేహబంధమును స్మరించుకొని తోడ్తెచ్చి, తన పాన్పుపైననే కూర్చుండబెట్టెను. అట్లు కూర్చుండబెట్టి ప్రేమతో, బంగారుకలశములోని జలముతో కాళ్లుకడిగి, భక్తితో ఆ జలమును తలపై చల్లుకొని, చందన కర్పూర కస్తూరి కలసిన సుగంధ లేపనములను మేనుకి అలది, తాటాకు విసనకఱ్ఱ వీచి, రమ్యమైన ధూపమువేసి, మణిదీపములచే నివాళులర్పించి, పరిమళ పుష్పమాలికను సిగలో దురిమి, కర్పూర తాంబూలమిచ్చి, సాదరముగ

స్వాగతము పలుకగా, ఆ విప్రుడు, మేనుపులకాంకితమవగా, ఆనంద బాష్పముల కురిపించెను. అప్పుడు కాంతామణియైన రుక్మిణీదేవి చామరముతో వీవగా చెమటలు ఆరిపోయినవి. ఈ యద్భుత దృశ్యమును జూచి అంతఃపురకాంతలు అబ్బురముతో నిట్లనుకొనిరి:

ఉ. ఏమితపంబు సేసెనొకొ యీ ధరణీదివిజోత్తముండు దొల్
బామున యోగివిస్ఫుర దుపాస్యకుఁ డై తనరారు నీ జగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్న వాఁ
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్

ఆహా! ఈ భూసురోత్తముడెంత ధన్యుడోకదా! ఇతడు పూర్వజన్మయందెట్టి తపము చేసెనో మఱి! యోగివరేణ్యులచే నిత్యమూ ఉపాసింపబడి ప్రకాశించు ఈ రమానాథుని, జగన్నాథుని నిజతల్పముపై కూర్చొని యున్న ఈ మహనీయమూర్తి కెంతటి మహాముని పుంగవులైనను సాటిరాగలరా? అంతేకాదు. ఆ స్వామిపైనను, ఆ తల్పముపైనను సర్వహక్కులూ తనవేయని భావించుచున్న ఆ రుక్మిణీదేవిని ఎడముగా విడిచి, ఆమె యేమనుకొనునో యను సంకోచమైనను లేకుండ, స్వామి, ఈ బ్రాహ్మణునికి ఎదురేగి, కౌగలించుకొని, సకల సేవలుచేసి, గౌరవించి, తన పాన్పుపైననే కూర్చుండబెట్టి వినయముతో పూజింపబడుటకు ఇతడెంతటి భాగ్యశాలియో కదా! అని యనుకొనిరి. అప్పుడు శ్రీకృష్ణుడు కుచేలుని చేతిని తనచేతిలోనికి తీసుకొని, గురుగృహమందు తాము విద్యార్థి దశలో గడిపిన దినములను సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకొని అడిగెను.

మిత్రమా! వేదాధ్యయన పరులైన సద్వంశ సంజాతయైన నీ భార్య సుశీలయై, నీకు అనుకూలవతియై, నీకు సమానముగ నున్నదికదా! చూడగా, నీకు గృహ, క్షేత్ర, ధన, భార్యాపుత్రాదులయందు మనస్సు తగుల్కొన్నట్లు కనబడుటలేదే! నేను కూడ ఎట్టి సంగమును లేక లోకసంగ్రహార్థమై కర్మాచరణము చేయుచుందును. కొందరుత్తములు నీవలెనే కోరికల మోహములో పడకుండ విహితకర్మల నాచరించుచు, సత్యనిష్ఠతోనే ప్రకృతితోడ సంబంధముంచుకొందురు.

జ్ఞాపకమున్నదా! మనము గురుకులమునందు గురువు చెప్పిన జ్ఞానార్థము లన్నియు తెలుసుకొంటిమికదా! మన గురువు అజ్ఞానాంధకారమునకు జ్యోతివంటివాడు. అవ్యయ పరబ్రహ్మానుభూతిని చెందినవాడు, సత్కర్మ నిరతుడు సత్త్వగుణ శ్రేష్ఠుడు, నిర్మలుడు, బుధనుతుడు, బ్రాహ్మణోత్తముడు, నేను సకలవర్ణాశ్రమములవారికి విజ్ఞానప్రదుడనైన జగద్గురువునైనప్పటికిని, సాంప్రదాయము ననుసరించి గురుసేవయే పరమధర్మమని ఆ మహాత్మునివద్ద శిష్యుడనైతిని. భూసురులలో ముఖ్యుడనై సకలవర్ణాశ్రమ ధర్మములయందు జ్ఞాన సుజ్ఞాన ప్రదుడనై, గురువునై నేనెల్లప్పుడును వెలయుచుందును.

అట్టి వర్ణాశ్రమ ధర్మములయందు అర్థకుశలురైనవారు (ధర్మములను బాగుగ గ్రహించినవారు) ఏకైక గురుడనైన నాయొక్క వాక్యము (బోధ)చే, నాపాదపద్మముల యందు ధ్యానపరులై, శీఘ్రముగ సంసారసాగరమును దాటగలరు.

అంతేకాదు, సకలభూతాంత రాత్ముడనైన నేను తపములు, దానములు, వ్రతములు, యజ్ఞములు, శమదమాది సాధనలచే సంతసింపనుగాని, గురుజనులను పరమభక్తితో సేవించువారియందు మిక్కిలి సంతసించెదను.

మిత్రమా! నీకు జ్ఞప్తియున్నదా! మనము గురుమందిరము నందున్నప్పుడు ఒకనాడు గురుపత్ని చెప్పుటచేత వంటకట్టెలను తెచ్చుటకు అడవికి వెళ్లియుంటిమి కదా! ఘుమ ఘుమ గర్జనలతో గాఢమైన కారుమేఘములు ఆకాశమంతా కప్పివేయగా, భయంకరముగా మెఱుపులు మెఱయగా, వృక్షములను పడద్రోయు ఝంఝూమారుతములు వీచగా, ఏనుగు తొండముల వంటి ధారలతో కుంభవృష్టి కురియగా, సూర్యుడస్తమింపగా, అంతటా గాఢాంధకారము అలముకొనగ, మనము ఆ వానలో తడిసిపోయితిమి కదా! ఆ గాఢాంధకారమున ఏమియు కానలేక, దారితెలియక, ఎత్తుపల్లములు తెలియక, మనమొకరిచేతి నింకొకరు పట్టుకొని రాత్రిని గడిపివేస్తిమి. ప్రాతః కాలమందు తెలతెలవారినప్పుడు వనమంతా శోభతో నవ్వెను. పక్షులు కిలకిలారావములు చేసెను. సూర్యుడు తళతళ మెఱయుచు దర్శనమిచ్చెను. అప్పుడు మన గురువర్యుడు సాందీపని వచ్చి మనయొక్క స్థితిని గాంచి,

మిక్కిలి చింతించి, యిట్లనెను కదా! "అక్కటా! ఓ వటులారా! మీరు మా కొఱకు ఈ మహారణ్యమునకు వచ్చి, యిక్కట్లలో పడితిరి. ఈ విధముగ శిష్యులైన మీకు, మా ఋణము తీరిపోయినది. మీరు ఇకమీదట ధనము, బంధువులు, భార్యాపుత్రులు, వైభవము, జయము, ఆయుర్దాయము, ఉన్నతులను పొందెదరు" అని చెప్పి వాత్సల్యముతో మనల్ని తోడ్కొని వెళ్లెను కదా! మఱువగలమా? మనము చదువుకొనునప్పుడు ఎంత అన్యోన్య స్నేహవాత్సల్యములతో చేసిన పనులను మఱవగలమా!" అని యీ విధముగ మాధవుడు చెప్పగా కుచేలు డిట్లనెను : ఓ పద్మనాభా! మనము గురు మందిరమున నున్న దినములలో మంచి పనులెన్నియో చేసియుంటిమి. అది యట్లుండనిమ్ము.

క. గురుమతి దలఁపగఁ ద్రిజగ
ద్గురుఁడ వనందగిన నీకు గురుఁ డనఁగా నొం
డొరుఁ డెవ్వఁ డింతయును నీ
కరయంగ విడంబనంబ యగుఁగాదె హరీ!

ఓ శ్రీహరీ! బాగుగా నాలోచింపగా, మూడు జగములకు జగద్గురు వనదగిన నీకు వేఱుగా నింకొకడెవ్వరైనను గురువు కాగలడా స్వామీ! కాని నీ కొక గురువుండుట యొక విడ్డూరమే కదా! - అనగా విని మందస్మిత వదనార విందుడైన స్వామి యిట్లడిగెను : మిత్రమా! నీవిచ్చటికి వచ్చునప్పుడు, నా యందు భక్తితో నీవు నా కొఱకేమి కానుకను తెచ్చితివి? అది ఎంతటి స్వల్పమైన దైనను, దానిని పదివేలుగ స్వీకరించెదను. అట్లుగాక, భక్తిలేనివాడు, నీచవర్తనుడు, దుష్టాత్ముడు నైనవాడు, మేరుపర్వత సమానమైన దిచ్చినను, అది నాకు సమ్మతము కాదు. కావున

క. దళమైన పుష్పమైనను
ఫలమైనను సలిల మైనఁ బాయనిభక్తిన్
గొలిచిన జను లర్పించిన
నెలమిన్ రుచిరాన్న ముగనె యేను భుజింతున్

ఎడబాయని భక్తితో నన్ను కొలుచువా రర్పించిన దళమైనను, పుష్పమైనను, ఫలమైనను, జలమైనను, నేను ప్రీతితో నిష్టాన్నముగనే ఆరగించెదను.

అని శ్రీకృష్ణుడు చెప్పిన వినయోక్తులకు సంతసించినను, కుచేలుడు తాను తెచ్చిన అటుకులను ఇచ్చుటకు సంకోచించి, తలవంచుకొని మిన్నకుండెను.

బ్రాహ్మణుడు వచ్చిన పని భగవంతునకు తెలియదా? శ్రీకృష్ణుడిట్లు తలచెను: "ఈ మహాత్ముడు పూర్వజన్మలో ఐశ్వర్యకాంక్షతో ధన సంపాదన యందే చిత్తము నిలిపి నన్ను సేవింపలేదు. (ఆ కారణముచేతనే ఈ జన్మయందు కఠిన దారిద్ర్యమును అనుభవించవలసి వచ్చెను) ఇప్పుడైనను, భార్యను తృప్తిపరచుటకు ఇచ్చుటకు వచ్చెనుగాని, ఏమియును కోరడు. ఇతడు ఇంద్రాదులకు కూడ లభించని బహుప్రకారములైన సంపద విశేషములను తక్షణము ఇవ్వదగినవాడు" అని తలంచి, బ్రాహ్మణుని చింకివస్త్రము కొనలో ముడివేయబడిన అటుకుల మూటను చూచి ఇది ఏమియని తటాలున ఆ మూటను తన కరకమలములతో విప్పి దానినుండి ఒక పిడికెడు అటుకులు తీసుకొని, సకలలోకములను నన్నును, తృప్తిపరచుటకు యివి చాలునని వాటిని నోట వేసుకొనెను. శ్రీకృష్ణుడు మరలను ఒక పిడికెడు తీసుకొనుటకు చెయ్యి చాచగా రుక్మిణీదేవి వారించి, ఆ చేతిని పట్టుకొని, యిట్లనెను:

"స్వామీ! ఇతనికి బహుసంపదల నిచ్చుటకు ఒక్క పిడికెడు అటుకులు మాత్రముచాలును. మరి తినవద్దు, త్రిజగత్ సంపత్కరా! దేవదేవా! సర్వాత్మా! శ్రీహరీ!"

కుచేలుడా రాత్రి శ్రీకృష్ణభవనమున హృదయానందకరములైన అనేక పదార్థముల ననుభవించి, మృదుల శయ్యపై నిద్రించి, తాను స్వర్గసుఖముల కంటె అధికమైన భోగములననుభవించినట్లు భావించెను. మఱునాడు అరుణోదయమున మేల్కొని నిత్యకర్మలాచరించి, శ్రీకృష్ణుడు కొంతవరకు వచ్చి సాగనంపగా, నందనందన సందర్శనానంద లోలాత్ముడై, ముందుకు సాగుచు నిట్లు తలపోసెను.

క. నా పుణ్య మరయ నెట్టిదొ
యా పుణ్యనిధిం బ్రశాంతు నచ్యుతు నఖిల
వ్యాపకుఁ బ్రహ్మణ్యునిఁ జి
ద్రూపకుఁ బురుషోత్తమునిఁ బరుం గనుఁ గొంటిన్

ఆహా! చూడగా, నా పుణ్యమెంతటిదో కదా! ఆ పుణ్యనిధిని, ప్రశాంతుని, అచ్యుతుని, సర్వవ్యాపకుని, బ్రహ్మణ్యుని, చిద్రూపకుని, పురుషోత్తముని, పరమాత్మను ఈ విధముగ జూడగల్గితిని! (మహాయోగీశ్వరులకైనను దుర్లభమైన భాగ్యము)

పరికింపగా దరిద్ర దీన స్వభావుడనైన నేనెక్కడ, త్రిభువనైశ్వర్య స్వరూపిణియైన లక్ష్మీదేవికే పతియు, నివాసమును అయిన ఆ వాసుదేవుడెక్కడ? అతడే నన్ను కోరి, తోబుట్టువువలె నన్ను కౌగలించుకొని, దగ్గర జేర్చుకొని, నన్ను దైవముగ భావించి, తన పాన్పుపై కూర్చుండబెట్టుకొని, సత్కారములు జరిపించి, భార్యచే చామరమున వీవనిచ్చి, నాశ్రమను దీర్చి, శ్రీదేవి కుచములకు చందనములు పూయు చేతులతో నా పాదములు కడిగి, ప్రేమతో తుడిచెనా మహనీయుడు. ఆహా! నా భాగ్యమే భాగ్యము కదా!

శ్రీనిధియైన నా మిత్రుడింత ఘనముగా నా యెడల ప్రవర్తించి, ధనమేమియు నివ్వని కారణమును యోచింపగా తెలియునదేమన - దరిద్రునికి సంపదకలిగిన అతడు ధనమదాంధుడై, కన్నుమిన్ను గానక, తన్ను (భగవంతుని) చేరడని, గాని, కాకున్నచో ఆశ్రితుల ఆర్తిని హరించువాడును, కృపాసాగరుడును, అయిన మా కృష్ణుడు నన్ను సర్వవస్తు పరిపూర్ణునిగ చేయకుండునా?

అని తన మనమున తర్కించుకొనుచు నిజగ్రామమునకు పోయిపోయి ఏమి చూచెననగా - సూర్యచంద్రుల కాంతులవంటి చంద్రకాంత శిలలతోను, బంగారు రేకులతోను నిర్మింపబడిన సౌధములను, చిలుకలు, నెమళ్ళు, హంసలు, కోకిలలు మొదలైన పక్షికూతలతో మారుమ్రోగు ఉద్యాన వనములను, తెల్లని పద్మములతోను, నల్లకలువలతోను ఎఱ్ఱని తామరలతోను నిండియున్న కొలనులను, మణిమయ కంకణ ముఖాభరణముల

నలంకరించుకొని ప్రకాశించు దాసదాసీజనములను, కలిగి శోభించు భవనమును చూచి ఆశ్చర్యచకితుడై ఈ అపూర్వమైన వైభవోన్నతమైన లక్ష్మీనివాసమునందు ఎట్టి పుణ్యాత్ముడు నివసించు చుండునో యని విస్తుపోవుచుండగా

దేవకాంతల వంటి సుందరీమణులప్పుడు ఆ ఇంటినుండి వచ్చి, లోనికి దయచేయుడు అని సంగీత వాద్యనృత్యములతో నాతని ఆహ్వానించి, లోనికి గొనిపోయిరి. అతని సతీమణి అప్పుడాతని కెదురువచ్చి ఆనందబాష్పములతో నాహ్వానించెను.

ఆ కుచేలపత్ని, భర్తరాకను జూచి, మనస్సులో నుప్పొంగి, వైభవోపేతయై, మానవరూపధారిణియైన మహాలక్ష్మివలె మెఱయుచు ఆనందబాష్పములతో పతిదేవు పాదములను మనస్సులో మొక్కి అతనిని భావనలోనే ఆలింగనము చేసుకొనెను. దివ్యాంబరా భూషితలైన అప్సరసల వంటి పరిచారికలు సేవలు చేయుచుండగా, నిజకాంతను చూచి బ్రాహ్మణోత్తముడు, నిజమిత్రుని స్మరించెను.

శ్రీకృష్ణునిచే ననుగ్రహింపబడిన ఐశ్వర్యములో ఆ బ్రాహ్మణ దంపతులు అనురాగము వెల్లివిరియగ నిత్యానందము ననుభవించుచు, వైభవమున నుండిరి.

ఇంతకాలమును అంతులేని దారిద్ర్య దుఃఖసాగరమున మునిగియున్న నాకు చివరికి కలిగిన ఐశ్వర్యమువలన నిప్పుడు, సుఖములు ప్రాప్తించుటచేత మనోవికారములు తలెత్తరాదు అని ఆ భూసురుడు జాగరూకుడై యుండెను.

ఈ సంపదలన్నీ ఆ శ్రీహరియొక్క కరుణాకటాక్షము వలననే లభించినవి. నేను అర్థినై ఆయన దర్శనము చేయుటకు వెళ్లియుంటిని. అతనికి నా వృత్తాంత మంతయును తెలిసియును, పైకి ఏమియును చెప్పకుండా, నేను తిరిగి వచ్చివేసిన పిమ్మట ఈ సంపదలన్నిటిని అనుగ్రహించెను. ఆ పురుషోత్తముడు భక్తినిష్ఠులైన సజ్జనులు, లేశమాత్రమైన (అతిస్వల్పమైన) పదార్థమేదైనను భక్తిపూర్వకముగ సమర్పించిన, దానిని కోటిరెట్లుగా పెంచి స్వీకరించి అనుగ్రహించు ననుటకు నాకథయే ఒక దృష్టాంతము కాదా! దరిద్రుడు,

శిథిలదేహుడు, చినిగిన గుడ్డలవాడు అని నన్ను మనస్సులోనైన ఏవగించుకొనక, నా వద్దనున్న పిడికెడు అటుకులను ఆదరమున ఆరగించి నన్ను కృతార్థుని చేయుట అతని నిర్హేతుక (అకారణమైన) దయకాదా! అట్టి కరుణాసాగరుడైన గోవిందుని చరణారవిందముల యందు నాకు అచంచలభక్తి కలుగుగాక! అని ఆ శ్రీహరియందు ఎప్పటివలె భక్తి తాత్పర్యములు కలిగియుండి, పత్నీసమేతుడై భోగముల యందాసక్తి లేనివాడై, రాగాదిదోషరహితుడై, నిర్వికారుడై, కర్మలను భగవదర్పితము జేసి, బంధములనొదిలించుకొని, మోక్షప్రాప్తిని పొందెను మహాత్ముడైన కుచేలుడు.

ఆ. దేవదేవుఁ డఖిలభావజ్ఞుఁ డాశ్రిత
వరదుఁడయిన హరికి ధరణిసురులు
దైవతములు గాన ధారుణీదివిజుల
కంటె దైవ మొకడుఁ గలఁడె భువిని

దేవదేవుడును, భావమును గ్రహించువాడును, ఆశ్రితవరదుడును అయిన శ్రీహరికి బ్రాహ్మణులే దేవతలు కావున బ్రాహ్మణుని కంటె దైవము వేఱొక డీ పృథ్వియందు కలడా!

క. మురహరుఁ డిట్లు కుచేలునిఁ
జరితార్థునిఁ జేసినట్టి చరితము విను స
త్పురుషుల కిహ పర సుఖములు
హరిభక్తియు యశముఁ గలుగు నవనీనాథా!

పరీక్షిన్మహారాజా! ఈ విధముగ శ్రీహరి కుచేలుని చరితార్థునిగా చేసినట్టి చరితమును వినిన సత్పురుషులకు ఇహపరసుఖములు, హరిభక్తి కీర్తి కలుగును.

కుచేలోపాఖ్యానము సమాప్తము
హరి: ఓం తత్ సత్

❖ ❖ ❖

# భాగవత భక్తితత్త్వము

మానవులకు మోక్షప్రాప్తి సాధనలుగా జ్ఞాన, కర్మ, భక్తి మార్గములు నిర్దేశింపబడినవి. జ్ఞానమార్గమునకు, వేదాంతశాస్త్రాధ్యయనము, పరిణతి చెందియున్న సునిశిత బుద్ధికుశలత, మిక్కిలి అవసరము. కర్మమార్గముకూడ, వర్ణాశ్రమ ధర్మవిహిత కర్మానుష్ఠాన పరత అవసరము గనుక, అందరికిని, అంతసులభ సాధ్యము కాదు. అందుచేతనే స్త్రీ, పురుష పండిత పామర వయోవర్ణ విభేదము లేవియును లేక, అందరును సులువుగా నాచరింపగల్గునది కేవలము భక్తిమార్గమొక్కటియే అని చెప్పబడినది. పోతనగారి భాగవతము నందు భక్తికే ప్రాధాన్యత నివ్వబడినది. ఆదిశంకరులవారు కూడ "మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరిత్యభిధీయతే" అని వ్రాసియుంటిరి.

"భక్తి" అనగా భగవంతుని యందు అత్యంత ప్రేమయని నారదమహర్షి నిర్వచించెను. ఈ ప్రేమను భక్తుడేవిధముగ ప్రకటింపగలడు? ప్రేమకు సంకేతము, త్యాగము, సమర్పణము. తనకున్నదంతా నిశ్శేషముగ భక్తుడు తన ఇష్టదైవమునకు అర్పణ చేయుటయే భక్తి అనవచ్చును. స్వాత్మార్పణయే భక్తి అదియే అనన్యభక్తి, శరణాగతి.

భక్తునకు భగవంతునియందు భక్తి కుదరవలెనన్న ఆయనయొక్క లీలా గుణవైభవ గాథలను, సర్వజ్ఞతను, సర్వవ్యాపకత్వమును, సర్వశక్తి మంతత్వమును, సర్వసుహృద్భావమును, శరణాగత వత్సలతను, పదే పదే మననము చేసుకొనవలెను. ఈ గుణగణములను భాగవతములోని భక్తులు తమ స్తుతి స్తోత్రములద్వారా విరివిగా ప్రస్తుతించిరి. అనన్యభక్తుడు తన ప్రియతమ దైవతమునుండి వియోగమును ఒక్కక్షణమైనను సహింపజాలడు. దీనికి గోకులములోని గోపికల విరహవేదనయే ఒక చక్కని ఉదాహరణ.

భక్తునియొక్క జన్మజన్మల పరిణామ పరిపక్వదశకు అనుగుణముగా భగవంతునితో నతనికి అనుబంధమేర్పడును - దాస్యభక్తి, వాత్సల్యభక్తి, సఖ్యభక్తి, మధురభక్తి, వైరభక్తి మొదలైనవి. నారదుడు యుధిష్ఠిరునితో నిట్లు చెప్పెను:

శా. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులుం
బ్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్లైనను
ద్ధామధ్యానగరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా

ధర్మనందనా! కామోద్రేకముచే గోపికలును, భయముచే కంసుడును, వైరప్రక్రియలచే శిశుపాలాది రాజులును, బంధుత్వముచే యాదవులును, ప్రేమచే పాండవులైన మీరును, భక్తిచే మునులమైన మేమును ఈ భూమిపై (ఇక్కడ) శ్రీహరిని చూడగల్గితిమి. ఏవిధముననైనను, నిరంతర సంస్మరణ ధ్యానాదులచే శ్రీహరిని చేరవచ్చును.

మఱియు ప్రహ్లాదుడు తండ్రియైన హిరణ్యకశిపునితో విష్ణువును నవవిధ భక్తులతో నీవిధముగ సేవింపవచ్చునని ఇట్లు చెప్పెను:

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిదిభ క్తిమార్గముల సర్వాత్మున్‌హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా

తండ్రీ! మనోవాక్ కాయకర్మల నొక్కటిగానే ఉంచుకొనుట (త్రికరణశుద్ధి) శ్రవణము (విష్ణుకథాశ్రవణము), దాసత్వము (భగవంతునియందు కింకర భావము) వందనము, అర్చనము, సేవ (పరిచర్యలు చేయుట) ఆత్మలో నెఱుక, (భగవంతుడే సర్వస్వమని సతతము మననము చేయుట), ఆత్మనివేదనము (ఆత్మార్పణము), సంకీర్తనము, చింతనము (మననధ్యానాదులు), ఈ తొమ్మిది భక్తిమార్గముల ద్వారా సర్వాత్ముడైన శ్రీహరిని నమ్మి, సజ్జనుడై యుండుటయే, సత్యముగ శ్రేయస్కరమని నమ్ముచుంటిని దైత్యోత్తమా!

ఇటువంటి భాగవత భక్తితత్త్వమును ప్రకటించు కొన్ని స్తుతి స్తోత్రములను, బోధలను ఈ అనుబంధమునందు పొందుపరచడమైనది.

# 1. అంబరీషుడు

మహాకవి బమ్మెర పోతన విరచిత మహాభాగవతము భక్తిప్రధానమైన గ్రంథము. ప్రహ్లాదాది పరమభాగవతోత్తముల గాథలలో అంబరీషోపాఖ్యాన మొకటి. భక్తఅంబరీషునిపై బ్రాహ్మణశాపముగూడ పనిచేయనంతటి మహా పుణ్యాత్ముడతడు. అదెట్లన -

శా. సప్తద్వీపవిశాల భూభరము దోఃస్తంభం బునం బూనిసం
ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవ సంపచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్
సుప్తిం బొందక యొప్పె సద్గుణ గరిష్ఠుం డంబరీషుం డిలన్

సప్తద్వీపముల భూభారమును చేతులే స్తంభములుగా వహించి, (పాలించి) ప్రాప్తించిన సిరిసంపదలతోను, మహావైభవముతోను, మిక్కిలి నేర్పు, కౌశలములతోను, చెడును చేరనీయక, ఏవిధమైన అశ్రద్ధ, అలసత్వములకు లోనుగాక శ్రీమహావిష్ణువు సేవార్చనల యందే నిమగ్నుడై సద్గుణ శ్రేష్ఠుడైన అంబరీషుడు ఈ భూమిపై వెలసియుండెను.

సీ. చిత్తంబు మధురిపు శ్రీపాదములయంద పలుకులు హరిగుణ పఠనమంద
కరములు విష్ణుమందిర మార్జనములంద శ్రవములు హరికథా శ్రవణమంద
చూపులు గోవింద రూపవీక్షణమంద శిరము కేశవ నమస్కృతులయంద
పదము లీశ్వరగేహ పరిసర్పణములంద కామంబు చక్రి కైంకర్యమంద

తే. సంగమచ్యుత జనగుణ సంగమంద
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమలమంద
రసన తులసీదళములంద రతులు పుణ్య
సంగతులయంద యా రాజచంద్రమునకు

ఆ రాజచంద్రుడైన అంబరీషునకు, చిత్తమెల్లప్పుడును మధుసూదనుని పాదపద్మములపైననే యుండును. వాక్కు శ్రీహరి గుణ సంకీర్తనమునందే యుండును. చేతులు విష్ణుమందిరములను శుభ్రపరచుటయందే నిమగ్నమై

యుండును. చెవులు శ్రీహరి కథాశ్రవణముల కొఱకే కాంక్షించుచుండును. చూపులు గోవిందుని మోహన రూపవీక్షణము కొఱకే చూచుచుండును. శిరము కేశవుని మొక్కుట యందే మగ్నమైయుండును. పాదములు విష్ణుమందిర ప్రదక్షిణలలోనే నడుచుచుండును. కోరికలు శ్రీహరి కైంకర్యము (సేవ) కొఱకే కలుగును. చెలిమి విష్ణుభక్తుల తోడను, విష్ణుగుణ చర్చల యందును, నాలుక తులసీదళాస్వాదనమందును, ముక్కు, మురవైరి భక్తుల పాదపద్మ సుగంధమునందును, ప్రీతి, శ్రీహరికి చెందిన పుణ్యసంగతుల యందును, ఎల్లప్పుడును ఉండును. మఱియు ఆ రాజు, పవిత్రుడై, ఘనవైభవమున, వశిష్ఠాది మునిశ్రేష్ఠులతో కూడి, సరస్వతీనదీ తీరమున విష్ణుదేవుని గూర్చి అనేకమైన అశ్వమేధయాగములు చేసి, విరివిగా దక్షిణలుపెట్టి, బంగారము, మట్టిముద్దలను సమదృష్టితో చూచి, సర్వకర్మలను శ్రీహరి పరము చేయుచు పృథివిని పాలించెను. విష్ణుభక్తులయందుగాని విష్ణువునందుగాని ఎప్పుడైన కారణాంతరమువలన భక్తిశ్రద్ధలకు బాధ కలుగునని శంక కలిగినప్పుడు, కర్తవ్య కర్మలను నిర్వహింపుచు, రాజర్షివలె అసంగుడై భక్తిని కూడ నెఱపుచుండెను.

మఱియు, ఆ మహాభాగవతుడు,

క. **హరి యని సంభావించును**
**హరి యని దర్శించు నంటు నా ఘ్రాణించున్**
**హరి యని రుచిగొనఁదలఁచును**
**హరిహరి! ఘను నంబరీషు నలవియె పొగడన్**

ఆ అంబరీషుడు, "హరి" యనుకొనుచు భావించును (ఆలోచించును). హరీయనుచు చూచును, హరీ యనుచు తాకును, హరీయనుచు వాసనజూచును, హరీ యనుచు చవిజూచును (ఏ కార్యము చేసినను హరిస్మరణతోనే చేయును) హరిహరీ! (ఆహా, ఎంతగొప్పతనము!) ఘనుడైన ఆ అంబరీషుని పొగడవశమా!

ఆ పుణ్యచిత్తుడు ఈ విధముగ నీశ్వరాధీనుడై నెమ్మదిగ రాజ్యము చేయుచుండగ :-

ఆ. అతని కీహ మానె హరులందుఁ గరులందు
ధనములందుఁ గేళివనములందుఁ
బుత్రులందు బంధు మిత్రులయందును
బురమునందు నంతిపురమునందు

ఆ మహాత్మునకు, రాజరికపు హంగులైన గజములు, అశ్వములు, ధనసంపదలు, ఉద్యానవన కేళీ విహారాదులు, పుత్రులు, బంధుమిత్రాదులు, రాజధాని, రాజాంతఃపురము లేవియును ఆసక్తికరములు కావు. వాటియందే మాత్రము అతనికి వాంఛలులేవు.

పిమ్మట కొంతకాలమునకు ఆ మహారాజు సంసారమునందు సంగము విడిచి, నిర్మలుడై ఏకాంతమున భక్తిపరవశుడైయుండ ఆ రాజర్షికి, భక్తవత్సలుడైన పురుషోత్తముడు, శత్రుశిక్షణ ఆత్మరక్షణకొఱకై తన సుదర్శన చక్రమును నియోగించి వెడలెను.

క. తన తోడినీడకైవడి
ననురూప గుణాఢ్యయైన యాత్మ మహిషితో
జనవిభుఁడు ద్వాదశీవ్రత
మొనరఁగహరిఁగూర్చి చేసె నొక యేఁడధిపా!

ఆ అంబరీషుడు, తన తోడు నీడవంటి అనురూపవతి, గుణవతియైన సహధర్మచారిణితో కూడి, శ్రీహరిని గూర్చి ఒక సంవత్సరము ద్వాదశీవ్రత మాచరించుటకు పూనుకొనెను. పరీక్షిన్మహారాజా!

ఇట్లు వ్రతముచేసి, ఆ వ్రతాంతమున, కార్తీక మాసమున మూడురాత్రులు ఉపవసించి, కాళిందీ నదీజలములో స్నానమాచరించి, మధువనమున మహాభిషేక విధానమున శ్రీహరికి అభిషేకముచేసి, మనోహరములైన గంధాక్షతలను సమర్పించి, పుష్పములతో పూజించి, తదుపరి,

పాలవర్ష ప్రవాహములను కురిపించునట్టివి, అందమైన బంగారు కొమ్ములతోను వెండి గిట్టలతోను, దూడలతోను ఉన్నవియగు అరువేల కోట్ల పాడిగోవులను బ్రాహ్మణులకు దానమిచ్చెను. అనేకులైన బ్రాహ్మణులకు

కడుపులనిండుగ మృష్టాన్న భోజనములు పెట్టించి, తానొక్కడే పారణము చేయుటకు సిద్ధపడగా, నంతలోనే

క. భాసుర నిగమ పదోప
న్యాసుఁడు సుతపోవిలాసుఁ డనుపమ యోగా
భ్యాసుఁడు రవిభాసుఁడు దు
ర్వాసుఁడతిథియయ్యెదన్ని వాసంబునకున్

తేజోమయుడును, వేదపదములను విశ్లేషింపగల ధీశక్తి గలవాడును, ఉత్తమ తపశ్శక్తి సంపన్నుడును, రవితేజో భాసుడును అయిన దుర్వాసమహాముని, అంబరీష గృహమునకు అతిథిగా విచ్చేసెను. వెంటనే రాజు లేచి, నిల్చొని మునివర్యునికి ఎదురేగి, నమస్కరించి ఉచితాసనమునిచ్చి, పాదములు కడిగి పూజించి, క్షేమములడిగి, తన యింట భోజనము చేయుమని ప్రార్థించిన, ఆ మహాత్ముడు సంతసించి, అంగీకరించి, కాళిందీనదిలో స్నానమాచరించి వచ్చెదని చెప్పి వెళ్లెను. ముని, నదిలో పరమధ్యానములో మునిగి ఎంతకూ తిరిగి రానందున, ఇంకను ముహూర్తకాలము కొద్దిమాత్రమే మిగిలియుండ, ద్వాదశి పారణము చేయవలసియున్నది గావున, విజ్ఞులను రావించి, వారితో నిట్లనెను:

క. ముని నీరుసొచ్చి వెడలఁడు
చనియెడు ద్వాదశియు నింత ( సనియె స్నీలో
వన పారణయున్ వలయును
వినిపింపుండర్హధర్మ విధ మెట్టిదియో

విబుధులారా! దూర్వాసముని నదికి స్నానమునకు పోయి యింకను తిరిగి రాలేదు. ద్వాదశి దాటిపోవనున్నది. ఈ లోపలనే పారణము చేయవలయును కదా! కావున అతిథిపట్ల అపరాధము జరుగకుండ, ఏమిచేసిన తగియుండునో ఆ విధమును నాకు తెలియజేయుడు. అని ప్రశ్నించిన రాజుకు బ్రాహ్మణు లిట్లనిరి.

ఆ. అతిథి వోయి రామి నధిప! యీ ద్వాదశి
పారణంబు మానఁ బాడిగాదు
గుడువకుండుటఁ గాదు కుడుచుటయును గాదు
సలిలభక్షణంబు సమ్మతంబు

రాజా! అతిథి స్నానమునకు పోయి ఇంకను తిరిగిరానందున, ఈ ద్వాదశి పారణ మానరాదు గనుక, శుద్ధజలమును కొద్దిగ సేవించిన, నుపవాసము ముగించినట్లును, అతిథి గురించి భోజనము చేయకుండ వేచియున్నట్లును అగును. ఇది ధర్మసమ్మతమే అని ధర్మసందేహము తీర్చిన, నా రాజర్షి శ్రేష్ఠుడు మనస్సులో శ్రీహరిని తలంచి, జలముసేవించి, ముని రాకకై యెదురు చూచుచున్న సమయమున

సీ. యమునలోఁ గృతకృత్యుఁడై వచ్చి రాజుచే సేవితుండై రాజుచేష్టితంబు
బుద్ధిలో నూహించి బొమముడి మొగముతో నదరెడిమేనితో నాగ్రహించి
రెట్టించి యాఁకలి గొట్టుమిట్టాడంగ నీ సంపదున్మత్తు నీన్నృశంసు
నీ దురాహంకారు నిందఱుఁ గంటిరే విష్ణుభక్తుఁడుగాఁడు వీఁడు నన్నుఁ

తే. గుడువ రమ్మని మునుముట్టఁ గుడిచినాఁడు
ధర్మభంగంబు సేసి దుష్కర్ముఁడయ్యె
నయిన నిప్పుడు సూపెద నన్ని దిశల
నేనుఁ గోపింప మాన్పువాఁ డెవ్వఁ డనుచు

దూర్వాస మహాముని యమునలో స్నానమాచరించి వచ్చెను. అంబరీషు డతనికి ఉచిత సేవలు చేసెను. రాజు పారణము చేసినట్లు ముని, బుద్ధి ద్వారా ఊహించెను. మిక్కిలి క్రుద్ధుడయ్యెను. బొమముడి (కనుబొమలు ముకుళించి) ముఖముతో, వణకుచున్న శరీరముతో, ఆకలిబాధ పీడింపగా, కోపావేశుడై, రెట్టించిన కంఠధ్వనితో నిట్లనెను. "ఈ నరఘాతకుడు, సంపదున్మత్తుడు (ధనమదాంధుడు), దురహంకారుడు, వీడు విష్ణుభక్తుడు కాడు, అందరూ చూచుచుంటిరా? వీడు నన్ను భోజనమునకు ఆహ్వానించి, తానే మొట్టమొదట ఆరగించినాడు, చూచితిరా! వీడు ధర్మభంగము చేసి

దుష్కర్ముడైనాడు. వీనికి నేనెవరినో ఇప్పుడె చూపించెదను. అన్నిదిశలలోను, నాకోపము నుండి వీనిని ఎవ్వడు రక్షించునో నేను చూచెదను" అని,

చ. పెట పెటఁ బండ్లు గీటుచును భీకరుఁడై కనుగ్రేవ నిప్పుకల్
పాట పాట రాల, గండములు పొంగ, మునీంద్రుఁడు హుంకరించుచున్
జట మొదలంటఁగాఁ బెటికి చక్కన దానవ కృత్య నాయుధో
త్కట వరశూల హస్తయుతఁగా నొనరించి కవించె రాజు పై

క్రోధోద్రేకుడైన ఆ ముని, పటపట పండ్లు కొరుకుచు, భయంకరుడై, కన్నుల నుండి నిప్పుకణములు పొటపొట రాల్చుచు, చెక్కిళ్లు కోపముతో జేవురించి పొంగగ, హుంకరింపుచు, తన తలలోని ఒక జటను మొదలంటగా బెటికి, దానినుండి ఒక కృత్యను (దుష్టశక్తి స్వరూపిణిని) సృష్టించి అంబరీషునిపై ప్రయోగించెను. ఆ కృత్య, శూలమును ధరించి, కాలాగ్నివలె విజృంభించుచు, సుఱసుఱచుట్టివేయుచు, పెద్దపెద్ద పాదములతో నేల ద్రొక్కుచు, అంబరీషుని సమీపించి, మీద పడబోయెను.

అప్పుడు విశ్వరూపుడును, సర్వవ్యాపియున్నైన విష్ణుమూర్తి వెఱ్ఱి బ్రాహ్మణుడైన దూర్వాసుని దుష్టకృత్యమును చక్కబెట్టి రమ్మని తన సుదర్శనచక్రమును పంపించగా నది ప్రళయకాల అగ్నిహోత్రమువలె దిగివచ్చి, ముని ప్రయోగించిన కృత్యను దహించివేసి, కుటిలాత్ముడైన ఆ ముని వెంటబడెను. అంత అతడు తలదాచుకొనుటకు మేరుపర్వత గుహయందు చొచ్చెను. ఆ చక్రము కూడ పెనుగాలిలోని దావానలము (అగ్నిజ్వాల) వలె అతనిని వెంబడించెను.

మ. భువిఁ దూఱన్ భువిఁ దూఱు నబ్ధిఁ జొర నబ్ధుల్ సొచ్చు నుద్వేగి యై
దివిఁ బ్రాఁకన్ దివిఁ బ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీథులం బోవుఁ,జి
క్కి వెసన్ గ్రుంగినఁ గ్రుంగు, నిల్వ నిలుచుం, గేడింప గేడించు, నా
క్కవడిన్ దాపసు వెంట నంటి హరిచక్రం బన్యదుర్వక్రమై

దూర్వాసుడు తలదాచుకొనుకు భూమిలో దూరిన ఆ సుదర్శన చక్రమతనిని వెంబడించుచు భూమిలో దూఱును. అతడు సముద్రమునందు

జొచ్చిన, నదియు ఉద్వేగముతో సముద్రమునందు చొచ్చును. అతడాకాశమున కెగబ్రాకిన ఆ చక్రము కూడ ఆకాశమున వెంటబడును. అతడు దిక్కులకుపోయిన నా చక్రమును ఆ దిక్కులకు పో వెంబడించును. అతడాగిపోయిన నా చక్రము కూడ నాగిపోవును. అతడు మందగమనుడైన నా చక్రమును వేగము తగ్గించును. మఱియు నా మునిని వెంటనంటి ఆపశక్యము కాకుండ వెంబడించెను.

ఆ దూర్వాసుడు ఏ లోకమునకు పోయినను, చక్రమాలోకమునకు వెంబడించుచుండుటచేత ఆ చక్రానల జ్వాలలు దుర్భర మగుచుండగా భయకంపితుడై యతడు దేవశ్రేష్ఠుడును, లోకేశుడును అయిన బ్రహ్మదేవుని కడకు పోయి "ఓ విధాతా! విశ్వసృష్టి కార్య ధురంధరా! ఈ చక్రముయొక్క భయమునుండి నన్ను కరుణతో కాపాడవా ప్రభూ" అని వేడుకొనిన, బ్రహ్మ యిట్లనెను.

"మునివర్యా! శ్రీహరియొక్క ఈ సుదర్శన చక్రాగ్నిజ్వాలల నెవ్వడును వారింపలేడు. నేను, శివుడు, దక్షుడు, ఇంద్రాదులు, ప్రజాపతులు, భృగువు, రాజులు, ఆ విష్ణువుయొక్క ఆజ్ఞలు శిరోధార్యములుగా గ్రహించి కార్యములు నిర్వహింతుము. అందుచేత ఈ సుదర్శనుని నేను ఆపలేను. అని బ్రహ్మ చెప్పగా నా ముని కైలాసమునకు పోయి, శివుని ప్రార్థించి, చక్రము బారినుండి రక్షింపుమని వేడుకొనెను. మహాదేవుడిట్లనెను:

వినుము నాయనా! ఏ విశ్వేశ్వరుని నుండి సకల జీవరాశులుద్భవించి, లయమును పొందునో, ఎవ్వని మాయాశక్తిచే మేము కూడా భ్రాంతిని చెందుచుంటిమో ఎవ్వని మాయను నేను, దేవలఋషి ప్రహ్లాదుడు, నారదుడు, బ్రహ్మ, సనత్కుమారుడు, ధర్ముడు, కపిలుడు, మరీచ్యాది అఖిల దేవతలును, సిద్ధులును, ఆ మాయామూలమిట్టిదని యెఱుంగలేమో, అటువంటి నిఖిలనాథుని యొక్క ఆయుధశ్రేష్ఠమైన సుదర్శన చక్రమును తొలగించుట మాకు వశమకాదు సుమా! కావున, మునీంద్రా! నీవు ఆ మహాత్ముడే (విష్ణువునే) శరణువేడుము. నీకు మేలు చేయగలవాడు అతడే అని శివుడు పలికిన, దూర్వాసుడు నిరాశుడై వైకుంఠమున కేగెను.

శా. ఆ వైకుంఠములోని భర్మ మణి సౌధాగ్రంబు పై లచ్చి దా
గ్రేవన్ మెల్లన నర్మభాషణములం గ్రీడించుపుణ్యున్ హరిన్
దేవాధీశ్వరుఁ గాంచి "యో వరద! యో దేవేశ! యో భక్తర
క్షా విద్యా పరతంత్ర! మానుపఁగదే, చక్రానల జ్వాలలన్

ఆ వైకుంఠములో, మణిమయ సువర్ణ సౌధమున, లక్ష్మీదేవి చెంతనుండగా మధుర మనోహర సంభాషణలతో క్రీడింపుచుండగా, పుణ్యపురుషుడు, దేవాధీశ్వరుడు నైన శ్రీహరిని గాంచి, దూర్వాసుడిట్లు ప్రార్థించెను: "ఓ వరదా! ఓ దేవేశా! ఓ భక్తరక్షణ విద్యావిశారదా! నీ యొక్క చక్రాగ్నిజ్వాలల నుండి నన్ను రక్షింపవా?"

ఉ. నీ మహిమార్ణవంబు తుది నిక్కముగా నెఱుఁగంగలేక నీ
ప్రేమకు వచ్చు దాసునకుఁ గ్రించతనంబున నెగ్గుసేసితిన్
నా మఱపున్ సహింపు మట నారకుఁడైన మనంబులో భవ
న్నామము చింతసేసిన ననంత సుఖస్థితి నొందకుండునే

ఓ ప్రభూ! నీ యొక్క అనంత మహిమాసాగరతీరము నెఱుంగలేక, నీకు మిక్కిలి ప్రేమపాత్రుడైన నీ యొక్క దాసునకు, నా నీచగుణముచే కీడు చేయదలచితిని నా యొక్క పొఱపాటును మన్నింపుము దేవా! నరకమునకు పోవలసిన వాడైనను, మనస్సులో నీ దివ్యనామము స్మరించి, అనంత సుఖసౌఖ్యములు పొందును కదా!

అని పలికి, శ్రీహరి పాదకమలములకు మ్రొక్కి, లేవకయున్న దూర్వాసునితో శ్రీహరి యిట్లనెను :

ఓ మునీంద్రా! బుద్ధిమంతులైన సాధువులు పట్టుదలతో, నిర్మలమైన భక్తియనెడి లతలతో నన్ను నిలబెట్టి, మదపుటేనుగును బంధించునట్లు, నా హృదయమును దొంగిలించి, బంధించి యుంచుదురు. నేమను, వలలో చిక్కిన జంతువువలె, భక్తజనవత్సలత యనెడి వలలో చిక్కుకొని యుందును.

విప్రవర్యా! నేను క్రతువులకు, పూజలకు గోదాన సువర్ణదానాది దానములకు వ్రతములు, తీర్థయాత్రలు విరివిగా చేయు పుణ్యాకాంక్షులకు,

నేను చిక్కనుసుమా! మానసమున అతులిత భక్తి కలిగిన వారికి మాత్రమే నేను దక్కుదును.

నన్ను నమ్మువారికి నా భక్తులైనవారికి, నేనే పరమగతినై యుందును. నా భక్తుడెచ్చటికి పోయిన, వానివెంట నేనును పోవుచుందును. అదియునుగాక,

ఆ. తనువు మనువు విడిచి తనయులఁ జుట్టాల
నాలి విడిచి సంపదాలి విడిచి
నన్నె కాని యన్య మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్టివారి నైన

ఓ మునీంద్రా! దేహధ్యాసను విడిచి, మనుగడను మఱచి, భార్యాపుత్ర బంధువర్గములయందు సంగమును విడిచి, ధనసంపదలను విడిచి, నన్నే తప్ప అన్యమేదియు నెఱుగనివారిని, ఎట్టివారైనను, వారిని రక్షింపకుండ విడిచిపెట్టను. పంచజ్ఞానేంద్రియముల పోకడలను వశము నందుంచుకొని, బుద్ధిమంతులు (ఉత్తమభక్తులు) నన్నే తమ హృదయములందు ప్రతిష్ఠించుకొని యుంచుకొందురు.

క. సాధుల హృదయము నాయది
సాధుల హృదయంబు నేను జగముల నెల్లన్
సాధుల నేన యెఱుంగుదు
సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా!

ఓ బ్రాహ్మణోత్తమా! సాధువులు తమ హృదయములను నాకర్పింతురు. గావున, అవి, నావియే. జగములన్నిట సాధువుల హృదయము నేనే (వారి హృదయముల నిండా నేనే యుందును.) సాధువులను నేనే యెఱుగుదును. నా యొక్క చరితమును (గుణగణములను) సాధువులే ఎఱుగుదురు.

ఆ. ధారుణీసురులకుఁ దపము విద్యయు రెండు
ముక్తి సేయుచుండు ముదముతోడ
దుర్వినీతులగుచు దుర్జనులగువారికి
నివియె గీడు సేయ కేల యుండు

ఓ విప్రుడా! సద్బ్రాహ్మణులకు తపస్సు, విద్యయు, ఆనందమునిచ్చి, ముక్తికి చేరువజేయును. కాని, నీతి బాహ్యులైన దుర్జనులకు ఆ తపస్సు విద్యలే కీడు చేయకుండ ఎట్లు విడిచిపెట్టును? సాధువులలో నా తేజము మిక్కుటముగ నుండును. ఆ తేజమే, సాధువులను కష్టపెట్టెడివారిని అగ్నిజ్వాలవలె భయపెట్టి, ఆనందమును హరించివేయుట తథ్యము సుమా! అందుచేతనో బ్రాహ్మణోత్తమా! నీవు పోయి, సదయుడు, లోకవినుత గుణములు గలవాడు, అంబరీషుని సంతృప్తునిజేసి, వేడుకొనిన, అతడు నీకు శరణమిచ్చును.

మ. అని శ్రీవల్లభుఁ డానతిచ్చిన మహోద్య చ్చక్ర కీలావళీ
జనితాయాసుఁడు నిర్వికాసుఁడుదిత శ్వాసుండు దుర్వాసుఁడ
ల్లన యేతెంచి సభక్తిఁ గాంచెఁ గరుణాలావణ్యవేషున్ విదో
షు నయోదారమనీషు మంజుమితభాషు న్నంబరీషున్ వెసన్

సుదర్శన చక్రాగ్నికీలల భయముచే పరువులెత్తి అలసిపోయిన వాడును, మనోవికాసమును కోల్పోయినవాడును, ఎగశ్వాసలతో నున్నవాడును, అయిన దూర్వాసముని, వడివడిగా పోయి, కరుణాలావణ్య స్వరూపుడును, దోషరహితుడును, గొప్ప ఉదార స్వభావుడును, బుద్ధిమంతుడును,, మృదుమధుర మితభాషియునైన అంబరీషుని శీఘ్రముగ గాంచెను.

చూచి, దుఃఖముతో ఆ రాజచంద్రుని పాదములు పట్టుకొని విడువకున్న ఆ రాజు పాదములను వెనుకకు లాగుకొని, దయార్ద్రహృదయుడై సుదర్శన చక్రమునిట్లు స్తుతించెను.

సీ. నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవసమీరంబు నీవ భూతేంద్రియనికర మీవ
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లోకేశులు నీవ సర్వాత్మయు నీవ కాలంబును నీవ జగము

తే. నీవ బహుయజ్ఞభోజివి నీవ నిత్య
మూలతేజంబు నీకు నే మ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించునట్టి
శస్త్రముఖ్యమ కావవే చాలు మునిని

శ్రీమహావిష్ణువు మిక్కిలిగ మన్నించునట్టి ఓ శస్త్రరాజమా! నీకు నేను మ్రొక్కుచున్నాను. నీవె అగ్నివి, నీవె సూర్యుడవు, నీవె చంద్రుడవు, నీవె జలము, నీవె భూమివి, నీవె ఆకాశము, నీవె వాయువు, నీవె భూత, ఇంద్రియ సమూహములును, నీవె బ్రహ్మమును, నీవె సత్యమును, నీవె యజ్ఞమును, నీవె యజ్ఞ, ఫలమును, నీవె లోకేశులు, నీవె సర్వాత్మవు, నీవె కాలము, నీవె జగమును, నీవె యజ్ఞభోక్తవు, నీవె సత్యమూల తేజము, అట్టి ఓ సుదర్శన చక్రమా! నీకు వందనములు. ఈ మునిసత్తముడింత వరకు అనుభవించిన వ్యథ చాలును. ఈయనను విడిచిపెట్టుము.

ఓ చక్రరాజమా! దైత్యులపై యుద్ధసమయమున శ్రీహరి నిన్ను రప్పించి రాక్షసులపై ప్రయోగించగనే ఆ విషయము ముందే తెలుసుకున్న దైత్యులకు నడుములు, శిరములు, పాదములు, భుజములు, తొడలు, చేతులు మొదలైన అంగములన్నీ శక్తిహీనములై ప్రాణములు విడిచిపెట్టునుకదా!

కలతజెంది నిద్రపోయిన అసురులకు నీవు కలలో కనిపించినంతనే వారు దీర్ఘనిద్ర (ప్రాణములు వదలి) పోవుదురుకదా! అట్లే అసురాంగనలు నిన్ను కలలో గాంచిన ఉదయం లేవగానే పలుపరించెదరట.

ఓ సుదర్శనమా! చీకటిని బాపి వెలుగునిచ్చి, సజ్జన కోటిని ఉద్ధరించుచుండు నీయొక్క తేజోకిరణముల శోభను విధాత కూడ వర్ణింపలేడు కదా! అద్భుతమైన నీ రూపము ఆ పరమేశ్వరునితోనే వ్యక్తమై తుదిలేని అనంతమైనట్టిది.

శ్రీహరి, నన్ను హింసింపబోవు దుష్టులను శిక్షింపుటకు నిన్ను నియోగించెను. ఈ తాపసి మిక్కిలి ఆపన్నుడై యున్నాడు కావున నీతనిని ఇక విడిచిపెట్టుము, అని పలికి చేతులు జోడించి నొసట పెట్టుకొని నమస్కరించెను.

రాక్షసులపట్ల అగ్నిపిడుగును, ధర్మరక్షణ సేతువును, విమలరూపమును విశ్వదీపమును, ఇంద్రరక్షణమును అయిన చక్రరాజమునకు నేను నమస్కరించుచున్నాను.

ఆ. విహితధర్మమందు విహరింతునేనియు
నిష్టమైన ద్రవ్యమిత్తునేని
ధరణిసురుఁడు మాకు దైవతం బగునేని
విప్రునకు శుభంబు వెలయుఁగాక

నేను, నాయొక్క విధ్యుక్తధర్మములను నిష్ఠతో నిర్వహించిన వాడనైతినేని, సత్పాత్రులకు ఇష్టమైన ద్రవ్యము నిచ్చినవాడనైతినేని, ఈ బ్రాహ్మణోత్తముని నేను దైవ సమానునిగ భావించిన వాడనైతినేని, ఈ భూసురోత్తమునకు శుభము కలుగుగాక!

అఖిల గుణములకు నాశ్రయుడైన శ్రీహరి, నా సేవలు, పూజలు వలన సంతోషించిన వాడైన, ఆ నిఖిలాత్మమయుడగు హరి, ఈ భూసురునికి ఇప్పుడు సుఖమును కలిగించుగాక!

ఈ విధముగా రాజుచే స్తుతింపబడిన సుదర్శనచక్రము, మునిని విడిచి మఱలిపోయెను. అంత దుర్వాసముని శాంతిని పొంది, మెల్లని, చల్లని, మేలిమి మాటలతో రాజును దీవించి, యిట్లనెను:

ఓ రాజశ్రేష్ఠమా! నా తప్పును మన్నించి నాకు ఇంతమేలు చేసితివికదా! శ్రీహరి పాదపద్మముల నింత దృఢముగ కొలుచు నీ భక్తికి, ఆశ్చర్యమగు చున్నది. నీవంటివారు చాలా అరుదుగా నుందురు. నీవంటి ఉత్తమ సాధుజనులకు, ఇచ్చుటయందును ఆపదలో రక్షించుటయందును,, మిత్రభావముతో నుండుట యందును, మొదలైన గుణములు సహజముగానే వచ్చునుకదా! మఱియును

మ. ఒకమా టెవ్వని పేరు కర్ణములలో నొయ్యార మై సోఁకినన్
సకలాఘంబులుఁ బల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టి స
త్పుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశుని
న్నకలంకస్థితిఁ గొల్చు భక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ!

రాజేంద్రా! ఎవ్వరి పేరొక్కమారైనను, అలవోకగ నైనను, చెవుల సోకినచో సకల పాపములు తొలగిపోవునో, అట్టి సకల శుభంకరుని, మంగళకరుని,

తీర్థపాదుని, (అనగా పాదము సోకినచోట తీర్థమేర్పడునట్టివానిని, లేదా, పాదజలము ప్రవహింపగా తీర్థమేర్పడినట్టి వానిని) శ్రీహరిని విష్ణుని, దేవదేవేశుని, నీ వంటి నిర్మల భక్తులు అత్యంతాసక్తితో కొల్చెదరు కావున వారి కెటువంటి ఆటంకములును కలుగవు కదా!

ఓ రాజా! నేను చేసిన తప్పులను మన్నించి, విష్ణుచక్రాగ్నియొక్క దాహమును తొలగించితివి. ఓ నరేశ్వరా! నీ యొక్క దయారసముచే నా ప్రాణములు మఱల కుదుటబడినవి. నేను ధన్యుడనైతిని. నీ కెల్లప్పుడును శుభము కలుగుచుండవలెను గాక! అని నేను కోరెదను. నేనిక వెడలెదను. అనగా నా రాజు, ముని వల్లభుని పాదములకు మ్రొక్కి, మిక్కిలి గౌరవించి, మృష్టాన్నభోజనము ప్రీతిగా పెట్టించెను. ముని సంతృప్తుడయ్యెను. మఱియు నిట్లనెను:

శా. కంటిన్ నేటికి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయ ప్రీతిగా
వింటి న్నన్నముఁగొంటి నీగృహమునన్ వేడ్కన్ ఫలం బబ్బె నే
మంటిం బోయెద నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
యింటన్ మేదిని సన్నుతింపఁ గల రీమీఁదన్ నరేంద్రాగ్రణీ!

రాజోత్తమా! అంబరీషా! నీ యొక్క మహత్త్వమును నేడు నేను కంటిని. నీ మధురవాక్కులను వీనులవిందుగా వింటిని, నీ గృహమందు మృష్టాన్నమును తృప్తిగా నారగించితిని, నాకు వ్రతభోజన ఫలము లభించెను; నేను నీ యందిప్పుడు స్నేహభావముతో నిష్క్రమించెదను. ఓ రాజా! ఇక మీదట, దేవతలు స్వర్గమందును, మానవులు భూమిపైనను, నీయొక్క పుణ్యచరితమును, సుఖాసీనులై పొగడుచు, ముచ్చటించుకొను చుందురు. అని చెప్పి, దుర్వాసుడు అంబరీషుని దీవించి, కీర్తించి, ఆకాశవీధిలో బ్రహ్మలోకమునకు వెడలెను. మునీశ్వరుడు తిరిగివెళ్లుసరికి ఒక సంవత్సరము నిండెను. వ్రతము పరిపూర్ణమయ్యెను.

ముని భోజనము చేసిన పిమ్మట అతిపవిత్రమైన ప్రసాదమును రాజశ్రేష్ఠుడు గైకొని, తాపసి కష్టమును తొలగించుటకు తానెంతవంటివాడను (అల్పుడను,

అశక్తుడను) అంతయు నా శ్రీహరియొక్క కృపామహత్మ్యమే కదా! యని తలంచినవాడై,

క. హరిఁ గొల్చుచుండువారికిఁ
బరమేష్ఠిపదంబు మొదలు పదభోగంబుల్
నరకసమములను తలఁపున
ధరణీరాజ్యంబుతోడి తగులము మానెన్

శ్రీహరిని కొల్చువారికి (వైకుంఠధామము తప్ప) బ్రహ్మపదము వఱకుగల ఏ పదమైనను నరకతుల్యమే (జన్మకారకములు గనుక అవాంఛనీయములే) యని తలంచినవాడైన అంబరీషుడు రాజ్యముతో సంగమును వీడెను. అట్లు విరక్తుడై,

తనతో సమానులైన పుత్రులను పిలిపించి, రాజ్యభారమును, వారికి పంచిపెట్టి, తాను అరణ్యములో ప్రవేశించి, కామక్రోధాదులను జయించినవాడై, మహాత్ముడైన ఆ అంబరీషచక్రవర్తి శ్రీహరి సన్నిధిని చేరెను.

పరీక్షిన్మహారాజా! ఈ అంబరీషుని చరితమును ప్రీతితో విన్న, చదివిన మానవుడు ధీ సంపన్నుడై భోగములను పొందువాడై, పుణ్యాత్ముడై యుండును అని శుకయోగీంద్రుడు చెప్పెను.

అంబరీషోపాఖ్యానము సమాప్తము.

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

## 2. శ్రీశుకవాణి - భక్తిమార్గము (ద్వితీయ స్కంధము)

శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుతో నిట్లు చెప్పెను :

రాజా! పూర్వము బ్రహ్మదేవుడు వేదములను మూడుసార్లు తరచి తరచి, విశ్లేషించి, నిర్ధారించిన సత్యమేమనగా, మానవునకు భక్తిమార్గము వినా వేఱొక మార్గము ననుసరించిన మోక్షము సిద్ధించదు. అని

సీ. అఖిలభూతములందు నాత్మరూపంబున, నీశుండు హరియుండు నెల్లప్రొద్దు
బుద్ధ్యాదిలక్షణంబులఁ గానఁబడును మ, హాత్సేవనీయుఁడహర్నిశంబు
వందనీయుఁడు భక్తవత్సలుండత్యంత, నియతుఁడై సతతంబు నియతబుద్ధి
నాత్మరూపకుఁ డగు హరికథామృతమును, గర్ణపుటంబులఁ గాంక్ష దీరఁ

తే. గ్రోలుచుండెడుధన్యులు కుటిలబహుళ
విషయమలినీకృతాంగముల్ వేగవిడిచి
విష్ణుదేవునిచరణార విందయుగము
కడకుఁ జనుదురు సిద్ధంబు కౌరవేంద్ర

ఓ కౌరవవంశశ్రేష్ఠా! జీవరాశులన్నిటి యందును, ఆత్మరూపమున పరమేశ్వరుడైన శ్రీహరి ఎల్లప్పుడును వెలసియుండును. విశుద్ధమైన బుద్ధిద్వారా మాత్రమే అతడు తెలియనగును. అతడు మహాసేవనీయుడు (సేవింపవలసిన వాడు). అహర్నిశము (నిరంతరము) పూజింపవలసినవాడు. భక్తవత్సలతలో (భక్తులను అనుగ్రహించుటయందే) ఎల్లప్పుడును నియుక్తుడై యుండువాడు; ఆత్మరూపుడైన ఆ శ్రీహరియొక్క కథామృతమును, నియతబుద్ధితో, వీనులవిందుగా, కాంక్షతీర పానము చేయు ధన్యులు, పెక్కు విషయభోగములతో మలినమైన దేహములను సత్వరమే విడిచి, శ్రీమహావిష్ణువు చరణ కమలముల కడకు నిశ్చయముగ చేరుదురు.

ఇది నిజము. మనుష్యులై జన్మించినవారు, మరణమాసన్నమైనవారు, మహాజ్ఞానులు, చేయవలసిన కర్తవ్యమిదియే. రాజా! వాసుదేవునియందు భక్తిమహిమను ఎట్లు వర్ణింపగలను? వినుము:

సీ. వాసుదేవ శ్లోకవార్త లాలించుచుఁ, గాల మేపుణ్యుండు గడపుచుండు
నతని యాయువుఁదక్క నన్యుల యాయువు, నుదయాస్తమయముల నుగ్రకరుఁడు
వంచించి కొని పోవు వాఁడది యెఱుఁగక, జీవింతుఁ బెక్కేండ్లుసిద్ధ మనుచు
నంగనాపుత్ర గేహారామవిత్తాది, సంసార హేతుక సంగసుఖముఁ

తే. దగిలి వర్తింపఁ గాలంబు తఱియెతెంగి
దండధరుకింకరులు వచ్చి తాడనములు
సేసికొనిపోవఁ బుణ్యంబు సేయ నైతిఁ
బాపరతినైతినని బిట్టు పలవరించు

వాసుదేవుని కీర్తిగాథలను వినుచు, ఏ పుణ్యపురుషుడు కాలము గడుపుచుండునో అతని ఆయువు తప్ప ఇతరుల ఆయువు వ్యర్థముగ సూర్యోదయాస్తమయములచే తరిగిపోవుచున్నవని యెఱుంగని అవివేకులు. తాము చాలాకాలము బ్రతికియుందుమను భ్రమలో, దారా పుత్ర గృహ ఆరామ విత్తాది సంసార బంధములలో, సుఖసంగములో తగుల్కొని, దేహాంతమున యమకింకరులచే కొట్టబడుచు ఈడ్వబడుచున్నప్పుడు అయ్యో! పుణ్య కార్యములను చేయకుండ పాపకార్యముల యందే కాలము వ్యర్థము చేసితినేయని వాపోయెదరు.

రాజా! పశువులు, పక్షులు, మొదలైన జీవరాసులు, ఆహార, నిద్ర, భయ మైథునములవంటి శరీర వ్యాపారములకు లోనై, పుట్టుచు, గిట్టుచు నుండుట లేదా? పరమేశ్వరుని గూర్చి చింతింపని మానవ మృగములు సూకర గార్దభముల (పందులు గాడిదలు) వలె నికృష్టమైన జీవితములను గడిపెదరు కదా! విష్ణుగాథలను వినియుండని చెవులు కొండ బిలముల వంటివి. చక్రధరుని పైని పద్యములను చదువని నాలుకలు కప్పనాలుకల వంటివి. శ్రీనాథుని యొక్క దివ్యమంగళ రూపమును చూడలేని కన్నులు నెమలి పింఛపు కన్నులవంటివే. శ్రీహరిపాదముల పై నుండు తులసీ దళముల పరిమళము నాఘ్రాణింపని ముక్కు పందిముక్కువంటిదేకదా! అంతేకాదు, ఓ రాజా!....

సీ. నారాయణుని దివ్య నామాక్షరములపైఁ, గరఁగని మనములు కఠినశిలలు
మురవైరికథలకు ముదితాశ్రురోమాంచ, మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడునియౌదల నున్న, కనకకిరీటంబు గట్టెమోపు
మాధవార్పితముగా మననిమానవుసిరి, వనదుర్గచంద్రికావైభవంబు

ఆ. కైటభారిభజన గలిగియుండనివాఁడు
గాలిలోన నుండి కదలు శవము
కమలనాభుపదముఁ గననివానిబ్రదుకు
పసిఁడికాయలోని ప్రాణిబ్రదుకు

ఓ రాజా! శ్రీమన్నారాయణుని దివ్యనామాక్షర స్మరణమాత్రముచే కరిగి ప్రవహింపని మనస్సులు కఠిన శిలలే కదా! విష్ణుదేవుని కథాశ్రవణముచే ఆనందబాష్పధారలతో రోమాంచము (గగుర్పాటు) కాని శరీరమొక కట్టె మొద్దువంటిదే; చక్రధారునికి ప్రణమిల్లని మూఢుని తలపైన నొకబంగారు కిరీటమున్నను, అదియొక కట్టెల మోపువలె బరువుచేటేగాని శోభనిచ్చునా? భగవంతునికి అర్పితము కాని (భగవత్కార్యములలో వినియోగింపబడని) ఐశ్వర్యము అడవిగాసిన వెన్నెలవలె నిరర్థకమేగాని, రాణించునా? వాసుదేవుని సేవయందు వినియోగింపబడని శరీరము గలవాడు ప్రాణవాయువుచే కదిలే శవము వంటివాడు. పద్మనాభుని పాదముల నాశ్రయింపని వాని బ్రతుకు బంగారు భరిణెలోని పురుగు బ్రతుకు సుమా! అని శుకయోగీంద్రుడు చెప్పి, భగవంతు నిట్లు స్తుతించెను.

మ. పరుఁ డై యీశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవస్థాన సం
హరణక్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గతజ్యోతియై
పరమేష్ఠి ప్రముఖామరాధిపులకుం బ్రాపింప రాకుండు దు
స్తరమార్గంబునఁ దేజరిల్లు హరికిం దత్త్వార్థి నై మ్రొక్కెదన్

ప్రకృతికి పరమైనవాడు, ఈశ్వరుడు, మహామహిముడు, (సాటిలేని మహిమలు గలవాడు) సృష్టి స్థితి లయ క్రీడలను నడిపించువాడు, త్రిశక్తి యుతుడు (త్రిమూర్తులయొక్క ఏకైకశక్తి స్వరూపుడు), సర్వజీవరాసులలో

నంతర్జ్యోతియై ప్రకాశించువాడు, బ్రహ్మాది దేవతలకు కూడ అందుబాటులో లేని దుస్తరమైన మార్గమున ప్రజ్వలించువాడునైన శ్రీహరిని నేను తత్త్వ జ్ఞానమును కోరుచు ప్రార్థించుచున్నాను.

ఉ. ఏవిభువందనార్చనము లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభులీల లద్భుతము లెప్పుడు సంశ్రవణంబు సేయ దో
షావలిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగు నండ్రు నే
నావిభు నాశ్రయించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్

ఏ విభుని (సర్వవ్యాపి ప్రభువును), వందనము చేసిన, అర్చనము చేసిన, స్మరణ చేసిన, నామ సంకీర్తనము చేసిన, ఎవ్వని అద్భుతలీలా గాథలను శ్రవణము చేసిన, దోషములన్నీ తొలగిపోయి, లోకము సర్వశుభములను పొందునో ఆ విభుని, పాపవిమోచనుని, శుభంకరుని నే నాశ్రయించెదను.

ఉ. ఏపరమేశు పాదయుగ మెప్పుడుఁ గోరిభజించునేర్పరుల్
లోపలిబుద్ధితో నుభయ లోకములందును సక్తిఁ బాసి యే
తాపము లేక బ్రహ్మగతిఁ దారు గతశ్రములై చరింతు రే
నాపరమేశు మ్రొక్కెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్

ఏ పరమేశ్వరుని పాదముల నెల్లవేళల కోరి, సేవించి, నిపుణులైన సాధకులు అంతర్దృష్టితో, నిహపర లోకముల యందాసక్తిని వీడి, ఏ తాపములు లేక, పరబ్రహ్మపదము నొందుటకు కష్టముల నధిగమించి చరించెదరో, అట్టి పాపమోచనుడును, భద్రకీర్తనుడును అయిన పరమేశ్వరుని మ్రొక్కెదను.

చ. తపములఁ జేసి యైన మఱి దానము లెన్నియుఁ జేసి యైన నే
జపములఁ జేసి యైన ఫలసంచయ మెవ్వని ( జేర్పకున్న హే
యపదములై దురంతవిప దంచితరీతిగ నొప్పు చుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్

ఎన్నితపములు చేసినను, మఱియెన్ని దానములు జేసినను, ఎన్నిజపములు చేసినను, వాటియొక్క ఫలములను ఏ పరమేశ్వరునకు సమర్పణము

చేయకుండిన, అవి నిందార్హములై ఆపదలను తెచ్చిపెట్టునవిగా పరిణమించునో, అట్టి అపరిమితుడును, పాపవిమోచనుడును, భద్రకీర్తనుడును అయిన ఆ ప్రభువును భజించెదను.

మ. తపముల్ సేసిననో మనో నియతినో దానవ్రతవృత్తినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో సద్భక్తినో యెట్లు ల
బ్ధపదుం డౌ నని బ్రహ్మరుద్రముఖరుల్ భావింతు రెవ్వాని న
య్యపవర్గాధిపుఁ డాత్మమూర్తి సులభుం డౌఁగాక నా కెప్పుడున్

తపములు చేసియా, లేక మనస్సును నియంత్రించియా లేక దానవ్రతముల జేసియా, లేక జపమంత్రములు పఠించియా, లేక శ్రుతి స్మృతులను వల్లించియా, లేక ఉత్తమ భక్తిప్రక్రియల చేతనా, లేక యింకేమైనను చేసియా, యని బ్రహ్మరుద్రాది దేవతలు ఆ దివ్యసన్నిధి నెట్లు చేరగలమా యని ఎల్లప్పుడు అన్వేషించుచుందురో, ఆ మోక్షప్రభువు, ఆత్మస్వరూపుడు, నా కెల్లవేళలా సులభుడగుగాక!

క. శ్రీపతియు యజ్ఞపతియుఁ బ్ర
జాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవశ్రే
ణీపతియున్ గతియు నైన నిపుణు భజింతున్

శ్రీదేవికిని, యజ్ఞములకు, ప్రజలకును, బుద్ధికి, జగత్తునకును, భూమికి, యాదవశ్రేణులకును, పతియు, గతియునైన ప్రభువును నేను సేవించెదను.

మ. అణువో కాక కడు న్ మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణియో నిర్గుణుడోయటంచు విబుధుల్ గుంఠీభవత్తత్త్వమా
ర్గణు లై యేవిభుపాదపద్మభజనో త్కర్షంబులం దత్త్వవీ
క్షణముం జేసెద రట్టివిష్ణుఁ బరమున్ సర్వాత్ము సేవించెదన్

ఆ పరమాత్ముడు అణుస్వరూపుడా లేక సర్వవ్యాపియైన మహాస్వరూపుడా; అతడు దేశకాలాదులచే పరిచ్ఛిన్నుడా (పరిమితుడా) లేక అప్రమేయుడా;

సగుణుడా (త్రిగుణములతో కూడియున్నవాడా) లేక నిర్గుణుడా (ఎట్టి గుణములు లేనివాడా) అని పండితులు వ్యర్థమైన తత్త్వాన్వేషణచేసి చేసి తెలుసుకొనలేక చివరకు ఏ విభుని పాదపద్మములను మిక్కిలిగా భజించి తత్త్వార్థమును కాంచెదరో అట్టి సర్వాత్మకుడైన పరాత్పరుని నేను భజించెదను.

అని స్తుతించి, శుకయోగీంద్రుడు పరీక్షిత్తుతో నిట్లు చెప్పెను: రాజా! ఒకనాడు నారదమహర్షి, భగవంతుని గురించి చెప్పుమని బ్రహ్మదేవుని ప్రార్థింపగా బ్రహ్మ ఇట్లు చెప్పెను:

నాయనా, నారదా! ఆ భగవంతుని మాయాశక్తిని గుఱించి పూర్తిగా తెలుసుకొనుటకు నాకును సాధ్యపడలేదు. ఇకనితరులకెట్లు సాధ్యపడును?

**క. ఆయీశుఁ డనంతుఁడు హరి**
**నాయకుఁ డీ భువనములకు నాకున్ నీకున్**
**మాయకుఁ బ్రాణివ్రాతము**
**కీయెడలన్ లేదు నీశ్వ రేతరము సుతా**

కుమారా! ఆ పరమేశ్వరు డనంతుడు. ఆ శ్రీహరి సమస్తలోకములకును, నాకును, నీకును, మాయకును ప్రాణి సముదాయములకును ప్రభువు. ఆయన కంటె అన్యమైన దేదియును ఎచ్చటను లేదు పుత్రా!

విశ్వమే తన రూపముగనున్న ఆ పరమేశ్వరుడు, సర్వులకు నాశ్రయుడై యుండగోరి, ఈ బ్రహ్మాండమును వివరముగ చతుర్దశ భువనములుగ విభజించెను.

పుత్రా! సర్వము విష్ణుమయమే. వేయేల! బ్రహ్మాండమతని జేనలోన ఇమిడియుండును. భూతభవిష్యద్వర్తమాన త్రికాలములతని యందే యుండును. ఆ పరమేశుని బుద్ధిద్వారా నెఱుంగ శక్యముకాదు. సూర్య మండలములో నున్న భాస్కరుడు జగములకు వెలుగునిచ్చునట్లు, ఆ పరమేశుడు బ్రహ్మాండము నందంతటను నిండియుండి, బహిరంతరముల యందు తన చైతన్య తేజమును నింపును.

క. అగుణుం డగుపరమేశుఁడు
జగములఁ గల్పించుకొఱకుఁ జతురత మాయా
సగుణుం డగుఁ గావున హరి
భగవంతుం డనఁగ బరఁగె భవ్యచరిత్రా

నామరూప గుణములేవియులేని నిర్గుణ పరమాత్మ, జగములను సృష్టించుటకొఱకు, మిక్కిలి నేర్పుతో, మాయను వినియోగించి, నామరూప గుణముల వహించి సగుణరూపము ధరించి, భగవంతుడనబడి వెలసెను.

క. విశ్వాత్ముఁడు విశ్వేశుఁడు
విశ్వమయుం డఖిలనేత విష్ణుఁ డజుం డీ
విశ్వములోఁ దా నుండును
విశ్వము దనలోనఁ జాల వెలుఁగుచు నుండన్

విశ్వాత్ముడును (విశ్వమే తానై యున్నవాడును), విశ్వేశుడును (విశ్వమునకు ప్రభువును) విశ్వమయుడును (విశ్వమంతట వ్యాపించియున్నవాడును) సర్వమునకు అధినాయకుడును, జన్మయేలేనివాడును యగు మహావిష్ణువు, ఈ విశ్వము తనలోన ప్రకాశించుచుండగ, నా విశ్వమునందు తాను వసించు చుండును.

నారదా! ఆ పరమేశునిచే నియమింపబడి, నేను చరాచర జీవరాసుల సృష్టిని విస్తృతముగ చేయుదును, ప్రభవిష్ణుడు పోషించును, శివుడు లయకార్యమును చేయును. పద్మనాభుడైన శ్రీహరి, అచ్యుతుడు, త్రిమూర్తుల శక్తులను వహించి మూలపురుషుడై ఆదిమూర్తిగ నుండును.

శ్రీహరి భగవంతుడు, అనంతుడు, కరుణాసాగరుడు, సృష్టికి కార్యకారణహేతువై యున్నవాడు, ఆ విభునికంటె గొప్పవాడింకెవ్వడును ఎంత వెదకినను కానరాడు తండ్రీ!

ఆ పరమాత్ముడు జన్మలేనివాడు; ఈ జగమును, ప్రతికల్పమునందును, సృష్టించి, పోషించి, లయింపజేయునట్టి పవిత్రుడు; అట్టి పరబ్రహ్మమును, నిత్యుని, కేవలుని, అద్వితీయుని, జగమంతా నిండియున్నవానిని, విశుద్ధజ్ఞాన

స్వరూపుని సర్వాత్ముని, ఆదియంతములు లేనివానిని, నిర్గుణుని, నేను మనసా స్మరించెదను.

అందుచేత, నారదా! నిత్యశాంతుడు, విశ్వమయుడు, కేవలజ్ఞాన స్వరూపుడు, శుద్ధాత్ముడు, సర్వేశ్వరుడు, శాశ్వతుడు, సముడు, అయిన ఆ పరమేశుని, నీవు నీ హృదయములో సదా ప్రతిష్ఠించుకొని యుంచుము. అప్పుడు మాయనీ దరిజేరదు. శ్రీహరిని మనస్సులో స్థిరముగ నిలుపుకొన్నవారు శోకములేని సుఖస్థితిని పొందెదరు. అటువంటి బుద్ధిమంతులు భగవత్ స్మరణ వినా ఇంకేమియును చేయరు. ఆ భగవంతుడు సర్వశరణ్యుడు, కర్మఫలప్రదాత, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి, కల్పాంతమున సర్వమూ లయించినను, తాను మాత్రము నిర్వికారుడై నిలిచియుండును.

నాయనా! అంతటికిని ఆ విష్ణువే కారణభూతుడు. ఆయన వినా ఆశ్రయింపదగిన వారింకెవ్వరును లేరు. భగవంతుడు, అనంతుడు, విశ్వమును సృష్టించే ఉదార స్వభావుడు అయిన ఆ పరమేశుని సద్గుణములను గొప్ప మనస్సుతో కొనియాడలేకున్నచో, ప్రకృతికి అతీతమైన నిర్గుణ బ్రహ్మమును చిత్తము చేరలేదు. ఆయన మహిమల నెల్లప్పుడును స్తుతించుచుండవలెను. ఇతరులు స్తుతించుచుండగా వినవలెను. మనస్సులో ఆ మహిమలను మననము చేయుచు ఆనందించాలి. ఆ విధముగ నాచరించువారు దేవుని మాయకు లోబడరు.

అని నారదమహర్షికి బ్రహ్మ బోధించెను.

శ్రీశుకవాణి సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

## 3. ధ్రువస్తుతి

స్వాయంభువ మనువు పుత్రుడైన ఉత్తానపాదునకు సునీత సురుచి యను భార్యలుండిరి. సునీతకు ధ్రువుడను పుత్రుడును, సురుచికి ఉత్తముడను పుత్రుడును కలిగిరి. రాజుకు చిన్నభార్యయందుండు వ్యామోహముచేత నతడు ఉత్తమునే మిక్కిలి ప్రేమించుచుండెను. ఒకనాడు ధ్రువుడు తన తండ్రి తొడపై కూర్చొనుటకు ముచ్చటపడి, తండ్రివద్ద చేరెను. తండ్రి ఆ చిన్నారి బాలుని నిరాదరణతో తిరస్కరించెను. అది చూచి, సురుచి, తన గర్భమున పుట్టినవానికే తండ్రి ఒడిలో కూర్చొను అర్హత యుండునని యీసడించుకొని ఆ బాలుని యీడ్చివేసి "పోయి, నా గర్భమున నిన్ను పుట్టించుమని ఆ భగవంతుని వేడుకో" అని గద్దించి, పొమ్మనెను. తీవ్రముగ గాయపడిన మనస్సుతో నా బాలుడు తల్లియైన సునీతవద్దకు పోయి ఏడ్వగా, సార్థకనామయైన ఆ తల్లి, అందరికీ ఆ భగవంతుడే శరణ్యమని ఊరడించినను ధ్రువుడు తృప్తిజెందక ఆ భగవంతునే వేడుకొనవలెనను పట్టుదలతో అరణ్యములో వడివడిగా పోవుచుండగా నారదమహర్షి ఎదురయ్యెను. భగవంతుని దర్శింపవలెనను దృఢనిశ్చయము, పట్టుదలను గుర్తించిన నారదుడు సంతసించి ద్వాదశాక్షరీ మంత్రము నుపదేశించి, బాలుని, మధువనమునకు పోయి, శ్రీమన్నారాయణ నామజపము చేయుచు దీక్షగా తపస్సు చేయుమని చెప్పి, తపోనిష్ఠను బోధించెను.

ధ్రువుడు మధువనములో తీవ్రముగ తపము చేయనారంభించెను. ఆరునెలలు నిద్రాహారములు మాని ఒంటికాలిపై చేసిన ఘోరతపస్సు కారణముగ నుత్పన్నమైన దివ్యతేజస్సు, మూడు లోకములను నింపివేసెను. అతని కాలిబొటనవ్రేలి ఒత్తిడికి భూమి ఇటునటు ఊగసాగెను. ప్రాణవాయువును నిరోధించి పరమేశ్వరునితో ననుసంధానము చేయుటచేత విశ్వము కంపించెను. ఊపిరాడక తల్లడిల్లుచున్న దేవతలు ప్రార్థింపగా శ్రీమహావిష్ణువు గరుడ వాహనుడై మధువనం చేరెను. అప్పుడు ధ్రువుడు తన హృదయకమలమందు ప్రకాశించుచున్న శ్రీహరిని తన్మయుడై దర్శించుచుండెను. గావున తన యెదుటనే ప్రత్యక్షమైయున్న ప్రభువును

గాంచలేదు. శ్రీహరి, బాలుని హృదయమునుండి అంతర్ధాన మవగా నాతడు కన్నులు తెఱచి, ఆ కరుణామూర్తిని కన్నులపండువుగ తిలకించెను. పులకించి పోయెను, ఆనందబాష్పధారలలో కరిగిపోయెను. సాష్టాంగ దండప్రణామములు చేసెను.

ఆనందముతో నుబ్బి తబ్బిబ్బు అయిపోవుచుండెనా ఐదేళ్ల బాలుడు. ఏమనాలో తెలియక నోరువమూగపోయినది. స్తుతించుటకు విద్యాసంస్కారములు లేవు. భాషచాలదు. చేతులు జోడించి నిల్చుండిపోయెను. కరుణామయుడు కనికరించి, వేదమయము, నాదబ్రహ్మము నయిన తన శంఖముతో బాలుని చెక్కిళ్లను స్పృశించి నిమిరెను. దానితో వేదవాంగ్మయ పదజాలములతో సహా ఆత్మతత్త్వ పరతత్త్వములతో కూడిన వాక్యములతో ఆ పరమేశునిట్లు స్తుతించెను:

ఓ దేవాదిదేవా! నీవు అఖిల శక్తి సంపన్నుడవు. స్తంభించిపోయిన నా యొక్క ఇంద్రియములకు, వాక్శక్తికి, ప్రాణములకు, సంచలనమును కల్పించిన అంతర్యామివైన నీకు నా ప్రణామములు. పరమాత్మా! సృష్టికి పూర్వము నీ వొక్కడివే యుండి, నీ నుండి విడదీయబడని జగత్తును, నీ సంకల్పముచే, మహత్తు, అహంకారము మొదలైన రూపములలో వ్యక్తపరచితివి. త్రిగుణాత్మకమైన ప్రకృతిచేత నానారూపములను కల్పింపజేసి, వాటియందు జీవునిగా ప్రవేశించి, వాటిని ప్రవర్తింపజేయు ఆత్మస్వరూపుడవైన నీకు వందనములు.

ప్రభో! కల్పాదిలో మేల్కొనిన బ్రహ్మదేవుడు, సృష్టి ప్రక్రియను మఱచి పోయి, నిన్ను శరణువేడి, నీచే అనుగ్రహింపబడిన జ్ఞానముచే సృష్టిరచన చేసెనుకదా! ఈశ్వరా! నీ యొక్క మాయచేత మతిచెడినవారు. నిన్ను ఆశ్రయించినవారై నీవు అనుగ్రహింపగల మోక్షమును కోరక, అవివేకులై, క్షుద్రమైన అర్థకామములనే కోరుకుందురు. వారు కోరుకొను ఐహిక ఇంద్రియ భోగములను కల్పవృక్షమువలె నీవు ప్రసాదించెదవు కూడను.

మ. అరవిందోదర తావకీనచరణధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ స్వానందకబ్రహ్మము
దరయన్ లేవఁట దండభృద్భటవిమానాకీర్ణులై కూలు నా
సురలోకస్థులఁ జెప్ప నేల సుజనస్తోమైకచింతామణీ

ఓ పద్మనాభా! నీయొక్క పాదపద్మముల ధ్యానముచే భక్తులు పొందిన పరిపూర్ణ ఆనందగాథలను వినుటవలన లభించిన ఘనసౌఖ్యము, ఆత్మానందము, బ్రహ్మానుభవము నందుకూడను లభించదట. ఏలనన, పుణ్యము క్షీణింపగనే యమభటులచే విమానముల నుండి క్రిందికి త్రోయబడుదురు. ఇక భోగలాలసులైన దేవతలగురించి వేఱుగా చెప్పనేల? సజ్జనుల కోర్కెలను దీర్చు చింతామణి వంటి ఓ దేవదేవా! నీకు నా వందనములు.

చ. హరిభజనీయమార్గనియతాత్మకు లై భవదీయమూర్తిపై
వఱలిన భక్తియుక్తు లగు వారలసంగతిఁ గల్గఁజేయు స
త్పురుషసుసంగతిన్ వ్యసన దుస్తరసాగర మప్రయత్నతన్
సరసభవత్కథామృతరసంబున మత్తుఁడ నై తరించెదన్

శ్రీహరీ! నిన్ను భజించుట యందు నిష్ఠగలవారై నీ రూపమును ధ్యానించుచుండు నీ యొక్క భక్తుల సాంగత్యమును నా కనుగ్రహింపుము. అట్టి సత్పురుషుల సాంగత్యము వలన వ్యసనములతో కూడియున్న ఈ దుర్భర భవసాగరమును, నీ యొక్క పవిత్రచరితామృతమును గ్రోలుచు, సులువుగ దాటివేయగలను.

చ. నిరతముఁ దావకీనభజనీయపదాబ్జసుగంధలబ్ధి ఎ
వ్వరిమది పొందఁగాఁగలుగు వారలు తత్ప్రియమర్త్య దేహమున్
అరయఁ దదీయదారతనయాదిసుహృద్గృహబంధువర్గమున్
మఱతురు విశ్వతోముఖ రమాహ్లాదయేశ ముకుంద మాధవా

ఓ మాధవా! ముకుందా! ఎల్లప్పుడును నీ యొక్క పూజనీయమైన పాదపద్మముల సుగంధ పరిమళము నాఘ్రాణింపగలుగు సజ్జన భక్తులు,

తాము అంతవఱకు నతిప్రియముగ లాలించి పోషించి యున్నట్టి దేహమును, దానికి సంబంధించిన భార్యాపుత్ర మిత్ర గృహ బంధుజనులతోడి సంబంధమును మఱచిపోవుదురు కదా! విశ్వతోముఖా! రమాపతీ!

ఓ పరమేశ్వరా! దేవ, దానవ, మానవ, జంతు జీవాదులతో నిండియుండి, ప్రకృతి పురుషులతో కూడియున్న నీ యొక్క విరాట్ స్వరూపమును గూర్చియే నేను వినియుంటిని గాని, ప్రభూ! ఇంద్రియగోచరము, ఐశ్వర్యయుతము, శాశ్వతము అయిన నీ యొక్క పరబ్రహ్మస్వరూపమును నేను తెలుసుకొన జాలను కదా!

ఓ సర్వేశ్వరా! కల్పాంతమున సకల సృష్టినీ నీలోనికి తీసుకొని విలీనము చేసుకొనెదవు. ఆదిశేషతల్పముపై యోగనిద్రలో శయనించెదవు. నీ యొక్క నాభి అనే సముద్రమునుండి ఉద్భవించిన స్వర్ణ కమలము నుంచి చతుర్ముఖ బ్రహ్మను పుట్టించెదవు. ఇట్లనేక మాఱులు చేయుచు వినోదించుచుండు నీ యొక్క దివ్యతేజోమయ పరబ్రహ్మ స్వరూపమునకు నేనత్యంత నిష్ఠతో ప్రణమిల్లుచుంటిని. ఓ శ్రీహరీ! శుభచరిత్రా! అనంతశుభంకరా! లక్ష్మీ వల్లభా, అవ్యయానందసాగరా! గోవిందా! ముకుందా! నీకివే నా ప్రణామములు.

ఓ దేవాదిదేవా! నీవు ఆదిపురుషుడవు, మాయాతీతుడవు, పరిశుద్ధుడవు, సర్వజ్ఞుడవు, కూటస్థుడవు, భగవంతుడవు, సాక్షిభూతుడవు, సర్వేశ్వరా! జ్ఞానము, అజ్ఞానము, వైరాగ్యము, వ్యామోహము వంటి పరస్పర విరుద్ధ శక్తులతో కూడియున్న జగత్తుకు కారణభూతుడవు నీవే! అద్వితీయము, అనంతము, ఆద్యము, ఆనందమయము, అవికారము అయిన పరబ్రహ్మవు నీవు. నీకు వందనములు. పరమేశ్వరా! నిష్కాములైన భక్తులు నిన్నే సర్వతోముఖ ఫలముగ భావించెదరు. వారికి నీ పాదపద్మములే సర్వస్వము. సకాములైన భక్తుల కోర్కెలను కూడ కృపతో తీర్చుచు, వారి సంసార భయములను తొలగించే కరుణాసాగరుడవు నీవు. నీకు అనేక నమస్కారములు - అని స్తుతించిన ధ్రువునితో మిక్కిలి సంతసించిన శ్రీహరి యిట్లు పలికెను:

రాజకుమారా! నీ తపస్సుకు సంతసించి, నీకు దర్శనమిచ్చితిని. నీ మనోభీష్టమును నెరవేర్చెదను. గ్రహములు, నక్షత్రములు, ధర్ముడు, అగ్ని,

కశ్యపుడు, శుక్రుడు, సప్తఋషులు, ప్రదక్షిణము చేయుచుండు ధ్రువక్షితి యను మహోన్నత స్థానమును నీవు పొందెదవు. ఈ పదమిదివరకెవ్వరును పొందియుండలేదు. మూడు లోకములు నశించినను అది నశింపదు. నీవు ఇరువది యారువేల సంవత్సరములు నీ తండ్రి విడిచిన రాజ్యమును పాలించిన అనంతరము ధ్రువక్షితిని అధిష్ఠించెదవు. ఇంద్రియములను జయించి ధర్మమార్గమున పరిపాలించెదవు. నీ తండ్రి, వానప్రస్థాశ్రమమునకు వెడలును. నీ తమ్ముడైన ఉత్తముడు వేటకువెళ్లి అడవిలో మరణించును. అతని తల్లి అడవిలో కారుచిచ్చులో నశించును. నీ తల్లి ఉత్తమ లోకమును పొందును. నీవు అనేకమైన యజ్ఞములను చేసి, నన్నారాధించెదవు. మరణకాలమున నీవు నన్ను స్మరించుచు సప్తర్షిమండలము పైనున్న ఉన్నతస్థానమును పొంది, నన్ను జేరెదవు" అని చెప్పి, స్వామి గరుడారూఢుడై నిష్క్రమించెను.

విష్ణువు వెళ్లిన పిమ్మట ధ్రువుడు చింతాక్రాంతుడై యిట్లు తలపోసెను: అయ్యో! నేనెంతబుద్ధిహీనుడను! జితేంద్రియులు, మునీంద్రులు, మిక్కిలి భక్తితో, పెక్కుజన్మల సమాధియోగ శక్తిచే ఏ పరమేశ్వరుని చరణకమలములను దర్శింపగలిగెదరో, ఆ శ్రీహరిని నేను ఆరునెలలు సేవించి, సాక్షాత్కారమును పొందినను, మాయామోహితుడనై అనిత్యమైన దానినే ఆశించితిని. తమ్మునికంటెను, ఇతరుల కంటెను, అత్యున్నత పదమునే అజ్ఞాతముగనైనను కాంక్షించి యుంటినేమో! గాని మోక్షప్రదాతయే ప్రత్యక్షమవగా, మోక్షమును కోరక మిన్నకుంటిని. నా యొక్క పూర్వకర్మయే నా బుద్ధిని పెడమార్గము పట్టించి యుండును. విషయవాసనలు విడిచిపెట్టవు కదా! - యని ధ్రువుడు ఊరటజెంది, నిజనగరికి జనెను.

ధ్రువస్తుతి సమాప్తం

**హరి: ఓం తత్ సత్**

❖ ❖ ❖

# 4. రుద్రగీత

పృధుచక్రవర్తి మనుమడైన బర్హిష్మదునికిని త్రిలోకసుందరియైన శతధృతికిని ఒకేసారి పదిమంది పుత్రులు కలిగిరి. వారందరూ ఒకే నామముతో ప్రచేతసు లనబడి ప్రసిద్ధికెక్కిరి. వారు ధర్మజ్ఞులు, సమదర్శనులు, పుణ్యాత్ములు. తండ్రియొక్క ఆదేశము ప్రకారము, సంతానము కోరి, వారు తపస్సు చేయుటకు పశ్చిమదిశగా పోవుచుండగా ఒక అందమైన పెద్ద సరస్సు కనిపించెను. ఆ సరస్సునుండి మహేశ్వరుడు బైటకు వచ్చెను. ప్రచేతసులు భక్తిపారవశ్యముతో నాయన పాదములపైబడిరి. దయామయుడైన శంకరుడు వారితో నిట్లనెను : "రాజకుమారులారా! మీరెవరో, మీ కోరిక ఏమిటో నాకు తెలుసును. మిమ్ములను అనుగ్రహించు నుద్దేశముతో మీకు దర్శనమిచ్చితిని. శ్రీహరి భక్తులు నాకు మిక్కిలి ఇష్టులు. అతి రహస్యము, పవిత్రము, శుభప్రదము, మోక్షప్రదము అయినట్టి ఒక దివ్యోపదేశమును మీకిప్పుడు చేసెదను. దీనిని జపించి తరింపుడు. పూర్వముబ్రహ్మ తన పుత్రులైన సనక సనందాది మునులు విని నేర్చుకొనుటకు, శ్రీహరి నుద్దేశించి, ఈ విధముగ స్తుతించెను. దీనిపేరు యోగాదేశము. బ్రహ్మచేసిన స్తుతిని మీరు విని, నేర్చుకొనుడు:

"ఓ శ్రీహరీ! ఆత్మజ్ఞాన సంపన్నులకు నీ యొక్క ఉత్కర్షము (అతిశయ శోభ) ఆత్మానందదాయకము. అట్టి ఆనందమును మాకు ప్రసాదింపుము. నీవు పరిపూర్ణానంద స్వరూపుడవు. నీకు మా నమస్కృతులు.

సీ. పఙ్కజనాభాయ సఙ్కర్షణాయ శాన్తాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేన్ద్రియాత్మనే సూక్ష్మాయ వాసుదేవాయ పూర్ణాయ పుణ్యాయ నిర్వి
కారాయ కర్మనిస్తారకాయ క్షేత్ర పాలాయ త్రైలోక్య పాలకాయ
సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వయంజ్యోతిషే దురన్తాయ కర్మ

తే. సాధనాయ పురాపురుషాయ యజ్ఞ
రేతసే జీవతృప్తాయ పృథ్విరూప

కాయ లోకాయ నభసేన్తకాయ విశ్వ
యోనయే విష్ణవే జిష్ణవే నమోస్తు

ఓ దేవాదిదేవా! నీవు పద్మనాభుడవు, సంకర్షణుడవు, శాంతుడవు, విశ్వమునకు జ్ఞానదాతవు, సూక్ష్మభూతములకు (తన్మాత్రలకు)ను, సూక్ష్మేంద్రియములకును ఆశ్రయమైనట్టివాడవు, సూక్ష్మతముడవు, వాసుదేవ తత్త్వరూపుడవు, పరిపూర్ణుడవు, పుణ్యమూర్తివి, నిర్వికారుడవు (ఎట్టి మార్పులను చెందని వాడవు), కర్మబంధముల నుండి దాటింపగలవాడవు, వేదసంరక్షకుడవు, ముల్లోకములను పాలించువాడవు, మూడు వేదములను పోషించువాడవు, సోమరూపుడవు, తేజోబలసంపన్నుడవు, స్వయంప్రకాశుడవు, అంతములేనివాడవు, నియతకర్మలకు సాధనమైనవాడవు, పురాణ పురుషుడవు, యజ్ఞమునకు బీజరూపుడవు; జీవత్వప్నుడవు, పృథ్వీరూపుడవు, లోకస్వరూపుడవు, ఆకాశమున కతీతుడవు, విశ్వమునకు ఉత్పత్తిస్థానమువు, అంతటను వ్యాపించు విష్ణువు, జయశీలుడవైన జిష్ణుడవు, నీకు మా నమస్కృతులు.

సీ. స్వర్గాపవర్గసుద్వారాయ సర్వరసాత్మనే పరమహంసాయ దర్మ
పాలాయ సద్దిత ఫలరూపకాయ కృష్ణాయ ధర్మాత్మనే సర్వశక్తి
యుక్తాయ ఘనసాఙ్ఖ్య యోగీశ్వరాయ హిరణ్యవీర్యాయ రుద్రాయ శిష్ట
నాథాయ దుష్టవినాశాయ శూన్యప్రవృత్తాయ కర్మణే మృత్యవే వి

తే. రాట్ఛరీరాయ నిఖిలధర్మాయ వాగ్వి
భూతయే నివృత్తాయ సత్పుణ్యభూరి
వర్చసేఽఖిలధర్మదేవాయ చాత్మ
నేఽనిరుద్ధాయ నిభృతాత్మనేనమోస్తు

ఓ ప్రభూ! స్వర్గప్రాప్తికిని, మోక్షప్రాప్తికిని, నీవే ద్వారమువు (సాధనమువు), సర్వరస స్వరూపుడవు, పరమహంసవు (సూర్యుడవు), ధర్మపాలకుడవు, సజ్జనులకు సత్ఫలప్రదాతవు, శ్రీకృష్ణుడవు, ధర్మాత్ముడవు, సర్వశక్తులతో కూడియున్న వాడవు, గొప్ప సాంఖ్యయోగీశ్వరుడవు (కపిలుడవు), హిరణ్య

గర్భుడవు (బ్రహ్మవు), రుద్రుడవు, శిష్టజన రక్షకుడవు, దుష్టనాశకుడవు, శూన్యప్రవృత్తుడవు (నిరాసక్తుడవు) కర్మస్వరూపుడవు, మృత్యురూప లయకారకుడవు, విరాట్ స్వరూపుడవు, సకలధర్మ స్వరూపుడవు, వాగ్విభూతిగల వాడవు (దివ్యవాక్శక్తి గలవాడవు), కర్మనివృత్తుడవు, పుణ్యశ్రేష్ఠుడవు, తేజోమయుడవు, సర్వధర్మస్వరూపుడవు, ఆత్మస్వరూపుడవు, అనిరుద్ధ తత్త్వరూపుడవు, వృద్ధిక్షయములు లేనివాడవు, నీకు నమస్కృతులు.

తే. సర్వసత్త్వాయ దేవాయ సన్నియామ
కాయ బహిరన్తరాత్మనే కారణాత్మ
నే సమస్తార్థలిఙ్గాయ నిర్గుణాయ
వేధసే జితాత్మకసాధవే నమోఽస్తు

ఓ దేవదేవా! నీవు అంతటను వ్యాపించియున్న శుద్ధసత్త్వస్వరూపుడవు, "సత్"ను నియమించువాడవు, బహిరంత రాళములలో నంతటను నిండియున్న వాడవు, సర్వసృష్టికి కారణభూతుడవు, సమస్త కామితములకు నిలయమైన వాడవు; నిర్గుణుడవు, సృష్టికర్తవు, సాధుసత్తములకు వశమగువాడవు; నీకు నమస్కృతులు.

ప్రభూ! నీవు ప్రద్యుమ్న తత్త్వరూపుడవు, అంతరాత్మవు, సమస్తమునకు అంతిమ కారణుడవు, యజ్ఞస్వరూపుడవు, సర్వజ్ఞుడవు, సర్వమునంతము చేయువాడవు, జ్ఞానప్రియా రూపుడవు, అంతఃకరణ నివాసివి, నీకు నమస్కారములు.

దేవా! పవిత్రాత్మా! భక్తజన ప్రియతమమును, నీలమేఘ సుందరమును అనుపమము (సాటిలేనట్టి), నిత్యమంగళదాయకమును, అయినట్టి నీ యొక్క పాదపద్మముల దర్శనమును మాకు కలుగజేయుము.

స్వామీ! ఆత్మశుద్ధిని కోరువారికి నీ దివ్యమంగళ రూపమే ధ్యేయవస్తువుకదా! స్వర్గరాజ్యాధిపతియైన దేవేంద్రునికి కూడ, నీవే స్మరణీయుడవును పూజనీయుడవును కదా! భక్తియుతులైన భక్తజనులకు సులభుడవైన నీవు, దుష్టాత్ములకు మిక్కిలి దుర్లభుడవు. ఆత్మదర్శనులకు నీవే అత్యంత

గమ్యస్థానమై వెలసియుందువు కదా! పుణ్యాచరితా! ఇట్టి ఆరాధనా దుర్లభుడవైన ఓ ప్రభూ! నిన్నెఱుంగుటకు సజ్జనులకైనను సుగమము కాదు కదా, మఱి, నిన్ను పూజించుచుండు భక్తుడెన్నడైనను విడువగలడా సచ్చరిత్రా! ఓ గోవిందా! నీ పాదపద్మములను నిరంతరము భక్తితో సేవించు సజ్జనుడెన్నడును, ఆ సర్వలోక భయంకరుడైన కాలుని పాలపడడు కదా! అటువంటి నీ దివ్యపాదార విందముల నాశ్రయించునట్టి ధన్యుడైన పుణ్యాత్ముడు ఎన్నడైనను పొరపాటున నైనను ఇతర విషయములను మనస్సులో చేరనిచ్చునా ముకుందా! ఓ శ్రీహరీ! నీ యొక్క భక్తులతో ఒక్క అరనిముషమైనను చేయబడిన సత్సాంగత్యముతో మోక్షమైనను సరితూగదు కదా! ఇక క్షుద్రమైన ఈ ప్రాపంచిక సుఖము లేపాటివి? దేవా!భూతదయా సమేతులు, రాగద్వేషాది వికార రహితులు, ఆర్జవము మొదలగు సద్గుణ భూషణులు అయినట్టి భాగవతోత్తముల సాంగత్య లాభమును మాకు కలుగజేయుము. ఇదియే మా ప్రార్థన. ఏలనన, ఓ పద్మనాభా! సత్పురుష సంగముచే భక్తియందు స్థిరపడి, శుద్ధమైన చిత్తము, ఇక బాహ్యావిషయములపైకి వెళ్లదు, తమోగుణము నొందదు; నీ యొక్కమహనీయ తత్త్వమునందే నిలచియుండును.

ఈ విశ్వమును పెక్కుమాఱులు సృష్టి స్థితి లయముల నొందించుచు నుండు నీవే ఆత్మతత్త్వమని యెఱుంగుదుము. యోగపరాయణులగువారు శ్రద్ధాసమన్వితులై క్రియాకలాపముల యందు అంతఃకరణ స్థితుడవైయున్న నిన్నారాధింతురు. వారు వేదాగమతత్త్వజ్ఞానులు, నీవాద్యుడవు, అనాదివి, అద్వితీయుడవు, మాయాశక్తియుక్తుడవు.

దేవదేవా! ఫలమును కోరి, దేవతలను, పితరులను, ఆశ్రయించువారికి నీవు ఆయా దేవతల, పితరుల రూపములలోనే వారి కామ్యముల ననుగ్రహించెదవు. ఏ కోరికలు లేక ఆరాధనా భావముతో కర్మచేయువారిని కూడ అనుగ్రహించెదవు. నీకు నమస్కారములు. నీవు జ్ఞాన స్వరూపుడవు, జ్ఞానదాతవు, జగద్గురువు. నిన్ను ఏకాంత భక్తితో నారాధించువారునీ పాదపద్మములను తప్ప స్వర్గమునుగాని కైవల్యమునుగాని కోరరు. ప్రభూ! శీలము, సరళవర్తనము, సత్త్వగుణము, భూతదయ, కలిగియున్న నీ యొక్క

భక్తుల సహవాసమును, విషయభోగముల యందు విరక్తిని, నీ పాదపద్మముల యందనురక్తిని, పరమభక్తులు నిత్యమూ పూజించు నీ దివ్యదర్శనమును మాకు ప్రసాదింపుము". అని సనక సనందాదులతో గూడి బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువును స్తుతించెను.

ప్రచేతసులారా! మీరును, ఈ స్తోత్రమును పలుమార్లు వల్లించుచు శ్రీహరిని ధ్యానింపుడు. మీ యభీష్టము నెఱవేరును. మీకు సకల శుభములు కలుగును. పరమపురుషుని స్తుతించు ఈ స్తోత్రమును ప్రాతఃకాలమందు శ్రద్ధతో పఠించినవారు పరమేశ్వరానుగ్రహమునకు పాత్రులగుదురు - అని, రుద్రుడు ప్రచేతసులకు చెప్పి అంతర్ధానమయ్యెను.

**రుద్రగీత సమాప్తం**

**హరిః ఓం తత్ సత్**

❖ ❖ ❖

# 5. గోపికల శ్రీకృష్ణప్రేమ

(శ్రీకృష్ణావతార కార్యములో తన సేవార్థము శ్రీమహావిష్ణువు దేవతా స్త్రీ పురుషులను గోకులములో యాదవులై జన్మించ వలసినదిగా ఆదేశించెను. రామావతారములో శ్రీరాముని దివ్యసుందర విగ్రహము నాలింగనము చేసుకొనగోరిన మునుల కాంక్షను శ్రీకృష్ణావతారములో తీర్చెదనని మాట యిచ్చెను. ఆ ప్రకారమే భక్తాభీష్ట వరప్రదాతయైన భగవంతుడా మునుల యొక్కయు, దేవతల యొక్కయు, భగవత్ సాంగత్య కాంక్షను శ్రీకృష్ణావతార లీలల ద్వారా తీర్చసంకల్పించెను. వారికి తమ జన్మసాఫల్యతను అనుగ్రహించెను. నవవిధ భక్తి సాధనలలోని మధుర భక్తికి పరాకాష్ఠయే ఈ గోపికల కృష్ణభక్తి. వారికి శ్రీకృష్ణుడే సర్వస్వము. శ్రీకృష్ణుడులేని జీవనము వారికి నిస్సారము, నిరర్థకమని వారి దృఢవిశ్వాసము. అట్టి అనన్య భక్తియొక్క ప్రకాశమే గోపికల కృష్ణప్రేమ. దానిని అతి అద్భుతముగ రాసలీలలో చిత్రింపబడినది.

భగవంతుడు మూర్తీభవించిన సత్‌చిత్ ఆనందస్వరూపుడు. జీవరాసులకు, వాటియొక్క కర్మ, యోగ్యతలను బట్టి, ఆ ఆనందసాగరము నుండి కొన్ని ఆనందామృత బిందువులను జీవులపై చిలకరించును. అలాంటి ఒకానొక సన్నివేశమే శ్రీకృష్ణావతారములోని రాసలీల.)

అది, శరదృతువులో నొక పున్నమిరాత్రి. శ్రీకృష్ణుడు బృందావనిలో యమునా తీరములో, ముల్లోకములను సమ్మోహింపజేయు, నొక మోహన గీతను మురళిపైనాలాపించెను. ఆ మధుర స్వరమునకు పరవశలైన గొల్లపడుచులు సర్వమూ మఱచిపోయి, తత్తరపాటు చెందిరి. ఏ పనులను చేయుటకు వారికి తోచలేదు. చేస్తున్న పనులను ఎక్కడివక్కడనే విడిచి పెట్టిరి. కొందరు ఆవులకు దూడలను విడువ మరచిరి; విడిచినవారు పాలు పిదుకుట మరచిరి, పిదికినవారు పాలు కాచుట మఱచిరి, పాలు కాచినవారు దించుట మఱచిరి, దింపినవారు పిల్లలకు పెట్టుట మఱచిరి, కొందరు భర్తకు సేవ చెయ్యరు, కొందరు అన్నము వండరు, కొందరు ఆరగించరు, కొందరు

అలంకరించుకొనరు, కొందరు కోకలను సవ్యముగ కట్టుకొనరు. అందరూ ఎవ్వరిమట్టుకువారు ఇళ్లు విడిచి, వేణునాదము వినవచ్చుచోటికి మంత్రముగ్ధలవలె నడచి పోవుచుండగా, ఇంటనున్న పురుషులు వారించి అడ్డుపడినా, ఆ స్త్రీలు, లక్ష్యపెట్టకుండా ముందుకు సాగిపోయిరి. అట్లు త్రోసుకొనిపోలేని ఒకరిద్దరు భామలు, తమ ఇంటనే భర్తలచే బంధింపబడినవారై తమ హృదయములలోనే శ్రీకృష్ణ సాయుజ్యమును పొంది ప్రాణములను విడిచిరి. అంతటి తీవ్రతరమైనట్టిది వారి కృష్ణప్రేమ.

మంత్రముగ్ధలవలె నడచి వచ్చిన పడుచులను మృదువుగా మందలించుచు (ఏడు సంవత్సరముల ప్రాయపు) బాలకృష్ణుడిట్లనెను : "ఓ మానవతులారా! మీరు ఈ చీకటివేళలో, క్రూరమృగములు సంచరించు ఈ అడవిలోనికి ఈ విధముగ రావచ్చునా? మీ జాడ తెలియక మీ వారంతా తల్లడిల్లిపోవరా? ఇట్లు సాహసించి వచ్చుట మీకు తగునా? మీ కుటుంబ గౌరవమునకు చేటు కాదా? మిమ్ములను జారిణులని ఎవ్వరైన అన్నచో అవమానము కాదా? మీరంతా ఇళ్లకు మరలిపోయి, మీ మీ పనులను చూచుకొనుడు. నన్ను చూచుచుండుట, నా మాటలు వినుచుండుట, నా పాటలు పాడుకొనుచుండుట, నన్ను స్మరించుచుండుట, చేయుచుండిన చాలును. మీరు ధన్యులయ్యెదరు. ఇక మీరు మీ గృహములకు మరలిపొండు" అని చెప్పిన బాలకృష్ణునితో నా కాంతలిట్లు మొఱవెట్టుకొనిరి: "కృష్ణా! సర్వమూ విడిచిపెట్టి, నీ పాదములచెంత జేరిన మాతో నీవిధముగ మాట్లాడుట నీకు తగునా? కరుణామూర్తివైన నీవు, నిర్దయుడవై మమ్ముల నీవిధముగ తిరస్కరించెదవని మేము కలలోనైనను ఊహింపలేము. కృష్ణా! పతులు, బిడ్డలు, బంధువులు, ఇతరులు, దుఃఖమును తెచ్చిపెట్టు బంధములే కదా! నీవే తల్లివి, తండ్రివి, భర్తవు, బంధువువు, సఖుడవు, గురుడవు, పుత్రుడవు, దైవమువు, సర్వము నీవే యని ధర్మశాస్త్రజ్ఞులు చెప్పెదరు కదా! మరి మేము నీలోనే సకల బాంధవ్యములను కల్పించుకొనుట తగదా స్వామీ! మాకు గృహస్థధర్మములు, నీతి నియమములు తెలియవని బోధించుచుంటివా? మాకు అన్నియును తెలియునులే! ఆనందసాగరుడవైన నీ చెంతకు చేరిన మమ్ముల్ని, మళ్లీ ఆ

సంసార దుఃఖసాగరములో పడియుండ మనెదవా? సర్వమూ త్యజించి, నీ పాదపద్మములనే ఆశ్రయించిన యోగీశ్వరులను స్వీకరించి, అనుగ్రహించెదవు కదా! మఱి మమ్మల్ని ఈ విధముగ నేల తిరస్కరించుచుంటివి? సంసార బంధములు దుఃఖమునే తెచ్చిపెట్టునుగాని, నీతోడి అనుబంధము మాత్రము శాశ్వతమైన బ్రహ్మానందము నిచ్చునట్టిదని గ్రహించి, మేము సర్వమును విడిచిపెట్టి నీ పాదముల చెంత చేరితిమి. మా మనోబుద్ధులు నీకే అంకితమైనవి. అన్యుల నాశ్రయింపవు. మా కాళ్లు మరలిపోవు. మా చేతులు ఇంకేపనిని చేయలేవు; మా చెవులింకెవ్వరి పలుకులను వినలేవు. మా కన్నులు నీ మోహన రూపమును తప్ప ఇంక దేనిని చూడలేవు. నీ పాటలు, మాటలు తప్ప మా నాలుకలు ఇంక నితర శబ్దముల నుచ్చరింపలేవు. మనోవాక్కర్మలచే నీలోనే ఐక్యమైపోయిన మమ్మల్ని ఈ విధముగ తిరస్కరించి పొమ్మనుట నీకు న్యాయమేనా స్వామీ? మేము వెనుకకు పోలేము. నీ పాదముల చెంతనే దాసీలుగా పడియుందుము. విరహాగ్ని వేదనలో దహించుకొని పోవుచున్న మాతాపమును, నీ యొక్క మృదుమధుర సంభాషణ స్పర్శలచే చల్లార్పనిచో, ఇక్కడనే భస్మమై పడియుండెదము. కృష్ణా! నిన్నుచూచినా, నీ వేణుగానమును వినినా, గోవులు, మృగములు, పక్షులు, వృక్షములు కూడ పరవశించి పులకించిపోతాయి కదా, మరి మేము ద్రవింపకుండా ఉండగలమా స్వామీ! శ్రీహరి దేవతలను కాపాడుచుండు నటుల, నీవు కరుణతో నీ అభయహస్తమును మా శిరస్సులపై నుంచకున్నచో మేము మూర్ఛపోవుదుము సుమా!" అని ఈ విధముగ దీనాలాపములను చేసిన ఆ గోపవనితల విన్నపములను విని, ఆత్మారాముడైన స్వామి వారి ఆత్మలను రమింపజేయ సంకల్పించెను. వందల సంఖ్యలో నున్న ఆకాంతలు తన స్పర్శకు, ఆలింగమునకు తహతహ లాడుచుండుటను గుర్తించెను. అందరిని అనుగ్రహించు నుద్దేశముతో, ఏ ఒక్కరికిని చిక్కకుండ, తాము కాంక్షించు చుండు అనుభూతులను ప్రతి ఒక్కరికి కలుగజేసి, బ్రహ్మానందమును అందించెను. ప్రతిపడుచు కృష్ణుడు తన వాడేనని, తానే అందరికంటె ధన్యురాలనని మురిసిపోవుచు మైమరచియున్న సమయమున మాయావి అయిన స్వామి అదృశ్యమయ్యెను.

తమచెంతనే యుండిన కృష్ణుని గానక కాంతలందరు వశము తప్పినవారై పోయిరి. నందనందనుని మాటలు, పాటలు, చేష్టలు, చూపులు, వినోదక్రీడలు తలచుకొనుచు, ముచ్చటించుకొనుచు, వారందరు పిచ్చివారివలె ఆ వెన్నెల రాత్రిలో బృందావనమంతటా వెదకసాగిరి. కనిపించిన ప్రతిచెట్టును అడిగిరి తమ హృదయాధి నాథుడెక్కడున్నాడని. "ఓ అశ్వత్థ వృక్షమా! మా మనస్సులను దోచుకొనిపోయిన మాధవుని నీవు చూచితివా? ఓ అశోకవృక్షమా! నీవైనా చూచితివా ఆ మాయావిని? ఓ తులసీ! గోవిందునకు ఇష్టమైనదానవుకదా, నీకు కూడ ఆతని జాడతెలియదా? ఓ భూదేవీ! స్వామి పాదస్పర్శతో పునీతమైన నీకు కూడ అతడెక్కడనున్నాడో తెలియదా!

ఉ. నల్లనివాఁడు పద్మ నయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చెనో
మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ! చెప్పరే

నల్లనివాడు, పద్మములవంటి అందమైన కన్నులు గలవాడు, కృపారసము నందరిపైన వెదజల్లువాడు, శిరస్సున చుట్టబడిన కురులకు నెమలి కన్నును తురిమినవాడు, ఎల్లప్పుడును చిరునవ్వు చిందించు ముఖము గలవాడొకడు చెలియల అభిమాన ధనమును దోచుకొని, యిటువచ్చెను. ఓ మల్లియలారా! అతడు వచ్చి మీ పొదలమాటున దాగియున్నాడేమో, మీరైనను, చూచి చెప్పండమ్మా!

ఆ మానసచోరుడు మన్మథుని సహితము మోహింపజేయగల సుందర రూపుడు. మధురమైన వేణునాదము చేయువాడు. మమ్ములను మన్మథపుష్ప బాణముల కాహుతిచేసిన నిర్దయుడు, ఓలవంగ, మాదీఫల, నారంగ వృక్షములారా! మీ వద్ద నతడు లేడు కదా! ఉన్నచో మీరైనను జూపరే! ఈ విధముగ నా యువతులు ఆ వనములోని చెట్లను, లతలను, పుష్పములను, పక్షులను, లేళ్లను అడిగినారు.

వియోగబాధను భరించలేని ఆ వనితలు శ్రీకృష్ణుని అనుకరించుచు, బాలకృష్ణుని లీలలన్నిటిని అభినయించారు. ఒకామె పూతనవలె నటించగా

ఇంకొకామె కృష్ణునివలె చన్ను కుడిచెను. ఒకామె తృణావర్తుడై ఇంకొకామెను నీవు బాలకృష్ణుడవు అని ఎగురవేసుకొని పోయెను. ఒకామె నేను యశోదను అనగా ఇంకొకామె నా నోటిలో విశ్వమున్నది చూడుమని నోరు తెరచెను. ఇంకొకామె నేను కాళీయుని నెత్తిపై నృత్యము చేస్తానన్నది. ఇదిగో నేను గోవర్ధనగిరి నెత్తుచున్నానని చీరచెంగు గొడుగువలె నెత్తి పట్టుకొనె నింకొకామె. ఈ విధముగ వారు, తమ హావభావములను ప్రదర్శించుకొంటూ, గోవిందుని వెదుకుకొంటూ బృందావనమంతా గాలించారు. వెదకి వెదకి శ్రీకృష్ణుని ఎందునూ కానక నిరాశజెంది, ఇసుక తిన్నెలపై చతికిలబడినారు.

తమచిత్తచోరుని ఎక్కడను కానలేక విరహబాధతో గోపికలు ఈ విధముగ విలపించిరి : "స్వామీ! నీవు మా పల్లెకు వచ్చిన పిమ్మట, నిన్ను విడిచి ఉండలేని మహాలక్ష్మి కూడ ఇక్కడనే స్థిరనివాసము చేసుకొన్నదేమో అనిపించుచున్నది. నీవీవిధముగ మాయమైపోయినచో నిక మా గతి ఏమి కాను? నీపైననే మా ప్రాణములన్నీ నిలిచియున్నవి కదా! లక్ష్మి కూడ నిన్ను వెదుకుకొంటూ ఇక్కడినుండి వెళ్లిపోవును కదా! ఓ సుందరాకారుడా! నిన్ను వలచి, మేమంతా నీకు, జీతములేని దాసీలమై పోయితిమికదా! ప్రభూ! మమ్మల్నీ విధముగా వేధించడం నీకు తగునా? కాళియుని విషమునుండి, అఘాసురుని నోటినుండి, ఇంద్రుని రాళ్లవర్షమునుండి, కారుచిచ్చునుండి, ఇంకా ఎన్నో ఆపదల నుండి మమ్మల్ని రక్షించి, ఇప్పుడీ క్రూరుడైన మన్మథుని బాణములకు బలిచేయడం నీకేమైనా న్యాయముగ నున్నదా స్వామీ! నీయొక్క చరణదాసుల సంసార భయమును బాపునట్టిది, లక్ష్మీదేవికి ప్రియమైనట్టిదీ అయిన నీ అభయహస్తమును మా తలలపై నుంచి, మమ్ములను అనుగ్రహింపవా?

ఉ. నీవు యశోద బిడ్డఁడవె నీరజ నేత్ర సమస్త జంతు చే
తో విదితాత్మ వీశుఁడవు తొల్లి విరించి తలంచి లోక ర
క్షావిధమాచరింపు మని సన్నుతి సేయఁగ సత్కులంబునన్
భూవలయంబుఁ గావ నిటు పుట్టితి గాదె మనోహరాకృతిన్

ఓ నీరజాక్షా! నీవు నిజముగ యశోదాదేవి బిడ్డడివేనా? కాదు, మాకు తెలుసు. నీవు సమస్త జీవరాసులకు చేతో విదితాత్ముడవు. (చేతసము ద్వారానే

తెలుసుకొనబడువాడవు), పరమేశుడవు. పూర్వము బ్రహ్మ నిన్ను స్తుతించి, లోకరక్షణ చేయుమని ప్రార్థింపగా, భూమండలమును కాపాడుట కిక్కడ, సద్వంశమందు ఈ మనోహర రూపమున పుట్టితివికదా!

శ్లో॥ తవకథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహం ।
శ్రవణమంగళం శ్రీమదదాతతం భువిగృణంతియే భూరిదా జనాః ॥

ప్రభూ! నీ కథామృతము సంసార తాపత్రయ తప్తజీవుల తాపమును హరించివేయు సంజీవని వంటిది. పాపకల్మషమును కడిగివేయునట్టిది. శ్రవణమాత్రమున శుభములను కలుగజేయునట్టిది, నీ స్మరణభాగ్యమును నిత్యము కలిగించునట్టిది. నీ కథామృతమును జనులకు పంచిపెట్టువారు పరమదాతలు. స్వామీ! నీవు గోవులను తోలుకొని గులకరాళ్లపైనను సూదులవంటి గడ్డిక దుబ్బులపైనను నడుచుచున్నప్పుడు సుకుమారసున్నితమైన నీ పాదారవిందములెంతగా కందిపోవునో, ఎంత నొప్పిపెట్టునో కదా! వాటిని మా మెత్తని వక్షములకు హత్తుకొని, సేవచేయుదమనుకుంటే పగలంతా నీవు పశువులతో తిరిగెదవు. రాత్రులందు మాకు వీలుపడదు కదా! హృదయేశ్వరా! మా హృదయముల నింత మృదువుగాను, మెత్తగాను తయారుచేసి, నీ హృదయమును ఇంత కఠినముగ నుంచిన మా యొక్క మందభాగ్యమునకే మేము వాపోవాలి" అని, తమ ఆవేదనను వెలిబుచ్చుకొనుచు, ఆ గోపకాంతలు గోపాలకృష్ణుని స్తుతించుచు, పాటలు పాడుచు, విలపించుచు, అలుగుచు, చేసిన విన్నపములను వినిన స్వామి, త్రిజగన్మోహనుడై, మన్మథ మన్మథుడై, దివ్యసుందర విగ్రహుడై ప్రత్యక్షమయ్యెను. గోపికలందరికి పోయిన ప్రాణములు తిరిగివచ్చినవి. తమ మనోహరుని చుట్టుముట్టిరి. రెప్పలార్పకుండ కన్నులు పండువుగ తమ ప్రాణనాథుని చూచుకున్నారు.

ఒక ముద్దరాలు, కృష్ణుడు తనవాడే అన్నట్లు అతని రెండుచేతులను తీసుకొని తన బుగ్గలకు అన్చుకున్నది. ఇంకొకామె ఎఱ్ఱ కలువలవంటి స్వామి పాదములను తన ఎదకు హత్తుకున్నది. ఇంకొక సుందరి స్వామి భుజములు తనవే అన్నట్లు వాలిపోయినది. ఈ విధముగా ఆ మోహనాంగులందరు స్వామిని ఏదో ఒక విధముగ స్పృశించి, ముద్దాడి, తన్మయులై మురిసిపోవాలని

ముందుకు తోసుకుంటూ వచ్చిరి. కొందరు అతనిపై అలకను ప్రదర్శించుచు, దూరముగ నిల్చొని కొంటెచూపులు చూచుచుండిరి. కొందరు "నీవింత నిర్దయుడవని కలలో కూడ ఊహించలేదు" అని నిష్ఠురోక్తులాడిరి. కొందరు శ్రీకాంతుని దివ్యసుందరమూర్తిని చక్షుద్వారముల గుండా హృదయములోనికి ప్రవేశపెట్టి, మళ్లీపారిపోవునేమో యన్నట్లు కన్నులు మూసుకొని ఆత్మానందము ననుభవించిరి. స్వామి అందరితోను తగురీతిని అనునయించుచు, ఆనందింప జేయుచుండెను. వారి విరహతాపము శమించెను. భగవంతుని దర్శించిన భాగవతోత్తములవలె, వారంతా బ్రహ్మానందభరితలైరి. ఇకవారు జీవితములో కోరదగిన దేమియును లేదు.

శ్రీకృష్ణుని గురించి ఆ యిసుక తిన్నెపైన ఆ మగువలు తమ ఉత్తరీయములను పరచి ఒక మెత్తని ఆసనమును చేసి అతనిని కూర్చుండబెట్టి, చంద్రుని చుట్టు చేరిన తారకలవలె తాము చుట్టుముట్టిరి. "నీకు మామీద ప్రేమలేద"న్నారు. "అన్నీ దోచుకుని తిరిగి ఏమీ యివ్వని స్వార్థపరుడవు నీవు" అన్నారు. ప్రణయకలహములవంటి సూటిపోటి మాటలననిరి. అన్నీ విని, స్వామి చిరునవ్వుతో నిట్లనెను : "నేను మీ అందరి హృదయములలో నివసించు ఆత్మబంధువును. మీ యొక్క ఆర్తి, అనురాగము, సన్నగిల్లకుండ నుండుటకును, మీరెల్లప్పుడును నన్నే స్మరింపుచుండుటకును, అప్పుడప్పుడు మీ మధ్య నుండి నా రూపము కనుమఱుగగుచుండును. అంతేకాని, నాకు మీయందు ప్రేమలేక కాదు" అని మాధవుడు చెప్పగా ఆ మగువలందరు మహదానందము పొందిరి.

గోపికలకు శ్రీకృష్ణునియందుగల అద్వితీయ, అచంచల, అనిర్వచనీయమైన మధురభక్తిని గురించి, భగవానుడు వారిచేచేయించిన రాసక్రీడ రమణీయతను గురించి, భక్తిశ్రద్ధలతో చదివిన వారికి, వినినవారికి భక్తి ఇనుమడించి, దుఃఖము శమించి, పాపము నశించును అని శుకయోగి పరీక్షిత్తుకు చెప్పెను.

గోపికల శ్రీకృష్ణప్రేమ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

## 6. అక్రూరస్తుతి

దేవకి వసుదేవపుత్రులు గోకులమునందు నందుని యింట పెరుగుచుండిరని నారదుని వలన తెలుసుకొని కంసుడు వారినెట్లైనను మధురకు రప్పించి, ధనుర్యాగము నేర్పాటుచేసి, అచ్చట వారిని చంపించుటకు వ్యూహము పన్నెను.నందాదులను, బలరామకృష్ణులను ఆహ్వానించుటకు మధురలోనున్న ఒక యాదవ సజ్జనుడైన అక్రూరుని గోకులము పంపించెను. అక్రూరుడొక మంచి కృష్ణభక్తుడు. అతడు నందాదులను కలుసుకొని, బలరామకృష్ణులను మధురకు తోడ్కొని పోవుటకు వారి అనుమతిని పొంది, ఆ మరునాడు, ఆ బాలురను రథములో కూర్చుండబెట్టుకొని బయలుదేరెను. దారిలో రథము నాపి, బాలుర నక్కడనే ఉండుడని చెప్పి యమునానదిలో స్నానము చేయుటకు వెడలెను. అతడు స్నానము చేయుచుండగా బలరామకృష్ణులు నదిమధ్యనుకనిపించిరి. రథములో నున్న బాలురు నదిమధ్య కెట్లువచ్చిరని ఆశ్చర్యముతో నాతడా రథమువైపు చూడగా అన్నదమ్ములిద్దరు అక్కడనే కూర్చొని నవ్వుకొనుచుండిరి. తికమకచెందిన అక్రూరుడు కన్నులు నులుముకొని నీటిలో మునగగా -

ఆ నదిమధ్యను కనిపించెను. ఫణిరాజైన ఆదిశేషువు. వేయిపడగలతోను, రాజవేషములోను, రత్నమణి భూషణములతో మెఱిసిపోవుచుండెను. శేషశయనముపైన, పీతాంబరధారియై, శాంతాకారుడై, చతుర్భుజుడై, సర్వాలంకార శోభితుడై దర్శనమిచ్చెను నీలమేఘశ్యాముడు. బ్రహ్మరుద్రాది దేవతలు, సనకాది మునులు, నంద సునందాది పార్షదులు, ప్రహ్లాదనారదాది భాగవతోత్తములు, చుట్టూచేరి, దివ్యస్తోత్రములు చేయుచుండిరి. ద్వాదశ శక్తులతో కూడి, శ్రీదేవి సేవ చేయుచుండెను. ఇట్టి అపూర్వమైన అద్భుత దివ్యదర్శనమును గాంచెను మహాభాగ్యశాలియైన అక్రూరుడు. ఒక్కక్షణము పాటు నోటమాట రాక, భక్తిసంభ్రమములతో నిట్లు స్తుతించెను:

"శ్రీమానినీ మానసచోరా! శుభాకారా! ప్రళయ జలధిలో క్రీడించే శ్రీమన్నారాయణా! వటపత్రశయనా! చతుర్ముఖ బ్రహ్మోద్భవ పద్మనాభా! నీ మహిమను తెలుసుకొనుటకు గాని, వర్ణించుటకు గాని, ఆ బ్రహ్మకు కూడను

సాధ్యపడదుకదా! నీవు అంతర్యామివి, సర్వసాక్షివి, ఈశ్వరుడవు. నిన్ను జ్ఞానులు, భక్తులు, యోగులు పలువిధముల కొలిచెదరు. వేర్వేరు మార్గములలో ప్రవహించే నదులన్నీ సముద్రమునే ప్రవేశించునట్లు, అన్నిమార్గముల యొక్క గమ్యము నీవే కదా! నీవు అన్నింటను, అంతటను నిండియుందువు. నీకు అందరును సమానులే. మత్స్యరూపమున వేదములను సంరక్షించితివి, హయగ్రీవుడవై మధుకైటభులను హతమార్చితివి. కూర్మరూపుడవై మందరగిరి నెత్తితివి, వరాహుడవై భూమండలము నుద్ధరించి హిరణ్యాక్షుని అంతము చేసితివి. నరసింహుడవై భక్తశిరోమణియైన ప్రహ్లాదుని రక్షించి, హిరణ్యకశిపుని శిక్షించితివి; వామనుడవై బలిచక్రవర్తి గర్వమణచి, అనుగ్రహించితివి. భార్గవ రాముడవై దుష్టక్షత్రియులను దునుమాడితివి. దశరథరాముడవై దశకంఠ రావణుని హతమార్చితివి. వాసుదేవుడవై వసుంధరయొక్క భారమును బాపనుంటివి; కల్కిరూపుడవై లోకకల్యాణము చేయనుంటివి. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న అనిరుద్ధుల రూపుడవై సృష్టి, స్థితి, సంహార, శాస్త్ర ధర్మరక్షణ నిర్వహణ కార్యములను జరిపెదవు. నీకు నా ప్రణామములు. కృష్ణా! పరమేశ్వరా! నిన్ను తెలుసుకొనలేని అజ్ఞుడనైన నేను, నిన్ను స్తుతింపగల నా స్వామీ! నీ మాయలోనే మునిగి ప్రవర్తించువాడను. సంసారదుఃఖములో మునిగియున్న వాడను. నన్ను కరుణించి అనుగ్రహింపుము శ్రీహరీ! నీకు సాష్టాంగ దండప్రణామములు" అని స్తుతించిన అక్రూరుని దృష్టినుండి స్వామి తన దివ్యదర్శనము నుపసంహరించుకొనెను.

అక్రూరుడు నదినుండి రథమువద్దకు తిరిగివచ్చెను. అతనిని శ్రీకృష్ణుడిట్లడిగెను: "అక్రూరా! నీవు స్నానమునకు పోయి చాలా సేపయినది కదా, నదికూడ అంతదూరమేమియు కాదు, మరి అక్కడ నీటిలోగాని, భూమిపైనగాని, ఆకాశములోగాని ఏదైనా వింతవిషయము కానవచ్చినదా?" అని అడుగగా అక్రూరుడిట్లు చెప్పెను: "ఓ మహానుభావా! నీలోలేని వింతలు ఇంకెక్కడనైనను ఉండునా. ఇక నీటిలోగాని, నింగిలోగాని ఎట్లుండును?" అని ఆ దివ్య దర్శనమును మననము చేసుకొనుచు రథము నడిపెను.

అక్రూర స్తుతి సమాప్తము

**హరిః ఓం తత్ సత్**

# 7. కపిలబోధ

బ్రహ్మదేవుని ఛాయనుండి ఉద్భవించిన కర్దముడు (బ్రహ్మ ఆదేశము ప్రకారము) సంతానము కొఱకు తపస్సు చేయగా, శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయి, స్వాయంభువ మనువు పుత్రికయైన దేవహూతితో నతనికి వివాహం జరుగుననియు, ఆమె సంతానవతియగుననియు, తానే (విష్ణువే) ఆ పుణ్యదంపతులకు పుత్రుడై జన్మించు ననియు వరమిచ్చెను. అట్లే కర్దమ దేవహూతి దంపతులకు శ్రీహరి పుత్రుడై జన్మించి, మహాజ్ఞానియై సాంఖ్యయోగమును స్థాపించిన కపిల భగవానునిగ ప్రసిద్ధికెక్కెను. కర్దముడు భార్యాపుత్రుల అనుమతిని పొంది సన్న్యసించి అరణ్యములకు వెడలిపోయెను.

ఒకనాడు దేవహూతి కపిలునితో నిట్లనెను: "నాయనా! నీవు నా కుమారుడవే యైనను, మానవుల అజ్ఞానమును బాపుటకై యవతరించిన జ్ఞానభాస్కరుడవైన నారాయణుడవని నాకు తెలుసు. జీవితమంతా ఇంద్రియములను తృప్తిపరచుటకును, నేను, నాది అను భావములను పెంచుకొనుటకును, అజ్ఞానము చేత ప్రయాసపడు నావంటివారు బయటపడు మార్గమును నాకు జూపుమయ్యా" అని వేడుకొన్న తల్లితో కపిలుడిట్లు చెప్పెను:

"మాతా! సూక్ష్మముగ చెప్పవలెనన్న, బంధమును కలిగించుటకుగాని, మోక్షమును పొందుటకుగాని, మనస్సే మూలకారణము. అది, సత్త్వరజస్తమో గుణములతోచేరి, ఇంద్రియ విషయములయందు చరించిన, బంధమేర్పడును. ఆ మనస్సే మాధవుని యందు లగ్నమై సంగమేర్పరచుకొన్నచో మోక్షగామి యగును. "నేను, నాది" యను అహంకార మమకారరూపమైన అభిమానము వలన కామక్రోధాది దోషసమూహములు ఆవిర్భవించును. చిత్తము వానికి లోనుగాకుండ వానినుండి విడువడినప్పుడు పరిశుద్ధమగును. అప్పుడు సుఖము, దుఃఖము ఉండక, జ్ఞానవైరాగ్యము లుదయించును. శరీరము కంటె ఆత్మ భిన్నమైనదని తెలుసుకొనుట జ్ఞానము, ఇంద్రియ విషయాల ననుభవించాలను కోరిక లేకపోవుట వైరాగ్యము. జ్ఞానవైరాగ్యములు కలిగినచో భగవానునియందు భక్తి ఉదయించును. ఆత్మస్వరూపము గోచరించును.

పరమేశ్వరుడు ప్రకృతికి పరుడు, సూక్ష్మరూపుడు, స్వయంప్రకాశుడు, అపరిచ్ఛిన్నుడు, ఉదాసీనుడు. అట్టి పరమాత్మను భక్తి జ్ఞాన వైరాగ్యములతో కూడిన చిత్తముతో దర్శించిన యోగులు, ఆ సర్వాంతర్యామికి సర్వమూ సమర్పించి భక్తిమార్గమే మోక్షప్రాప్తికి ఉత్తమమైన మార్గమని భావించెదరు.

మనస్సు ఇంద్రియ విషయములతో సంగమేర్పరచుకున్నచో బంధకారక మగును. ఆ సంగమే సద్వస్తువు యందేర్పడినచో అంతఃకరణ సంయమము కలిగి తెరుచుకొన్న మోక్షకవాట మగును.

మాతా! భాగవతోత్తములు సహనశీలురై, శాంతులై, సర్వభూతహితులై, కరుణార్ద్ర హృదయులై, కర్మఫలములను త్యజించినవారై, స్వపర భేదభావము లేనివారై, పరమేశుడనైన నన్నాశ్రయించిన వారై, నా గుణగణములను స్మరించుచు, నా చరితములను చెప్పుకొనుచు, వీనులవిందుగ వినుచు, ఎల్లప్పుడు నానందించుచుందురు. వారిని (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక) తాపత్రయము లంటవు. అటువంటి సర్వసంగ పరిత్యాగులైన పరమభాగవతుల సాంగత్యమే కోరదగినది. అదియే సర్వదోషహారిణి. వారి సాంగత్యమువలన మోక్షప్రదమైన శ్రద్ధాభక్తులుదయించును. అజ్ఞానము నశించును.

తల్లీ! సహజము, నిర్హేతుకము, అయిన భగవద్భక్తి ముక్తికంటెను గొప్పది. అది, జీవులకర్మలను, లింగశరీరమును నశింపజేయును. కొందరు నా పాదసేవ చేయుటయందును, నా గుణగణముల గానము చేయుట యందును, నా దివ్యగాథలను వినుచు, చెప్పుకొనుచు, ఆనందించుచు, ముక్తిని కూడను వాంఛింపరు. కొందరు నా దివ్యమోహనాకారమునే మనస్సులో నింపుకొని, లౌకిక సుఖసంపదలను గాని, స్వర్గలోక బ్రహ్మలోక ప్రాప్తినిగాని, అణిమాది అష్టసిద్ధులనుగాని, ఇంకేమైననుగాని, కోరకుండ, నిత్యానందమున మునిగి యుందురు. అట్టివారు సంపూర్ణ వైభవోపేతము, మహోన్నతము అయిన వైకుంఠ ధామమును చేరుకొందురు, నా యొక్క కాలచక్రమునకు కూడను లోబడరు, ఏలనన, నేనే వారికి తల్లి, తండ్రి, గురువు, దైవము, సర్వస్వము, గనుక. నేను వారిని ఈ జనన మరణ సంసారచక్రమునుండి తప్పించి పైకి తీసుకొని పోయెదను. ప్రకృతి పురుషులకును నేనే అధీశ్వరుడను. నన్ను

శరణుజొచ్చిన వారు తప్ప ఇతరులు సంసార చక్రములో చిక్కుకొనెదరు. నా ఆజ్ఞచేతనే గాలివీచును, అగ్నిమండును, సూర్యుడు ప్రకాశించును, ఇంద్రుడు వర్షించును, మృత్యువు సంహరించును. అందువలన వైరాగ్యముతో కూడిన భక్తియోగముచేతనే, యోగులు నా చరణములను స్మరించుచు నిర్భయముగ నుందురు. భక్తియే మోక్షసాధన మార్గము.

యోగలక్షణములు వివరించెదను వినుము : శక్తికొలది స్వధర్మాచరణము చేయుట, శాస్త్రనిషిద్ధకర్మలను చేయకుండుట, దైవికముగ లభించు ద్రవ్యముతో సంతుష్టిజెందుట, మహాభాగవతుల పాదసేవ చేయుట, నీచకర్మలు చేయకుండుట శుచియైన మితాహారమును భుజించుట, ఎవ్వరిని హింసింపకుండుట, ఇతరులకు చెందినదానిని తీసుకొనకుండుట, న్యాయార్జిత ధనములో తనకెంత అవసరమో అంతే స్వీకరించుట, సత్యవర్తనము, బ్రహ్మచర్యము, తపస్సు, మౌనము, పాటించుట, సద్గ్రంథాధ్యయనము, సర్వేశ్వరార్చనము చేయుట ఇంద్రియ నిగ్రహము పాటించుట, మనస్సును విషయములనుండి ఉపసంహరించి, హృదయమందు నిలుపుట, ప్రాణాయామము, ధారణ, ధ్యానము చేయుట, శ్రీమన్నారాయణుని దివ్యలీలలను మననం చేసుకొనుట, శ్రీహరియే అంతటను నిండియున్నట్లు విశ్వసించుట, ఇవి యోగధర్మములు.

ఓ మాతా! మనుజులయొక్క ఫలాసక్తి, సంకల్పములలోని తారతమ్యముల ననుసరించి, వారిలో భక్తిభావము లుదయించును. అవి, తామసిక భక్తి, రాజసిక భక్తి, సాత్త్వికభక్తి అను మూడు విధములుగ వ్యక్తమగును.

ఇతరులకు హింస కలిగించుచు, దంభము, మత్సరము, రోషము, భేదబుద్ధి, మనస్సులో నుంచుకొని నన్ను కొలుచుట తామసిక భక్తి అనబడును. గొప్ప గొప్ప ఐశ్వర్యములను, కీర్తిని, వస్తువులను,, పదవులను, భూములను కోరుకొనుచు(ఆడంబర ఆర్భాటములతోను, అధిక వ్యయప్రయాసలతోను) నన్ను పూజించుట రాజసిక భక్తి అనబడును. పూర్వకర్మలను పరిహరింప జేయునది భగవద్భక్తి ఒక్కటే యను విశ్వాసముతో, సమస్త కర్మలను భగవదర్పిత భావముతో, లోకులకు మేలు కలిగించు కర్మలు చేయుచు,

భగవంతుని పూజార్చనాది సేవలను చేయుట సాత్త్విక భక్తి అనబడును. నా యొక్క దివ్య నామగుణ వైభవములు చెవులకు సోకినంతనే భక్తిపారవశ్యమును చెందువారు ఉత్తమభక్తులు. నిర్హేతుకముగ నిష్కామముగ నాగురించి చేయబడిన భక్తి ప్రక్రియలే శ్రేష్ఠమైనవి. నిష్కాములైన నా యొక్క భక్తులకు, సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యము, అనబడు ముక్తియే ధ్యేయము. అందుచేత మహాత్ములైన భక్తులు, తమ స్వకార్యములను వెనుకకు నెట్టి నా ఆరాధనలోనే మగ్నులై యుందురు. దీనిని ఆత్యంతిక భక్తియోగమందురు. త్రిగుణముల కతీతుడైన భక్తుడు నా వంటి రూపమునే పొందును.

నా భక్తుడు, సంధ్యాది నిత్యకర్మల యందును లోకకల్యాణార్థము చేయబడు యజ్ఞయాగాది నైమిత్తిక కర్మల యందును అత్యంత శ్రద్ధాసక్తులను కలిగియుండాలి. పాంచరాత్రములలో చెప్పబడినట్లు నిష్కామబుద్ధితో నన్నారాధించాలి. నా రూపము దర్శించుట, స్మరించుట, నా చరిత్ర వినుట, కర్మలలో చిక్కుకొనకుండుట, తనకంటె గొప్పవారిపై నాదరగౌరవములను, తక్కువవారిపైన దయాదాక్షిణ్యములను, సమానులపైన స్నేహానురాగములను కలిగియుండుట, యమనియమములను పాటించుట వంటి సుగుణముల నలవరచుకోవలెను. యోగాభ్యాసము చేయవలెను. శ్రీహరియొక్క దివ్యగుణ కీర్తనలు చేయుచు, భక్తులను నిజాయితీతోను, అనురక్తితోను సేవించు చుండవలెను. అహంకారములేనివాడై నిశ్చలుడై యుండవలెను. ఈ సుగుణములు గలవాడు నన్ను చేరగలడు.

తల్లీ! సర్వజీవుల హృదయకమలముల యందుండు నన్ను అలక్ష్యముచేసి, నా విగ్రహమునే పట్టుకుని ఆడంబరముగ పూజించువాడు మూఢుడు. యథార్థ భక్తితో నన్నారాధింపనివాని పూజలు నిరర్థకములు. సర్వభూతాంత రాత్ముడనైన నా యందును, జీవరాసుల యందును, మాయామోహితులై భేదదృష్టిని పెట్టుకొని, నన్ను పూజించి, ఇతర జీవులను ద్వేషించువారికి మనశ్శాంతి లభింపదు. అటువంటి కుటిలాత్ములు అధికద్రవ్యము వెచ్చించి, ఆడంబరముగ నా పాదపూజలు చేసినను నేను సంతోషించను.

మానవులలో స్వధర్మాచరణలో నిపుణులుత్తములు. వారికంటెను సద్ధర్మపరులు, వారికంటెను, సర్వధర్మములను సర్వస్వభావ విశేషములను, విడిచి, సర్వమును నాకే సమర్పించి, అనన్యభావముతో సర్వత్రా సమవర్తనుడై జీవితమును గడుపు పుణ్యాత్ముడు సర్వశ్రేష్ఠుడు. అటువంటి పుణ్యపురుషుని చూచుచు సమస్త ప్రాణికోటి ఎల్లప్పుడును సంతోషించుచు, అభినందించు చుండును.

కపిలబోధ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

# 8. ఋషభదేవుని బోధ

స్వాయంభువ మనువు మునిమనుమడైన నాభికి, మేరుదేవికి, శ్రీమన్నారాయణుడే పుత్రుడై జన్మించెను. అతనిపేరు ఋషభుడు.

ఋషభుడు అవతారపురుషుడే అయినను, సామాన్యునివలె వర్ణాశ్రమ ధర్మములను చక్కగ నాచరించుచు, ప్రజలచే నాచరింపజేయుచుండెను. అతడు రాగద్వేష రహితుడై, సర్వభూతహితుడై యుండెను. అతడు ఆదర్శ ప్రభువుగ చిరకాలము రాజ్యముచేసి, రాజ్యభారమును పుత్రులకు అప్పగించి బ్రహ్మావర్త దేశమునకు వెడల దలచెను. మంత్రులు, మునులు, మహాత్ములు ఉపస్థితులై యుండగా నతడు తన కుమారుల కీవిధముగ నుపదేశించెను.

కుమారులారా! ఈ మానవజన్మ బహుదుర్లభమైనది. దానికి ఒక ఉత్తమ ప్రయోజనమున్నది. జీవరాసులన్నీ నిత్యము చేయుచుండు ఆహార నిద్రా, మైథున కార్యములే కాకుండ, మానవుడు, తనకే ఇవ్వబడిన బుద్ధిని సద్వినియోగ పరచుకొనవలెను. భగవదారాధనచే చిత్తమును శుద్ధపరచుకొని, మోక్షమును పొందవలెను. కామముల ననుభవించుట చేత సంసార బంధములు పెరుగును. మహాత్ముల సేవ మోక్షమునకు దారితీయును. సాధు సజ్జనుల సాంగత్యము చాలా శ్రేయస్కరము. కామప్రేరితమైన స్త్రీ పురుష సాంగత్యము చాలా హానికరము. మహాత్ములు ఎల్లప్పుడును శాంతస్వభావులై యుందురు, వారు సమచిత్తులు, ద్వేషాసూయ క్రోధములు లేనివారుగా నుందురు. వారికి సమస్త జీవుల యందు దయ, కరుణ మెండుగ నుండును. వారికి భగవంతునియందు పరిపూర్ణమైన భక్తిశ్రద్ధలుండును. వారు, విషయ లంపటులకు, దుష్టులకు దూరముగ నుందురు. వారికి యెవ్వరి యందును, దేనియందును వ్యామోహముండదు.

భగవద్భక్తియే జీవితము యొక్క ధ్యేయమని తెలుసుకొనవలెను. దేహేంద్రియ మనోబుద్ధులను సుఖపెట్టవలెనని చేయు కర్మలు, కర్మబంధమును కలుగజేయును. ఆ కర్మలే మఱల దేహధారణకు కారకములగును. ప్రస్తుత శరీరము పూర్వకర్మల ఫలితముగ వచ్చినది. అట్లే

ప్రస్తుత కర్మలు భావిజన్మలకు బీజాంకుర మగును. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, అనుకుంటూ వ్యామోహము, అనుబంధము, పెంచుకొన్నచో, సంసారబంధము లింకను చుట్టుకొనును. తెలుసుకొనవలసినది, ఆశ్రయింపవలసినది, పొందవలసినది, ఈ బంధనములకు భిన్నముగను, అతీతముగను ఉన్న పరమాత్మ తత్త్వమేనని గుర్తించనంతవరకు, ఈ సంసార చక్రభ్రమణము కొనసాగుచునే యుండును. మానవుడు దుఃఖపంకిలములోనే కొట్టుకొను చుండును

మానవుడు, అవిద్యచే - ఈ శరీరమే నేను అని, ఈ శరీరానికి చెందిన భార్య, బిడ్డలు, సంపదలు, అన్ని నావే, యని - అహంకారమమకారములను కల్పించుకొనును. వాటిని తృప్తిపరచుటకు కర్మలు చేయుచు, కర్మఫలముల ననుభవించుచు, వాసనలను పెంచుకొనుచు, క్రొత్తజన్మలకు పునాది వేసుకొనును. వాసనా క్షయమే ముక్తి. ఇది సిద్ధింపవలెనన్న, దృష్టిని ప్రపంచము నుండి మళ్లించి, పరమాత్మయందు లగ్నము చేయవలెను. భాగవతుల సాంగత్యము, భగవద్గుణ కీర్తనము చేయుచుండవలెను. అప్పుడు విషయాసక్తి తగ్గి, మోక్షాసక్తి పెరుగును.

అందుచేత నాయనలారా! మీరెల్లప్పుడును భగవంతునే ఆశ్రయింపుడు. ఈ దృశ్యప్రపంచమంతయు నశాశ్వతమైనట్టిదని గ్రహించి, దానియందెట్టి సంగమును పెంచుకొనవద్దు. బ్రహ్మజ్ఞానము పొందుటకు సాధన చేయుడు. భగవంతునకు శరణాగతులగుడు.

ఈ సాధనలో పాటింపవలసిన కొన్ని సూత్రములున్నవి. భగవానునియందు ప్రేమ, భక్తి కలిగియుండవలెను. భగవంతుని విషయమై ఆసక్తిని, జ్ఞానమును పెంచుకొనవలెను, కోరికలను తొలగించుకొనవలెను, సుఖదుఃఖములయందు సహనము, సమానత్వము కలిగియుండవలెను, జీవులపట్ల సానుభూతి చూపవలెను, భగవంతుని కథలు, గుణగణములు, లీలావైభవములు, వినుచు, కీర్తించుచుండవలెను. అంతటను, అన్ని పరిస్థితులయందును సమబుద్ధిని కలిగియుండవలెను. అహంకార మమకారములను తొలగించు కొనవలెను. ఇంద్రియములను నియంత్రించవలెను, అంతటను, భగవంతుని గాంచవలెను,

ఇట్టి సాధన చేసినచో మనస్సునుండి కర్మవాసనలు తొలగి, కారణదేహము ఆ జీవుని వెంట రాకుండ విడిచిపెట్టును. ఇదియే ముక్తి - భగవంతునియందు అచంచల భక్తి కలిగియున్న వాని సూక్ష్మదేహము ఆ జీవుని వెంట పడదు. ఈ రహస్యమును తలిదండ్రులు బిడ్డలకు, గురువులు శిష్యులకు, రాజులు ప్రజలకు తెలియజెప్పవలెను. అజ్ఞానముచే, దేహపోషణయే పరమావధి యనుకొని, కర్మలలో చిక్కుకొని, నీచజన్మలకు దిగజారనున్నవారిని వారించి సరియైన మార్గము జూపని విజ్ఞులు తమ ధర్మమును తప్పినవారగుదురు.

కుమారులారా! మీరందరును సత్త్వగుణ ప్రధానులు. మీకు కర్మాసక్తితో కూడిన ప్రవృత్తిమార్గము సరిపడదు, భగవద్భక్తియే రుచించును. ద్విజులలో బ్రహ్మజ్ఞాన సంపన్నులే శ్రేష్ఠులు. బ్రాహ్మణులకు అర్పింపబడిన వాటిని భగవంతుడే స్వీకరించును. భగవద్భక్తులైన భాగవతులయందు భక్తికలిగి యుండవలెను. ఈ విశ్వమందున్న స్థావరజంగమ ప్రాణులన్నియు ఆ భగవంతునియొక్క శరీరమేయని గ్రహించి ప్రవర్తించుట, భగవానుని ఆరాధించుటయే యగును. భగవదారాధన యొక్కటే మోక్షసాధనమని తెలుసుకొనుడు. సర్వభూతములయందు భగవానుని ఉనికిని గుర్తించుట, సతతము భగవానుని గురించి ప్రసంగించుట, అంతటను భగవానుని శరీరమును చూచుట ముక్తిసాధనలని తెలుసుకొనుడు.

నాయనలారా! సద్బ్రాహ్మణులను గౌరవించి ఆదరించుట, ప్రజలను బిడ్డలవలె ప్రేమించుట, ధర్మయుతముగ పరిపాలించుట, మీ అన్న అయిన భరతుని, నన్ను గౌరవించునట్లే, భక్తి శ్రద్ధలతో సేవించుట, మీ అందరి యొక్క ధర్మమని మీకు తెలియజేయుచున్నాను - అని ఋషభదేవుడు తన ఉపదేశమును ముగించెను.

ఋషభబోధ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

## 9. ఋషభపుత్రుల బోధ

ఋషభచక్రవర్తికి నూర్గురు పుత్రులు. వారిలో పదిమంది పదిఖండములకు రాజులైరి. పెద్దవాడు భరతుడు. అతనిపేరు మీదనే భారతవర్షము ప్రసిద్ధి గాంచినది. తరువాతి ఎనుబదియొక్క మంది, బ్రాహ్మణత్వమును స్వీకరించి, నిత్యకర్మానుష్ఠాన పరులైరి. చివరి తొమ్మిది మంది, బ్రహ్మవిద్యా విశారదులై, ఋషులై, జీవన్ముక్తులై, ముల్లోకములలో స్వేచ్ఛావిహారులై యుండిరి.

ఆ తొమ్మండుగురు, ఒకనాడు విదేహరాజైన నిమి నిర్వహించిన యాగము సమాప్తమగు సరికి అక్కడకు చేరిరి. నిమిచక్రవర్తి వారినాహ్వానించి, పూజించి, సంతృప్తులను జేసి, యిట్లనెను: "మహాత్ములారా! మీ వంటి సాటిలేని జ్ఞానధనులు, విశ్వమంతా శ్రీహరిమయమే యని దర్శింపగలిగిన తత్త్వజ్ఞులు. ఇక్కడికి విచ్చేయుట మా భాగ్యము. నా అజ్ఞానమును బాపగల మహనీయులు మీరేనని నా విశ్వాసము. నా సందేహములను తీర్చి నన్ను ధన్యునిగ చేయుడు:

"మానవజన్మ అతి దుర్లభమైనట్టిది. శ్రీమన్నారాయణుని పాదపద్మముల యందు అనురక్తి కలుగుట ఇంకను కష్టసాధ్యము. ఇటువంటి అమూల్యమైన మానవజన్మను సద్వినియోగపరచుకొనకుండ సంసార పంకిలములోనికే ఇంకను చొచ్చుకొని పోవును మనుజుడు. ఈ సంసార సాగరమును దాటుటకు ఏదైన మార్గమున్నదా? శాశ్వతమైన శ్రేయస్సు ఎట్లు కలుగును? భక్తిప్రపత్తులు గలవారికి విష్ణుసారూప్యమెట్లు కలుగును? తెలవివ్వండి" అని నిమిచక్రవర్తి అడుగగా, ఋషభపుత్రులలోకవి అను ఋషి ఇట్లు చెప్పెను:

కవి : రాజా! కామ క్రోధ లోభ మోహ మదమత్సరములను అరిషడ్వర్గ మందురు. దారేషణ, ధనేషణ, పుత్రేషణలను ఈషణత్రయమందురు. వీనియందు చిక్కుకొన్న మానవునకు మాధవుని పాదపద్మముల నాశ్రయించాలను ఆసక్తి కలుగనేరదు. విజ్ఞాన యుతమైన నిర్మలహృదయము, భక్తిభావనావేశము లేనిచో పరమపదము లభింపదు. మనోవాక్ కాయ సమన్వయముతో చేయబడిన ప్రతికర్మను "కృష్ణార్పణము"గ చేయుటయే సుజ్ఞానమని పరమ మునీంద్రులు చెప్పిరి. జ్ఞాన అజ్ఞానములతో కలత చెందిన మనస్సువలన స్మృతి నశించును. కావున సద్గురు దేవు నాశ్రయించి,

బుద్ధిమంతుడు, ఆ పురుషోత్తమునే చిత్తమందు నిలిపి సేవింపవలెను. ఇచ్ఛలు, మనోరథములు, స్వప్న సదృశ భోగవాంఛలు, మానవుని యందున్న సత్సంకల్పములను చెదరగొట్టి, దైవచింతనను నశింపజేయును గనుక కోర్కెలను రేకెత్తించు సంకల్పముల నడుమలో నుంచి, నిరంతర హరి ధ్యానములో నుండు వ్యక్తికి కైవల్యము సులభ సాధ్యమగును. ఓ రాజా! భక్తుడెల్లప్పుడును శ్రీకృష్ణ సంకీర్తనలు వీనులవిందుగ వినుచుండవలెను: శ్రీహరి గాథలను హర్షముతో నాడుచు పాడుచు వినాలి, వినిపించాలి. శ్రీమన్నారాయణుని దివ్యనామములను ఎల్లప్పుడును స్మరించుచుండవలెను. పద్మలోచను లీలలను అడవులలో సంచరించుచున్నను భక్తియుక్తముగ గానము చేయువలెను. విశ్వమయుని కీర్తించుచు, వెఱ్ఱివానివలె, లోకాతీతుడై యుండవలెను. ఈ విశ్వమంతయు విష్ణుమయమే యని తెలుసుకొనవలెను.

అని కవి చెప్పగా, విదేహరాజు భాగవతదర్మములనగానేమి, భాగవతు లెట్లుండెదరు అని అడిగెను. అప్పుడు కవిసోదరుడైన హరి యిట్లు చెప్పెను:

హరి : రాజా! భగవానుడే కొన్ని భాగవతధర్మములను పంచరాత్రాది గ్రంథములలో వివరించెను. భాగవత ధర్మానుసరణముచే - భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసము, శరణాగతి కలిగియుండుట, దేని గురించి యైనను భయములేని ఆత్యంతిక క్షేమభావమును కలిగియుండుట, సర్వమూ ఆ నారాయణ మయమే, నారాయణుని వినా ఇంకేమియును లేదని విశ్వసించుట, తత్త్వజ్ఞానము, భక్తి వైరాగ్యము, ఇత్యాది సల్లక్షణము లలవడును.

ఉత్తమభాగవతుడు వర్ణాశ్రమ ధర్మ కార్యకలాపములలో తగుల్కొనక భక్తిమార్గము నాశ్రయించి, శ్రీహరి తన యందే కాక సమస్త జగత్తంతటను నిండియున్నవాడని స్థిర నిశ్చయము కలిగియుండును. అతడు ఇతర భక్తులయెడల మైత్రిని, అల్పజ్ఞుల పట్ల సానుభూతిని, విపరీతపు వ్యక్తుల పట్ల ఉపేక్షను కలిగియుండును. పరిపక్వత జెందని భక్తుడు, తాను నమ్మిన ఒకే ఒక మూర్తియందే భగవంతు డున్నట్లును, వేఱెచ్చటను లేనట్లును భావించుచు, తర్కించును. భాగవతోత్తముడు, ప్రియాప్రియములు ఎదురైనప్పుడు రాగద్వేషముల జూపడు, మోదఖేదముల జెందడు. సర్వము విష్ణువేయని, విష్ణు

అధీనమని నమ్మును. జనన మరణములు, ఆకలిదప్పికలు, శ్రమ, వాంఛ, భయము వంటివన్నీ దేహేంద్రియ మనోబుద్ధుల సహజ వికారములుగ తెలుసుకున్నవాడై వాటియందు మోహము జెందడు. అతనికి భగవంతుని పాదపద్మములు తప్ప కోరవలసిన దింకేమియు నుండదు. జన్మచేగాని, కర్మచేగాని, సంస్కార పాండిత్యములచే గాని, తాను అధికుడ నను భావమే అతనికి రాదు. నాది, ఇతరులది అనుభేద భావముండదు. అతడెల్లప్పుడును శాంత, సమచిత్తముతో నుండును. ముల్లోకముల ఐశ్వర్య సంపదలు, భోగభాగ్యములు లభించినను అతడు లోభపడడు. భగవత్పాదారవింద చింతన తప్ప అతని కింకేమియు అక్కరలేదు. అట్టివాడే భాగవతోత్తముడు".

అని హరి చెప్పగా విదర్భరాజా నిమి యిట్లడిగెను : ఋషివర్యులారా! అవిద్యలో మునిగియున్న మానవుడు మాయనుండి ఎట్లు బైటపడగలడు? అప్పుడు ప్రబుద్ధుడను ఋషి యిట్లు చెప్పెను :

ప్రబుద్ధుడు : రాజా! మానవుడు జీవించియున్నన్నాళ్లు, దుఃఖనివృత్తికి సుఖప్రాప్తికై ఏదో నొక కర్మను చేయుచునే యుండును. ఈ కర్మల ద్వారా ధనమార్జించి, భార్యాపుత్ర గృహక్షేత్రాది సంపదలను పొంది ఇహలోక సౌఖ్యముల ననుభవింపగోరును. అట్లే యజ్ఞ, జప తపాదులద్వారా పుణ్యము నార్జించి, పరలోక సౌఖ్యములను పొందగోరును. కాని, తానాశించునట్లు సుఖములను పొందగలుగుచున్నాడా? సుఖరూపమున నున్న దుఃఖమునే పొందుచున్నాడు. ఏలనన, కర్మలచే నార్జింపబడు ఫలములన్నియు నశ్వరములు అనిత్యములు, దుఃఖప్రదములు గనుక. అయితే నిత్యము, సుఖప్రదము, శ్రేయస్కరము అయిన సాధన మార్గమేది? ఒక సద్గురువు నాశ్రయించి, భాగవత ధర్మముల నాచరించుట. ప్రతిదినము సూర్యోదయాస్తమయములతో నాయువు క్షీణించుచుండగా, దేహము, భార్య, బంధు, సంపదలపై మమకారమును వీడలేక, సంసారాంధ కారములో కొట్టుకొనుచు, జన్మ జర రోగ మరణ భయములను సైతము లెక్కచేయక, దేహమే దేవుడని, దానినే పూజించుచు, సుఖపెట్టాలని యాతన పడుచు, దైవమును కూడ విస్మరించి, కాలక్షేపము చేయు వారు మూఢులు. అట్టివారితో సంపర్కము పెట్టుకొనరాదు.

ఆచరింపవలసిన భాగవత ధర్మములివి : సత్త్వగుణము, భూతదయ, హరికథామృత పాన పిపాస కలిగియుండవలెను; బ్రహ్మచర్యము, విషయవిరక్తి, సజ్జనమైత్రి, సాధుసాంగత్యము, వినయశీలము అలవరచుకొనవలెను. బాహ్యాశౌచము, అంతఃశౌచము పాటింపవలెను. తపస్సు, మౌనము, క్షమాశీలత, వేదశాస్త్రాధ్యయనము శాస్త్రానుష్ఠానము ఆచరించవలెను; సుఖదుఃఖాది ద్వంద్వసహిష్ణుత, అహింస, త్రికరణశుద్ధి, సత్యవచన నిష్ఠ, శమదమాది గుణ సాధన అభ్యసింపవలెను. భగవంతుడు సర్వవ్యాపియని విశ్వసింపవలెను. నారవల్కలములను ధరింపవలెను. అప్రయత్నముగ లభించు దానితో సంతుష్టి చెందవలెను. జనసందోహవర్జనము ముముక్షుత్వము, వేదాంత శాస్త్రార్థ జిజ్ఞాస, పెంపొందించుకొనవలెను, ఇతరదేవతానిందను చేయకుండవలెను, గృహా రామ క్షేత్ర కళత్ర పుత్ర విత్తాదులు, హరిదత్తములు గనుక, హరి సమర్పణముగ ననుభవించవలెను; భక్తులు కానివారి చెంత చేరకుండవలెను; మొదలైనవి భాగవతధర్మములు. హరిభక్తులతో చెలిమి చేయుచు, హరిలీలలను తలచుకొనుచు, ఆనందబాష్పములతో మేను పులకించుచు, భక్తిపారవశ్యమున మునుగు భక్తుడు విష్ణుమాయను దాటగలడు" అని చెప్పెను.

ఋషభపుత్రుల బోధ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

# 10. శ్రీకృష్ణ బోధ

ఉద్ధవుడు, యాదవులలో నొక సజ్జనశ్రేష్ఠుడు, బృహస్పతి శిష్యుడు, జ్ఞాని శ్రీకృష్ణునికి దగ్గర బంధువే కాక, అత్యంత ప్రియతమ అనుయాయుడు. జ్ఞానబోధను పొందుటకు ఉద్ధవుడే యోగ్యుడని భావించిన భగవానుడు అతనికి తత్త్వబోధ చేసెను. శ్రీకృష్ణుని ఉద్ధవుడిట్లడిగెను :

"ప్రభూ, దేవాదిదేవా! నీ దివ్యసంకల్పము నాకు కొంచెము అర్థమైనది. ఋషుల శాపమువలన జరుగనున్న యాదవకుల నిర్మూలనము పిమ్మట నీవు నీ దివ్యధామమునకు మఱలిపోవ సంకల్పించుకున్నట్లున్నది. నా ఊహయే సరియైనచో, నీ నుండి ఎడబాటును నేను సహింపగలనా స్వామీ! నన్ను కూడ నీతోనే తోడ్కొని పోయినచో నేను నీ పాదసేవ చేసుకొనుచు ఉండెదను. అనుగ్రహింపుము ప్రభో!" అని కన్నీరు మున్నీరుగ ఏడ్చుచున్న ఉద్ధవునితో శ్రీకృష్ణుడిట్లనెను : ఉద్ధవా! నీ ఊహ సరియైనదే. నా అవతార కార్యము సమాప్తమైనది. బ్రహ్మాదిదేవతలు వచ్చి, వైకుంఠమునకు మఱలిరమ్మని వేడుకొనిరి. నేటికి ఏడవదినమున ద్వారకా నగరమును సముద్రుడాక్రమించు కొనును. యాదవకుల నాశముకూడ ఆ నాటికి ముగియును. అప్పటినుండి కలియుగ మారంభమగును. ఈ కలియుగమున, మానవులు, ధర్మమును విడిచినవారు, ఆచారములేనివారు, అన్యాయపరులు, మిక్కిలి రోషావేశపరులు, మందమతులు, అల్పాయుష్కులు, బహురోగపీడితులు, నిష్ఫలమైన పనులు చేయువారు, నాస్తికులు, అయి, ఒకరినొకరు మెచ్చక, నచ్చని వారైయుందురు. కనుక, నీవు బంధుమిత్రుల యందున్న అనుబంధములను వీడి, ఇంద్రియభోగముల యందు తగుల్కొనక, పుణ్యతీర్థములను దర్శించి, పవిత్ర అనుభూతులను పొంది, పంచేంద్రియ విషయవస్తువులు నశించునట్టివని గ్రహించి, వాటిని దరిజేరనీయకుము. ఇంద్రియ మనోవికారములను నిగ్రహించి, ఈషణత్రయమును వర్జించి, మోదఖేదాదుల యందు సమభావముతోమెలగి, ఈ జగమంతా పరమాత్మచే అధిష్ఠింపబడినదిగా తెలుసుకొని, మాయ అతని వశమున నున్నదని తెలుసుకొని, జ్ఞానవిజ్ఞాన యుక్తుడవై, ఆత్మానుభవ సంతుష్టుడవై, విశ్వమంతా నేనే యని యెఱిగి వర్తించవలెను" అని శ్రీకృష్ణుడు బోధించెను.

ఉద్ధవుడు భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లి యిట్లనెను :

ప్రభూ! నీ మాయకు లోనైన నావంటి పామరుడైన సంసారులకు వైరాగ్యము, సన్న్యాసము, అంత సులువుగా నబ్బదు కదా, అట్టివారికి గత్యంతరమేమిటి? బ్రహ్మాదిదేవతలును, భ్రాంతులై పోవుచుందురు. నీ భక్తులైన పరమభాగవతులు మాత్రము నీ మాయకు లోబడరు. యోగీంద్రులకైనను, గృహస్థులకైనను, నీ యొక్క నామస్మరణమే మోక్షప్రదము గావున ఓ పరమేశ్వరా! నీ చరణకమలముల శరణమే నే నాశ్రయించు చుంటిని. కృపతో నన్నను గ్రహింపుము" అని ప్రియభృత్యుడు వేడుకొనగా, స్వామి కరుణతో నిట్లనెను:

"ఉద్ధవా! ఆత్మకు ఆత్మయే గురువు. కుతర్కములలో చొరక, సన్మార్గ వర్తివై నా పరంధామమునకు చేరగలవు. యోగులెల్లప్పుడును, నన్ను పరమ పురుషునిగ ధ్యానించెదరు. జీవ జంతువులలో మానవులుత్తములు, మానవులలో, నిరంతర ధ్యాననిష్ఠులైన యోగులుత్తములు. సంశయగ్రస్తులు నన్ను తెలుసుకొనలేరు. నేను సత్త్వగుణము గలవారిచే గ్రహింపబడగలను అని తెలుసుకొని, తమచిత్తమందు జీవాత్మను పరమాత్మతో నైక్యపరచు కొనగలుగు వారు పరమయోగీంద్రులు; పరమజ్ఞానులు" అని భగవానుడు చెప్పెను.

బద్ధులు, ముక్తులు : మఱియు, భగవానుడిట్లు చెప్పెను:

ఉద్ధవా! నన్నాశ్రయించి, నాచే నిర్దేశింపబడిన వర్ణాశ్రమ కులాచార, ధర్మములను బాగుగ ననుసరించు మానవుడు, కామప్రేరిత కర్మలను విసర్జించి యమనియమాదులను పాటించుచు, తన నిత్య నైమిత్తిక కర్మలు ఆచరించు చుండవలెను. స్వప్నములోని అనుభవములు సత్యము కానట్లు, ఇహలోకము లోని వ్యవహారము లన్నియు, నాత్మదృష్టితో గాంచినచో స్వప్నతుల్యములే యని తెలుసుకొనవలెను.

కనిపించే విభిన్నతలన్నీ దేహాదుల యందే ఉండునుగాని, అంతటను వ్యాపించియున్న ఆత్మలో లేదు. కట్టెలు వేఱువేఱుగా నున్నను, వాటియందు నిక్షిప్తమైయున్న అగ్ని ఒక్కటే. కట్టెలు కాలి బొగ్గు అయి బూడిదగా మారినప్పుడు, అగ్ని, అనంతాగ్నిలో కలిసిపోవునట్లు, శరీరపతనముతోపాటు

జీవుడు నిష్క్రమించును. కాలుతున్న కట్టెల ఆకారమును అగ్ని తాత్కాలికముగ ధరించునట్లు కనిపించినను, అగ్నికి ఆకారములేనట్లు, ఆత్మకు అనేకత్వముగాని, ఆకారముగాని లేవు. దేహమే తాను అనుభ్రమలో నుండుటచేత, దేహమునకు కలుగు దుఃఖములన్నియును తనవిగానే భావించుచు మానవుడు అనేకమైన బాధలకు గురి అగుచుండును. జననమరణ సంసార చక్రములో చిక్కుకొనును. సద్గురువు నాశ్రయించి, తత్త్వవిచారణచే అవిద్యను బాపుకొని, జ్ఞానాగ్నిచే కర్మలను నశింపజేసుకొని, నన్నుపాసించిన వ్యక్తి, నన్ను జేరును. ఇహలోకపు ఇంద్రియ సుఖములుగాని, పరలోకపు స్వర్గసుఖములుగాని, తాత్కాలిమైనట్టివే కాకుండ, సంసార రూపమైన అంతులేని దుఃఖములను తెచ్చిపెట్టును. బ్రహ్మాదిదేవతలైనను, త్రిగుణముల ప్రేరణచే చేయబడిన కర్మల ఫలములను అనుభవింపక తప్పదు. స్వర్గలోకవాసులును పుణ్యము క్షీణింపగనే పతనమై పునర్జన్మలను పొంది కర్మవలయములో చేరెదరు. నన్ను చేరుకొనువరకు ప్రతిజీవి, ఈ భయంకరమైన సంసార చక్రములో చిక్కుకొని తిరుగుచుండును - అని శ్రీకృష్ణుడు చెప్పగా ఉద్ధవుడిట్లనెను. "ప్రభూ! జీవుడెల్లప్పుడును బంధములో నుండుననియు, ఈశ్వరుడెట్టి బంధములులేని వాడనియు నేను భావించుచుంటిని. మఱి, జీవాత్మ పరమాత్మల ఐక్యత ఎప్పుడు ఎట్లు సంభవించును?" అని అడుగగా భగవానుడిట్లు చెప్పెను: ఉద్ధవా! ప్రకృతియొక్క త్రిగుణముల ప్రేరణచే చేయబడిన కర్మలు బంధమును కలుగజేయును. కర్మఫలము ననుభవించుటకొక శరీరము కావలయును గనుక జన్మ కలుగును. కర్మక్షయ మవగానే ఇక శరీరము యొక్క అవసరముండదు గావున బంధము వీడును, ముక్తి కలుగును. జీవుడు సహజముగ ముక్తుడే, కాని త్రిగుణముల ప్రభావమునకు లోనైన వాడై బద్ధుడగును. మాయ అనబడు ప్రకృతి, నా యొక్క అధీనము నందుండును గనుక దాని ప్రభావము నాపైన నుండదు. నేను బంధమోక్షముల కతీతుడను. అవిద్య, విద్య, నాయొక్క సంకల్పము చేతనే ప్రవర్తించును. అవిద్యవలన కలిగిన బంధము విద్య (జ్ఞానము) వలన తొలగి ముక్తి సిద్ధించును. జీవుడు నాయొక్క అంశభూతుడు. అవిద్యచే దేహమే తాననుభ్రమవలన బద్ధుడగును. తానును, నాయొక్క ఆత్మస్వరూపుడే యని

జ్ఞానము ద్వారా జీవి తెలుసుకొన్నంతనే నాతో ఐక్యమగును. జీవేశ్వరుల యథార్థ తత్త్వమును తెలుసుకొన్న జ్ఞాని, కర్మల నాచరించుచున్నను, వాటి యందు ఫలాపేక్ష, ఆసక్తి లేనివాడై యుండును గావున బద్ధుడు కాడు. సూర్యకాంతి అన్నివస్తువులపై సమానముగ ప్రసరించినను, ఆ వస్తువుయొక్క మంచిచెడులు సూర్యునికి అంటనట్లు, సుగంధముపైన వీచినా దుర్గంధముపైన వీచినా, ఆగంధము వాయువునకు చెందనట్లు, తాను నిమిత్తమాత్రునిగ చేయు కర్మలు, కర్మఫలములు, తనకు చెందవు, భగవంతునకే చెందునను విశ్వాసముతో కర్మలను చేయు జ్ఞానికి ఎటువంటి కర్మబంధములు గుణదోషములు అంటవు.

ఉద్ధవా! లౌకికమైన శాస్త్రజ్ఞానము నిరర్థకము. నన్ను గురించి తెలుపునట్టిది, నా వద్దకు చేరుమార్గము చూపునట్టిదే సార్థకమైన జ్ఞానము. జ్ఞాని, నా యొక్క పవిత్రమైన సృష్టి స్థితి లయ విలాసముల గురించి నిరంతరము వినుచు, వినిపించుచు, ఆనందించుచుండును. నా యొక్క లీలాచరిత్ర గాథలను స్మరించుచు, ముచ్చటించుచు, గానము చేయుచు, అందరిని ఆనందింప జేయును. అట్టి పుణ్యాత్ముడు నన్ను చేరగలడు" అని భగవానుడు చెప్పగా ఉద్ధవుడిట్లడిగెను: దేవదేవా! అటువంటి పుణ్యాత్ముడైన భక్తుని లక్షణము లెట్లుండునో నాకు తెలియజెప్పుము" అనగా భగవానుడిట్లు చెప్పెను.

ఉద్ధవా! సాధువైన సత్పురుషునకు ఈ లక్షణములుండును. సర్వభూత దయ, అహింస, సుఖదుఃఖాదులయందు సమభావము, సహిష్ణుత, సత్యభాషణము, ద్వేషాసూయ రాహిత్యము, స్వ, పర, భేదభావములేకుండుట, పరోపకారిత్వము, కోరికలు లేకుండుట, ఇంద్రియనిగ్రహము, బాహ్యాంతః శౌచము, స్వప్రయోజనాభిలాష లేకుండుట, లౌకిక వ్యాపారములను విడుచుట, శరీర పోషణకు అవసరమైనంత ఆహారమునే స్వీకరించుట, విషయాసక్తి లేకుండుట, భగవంతుడే సర్వస్వమని నమ్మియుండుట, భగవంతుని కల్యాణ రూపగుణ వైభవములు సదా స్మరించుచు మననము చేయుట, కష్ట నష్ట శోక మోహములు, ఆకలిదప్పిక, జరా మృత్యు ఆపదరోగములవంటి ప్రతికూలస్థితు లెదురైనప్పుడు ధీరతతో నుండుట; ఇతరులనుండి

సత్కారముల నాశింప కుండుట, అందరియెడల కరుణ, మైత్రి, సత్కారభావము కలిగియుండుట; ఆత్మపరమాత్మల ఏకత్వమును గుర్తించుట - ఇట్టి సత్పురుషుడు నాకు మిక్కిలి ఇష్టుడు. తన స్వధర్మముల నాచరించుచు, సంగము లేకుండ, కర్తృత్వభావమును, ఫలమును, విడిచి, నన్ను భజించువాడు నా భక్తులలో ఉత్తముడు. ఇటువంటి సాధుసత్తముల సహవాసము చేసి, వారి సహచర్యముతో నన్ను భక్తితో నారాధించవలెను. నా మూర్తుల నర్చించుట, నా భక్తులను సేవించుట, నా లీలలను కీర్తించుట, నా కథలను వినుట, నన్ను ధ్యానించుట, సర్వము నాకే అర్పించుట, ఆత్మసమర్పణము చేయుట, నా గురించి ఉత్సవములను చేయుట, నా ఆలయములలో నా యొక్క లీలాగాథలను గానము చేయుట, పుణ్యస్థలములను దర్శించుట, శాస్త్రోక్తమైన వ్రతములను చేయుట, మొదలైన వివిధ సేవలను నా భక్తులు చేయవలెను. కొందరు ఆలయము, తటాకములు, ఉద్యానములు, మండపములు, నిర్మించెదరు. కొందరు నా దాసానుదాసులై ఆలయ సేవలను, నా భక్తుల సేవలను, చేయుచుందురు. తమకు అత్యంత ప్రియమైన వాటినే నా భక్తులు నాకు అర్పించెదరు.

ఉద్ధవా! నన్ను ఈ పదునొక్క స్థానములలో ఆరాధించవలెను. సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, గోవులు, వైష్ణవులు, ఆకాశము, వాయువు, జలము, భూమి, ఆత్మ, సర్వభూతములు, యజ్ఞయాగాదులచే కూడను నన్నారాధించెదరు. సత్పురుషుల సాంగత్యము భక్తుల కెంతో అవసరము. వారి సాంగత్యసేవలలోనే భక్తిని పెంపొందించుకోవలెను. భక్తి కుదురుట అతికష్టతరము. నీవు నా భృత్యుడవు, మిత్రుడవు గావున, నీకీ భక్తిరహస్యమును చెప్పితిని. భక్తిద్వారా నన్ను చేరుట అన్నివర్గములవారికిని సుగమమగునని తెలుసుకొనుము.

ఉద్ధవా! నేను చెప్పిన భక్తిమార్గము ననుసరించువారు పొందగల ఆనందము - నిత్యానందము, దుఃఖమిశ్రితము కానట్టిది. నన్నే స్మరించుచు, నా యందే మనస్సు నిలిపి, యితర విషయములపై ఆలోచనలేక నన్నారాధించువారు నిరతిశయానందము ననుభవించెదు. వారికి ఇంద్రపదవిగాని, బ్రహ్మపదవిగాని, చివరకు మోక్షపదముగాని అక్కరలేదు. వారే నాకు అత్యంత ప్రియతములు.

నా భక్తులెచ్చట నుందురో ఆ ప్రదేశము పవిత్రమగును. వారు, నన్నే అందరియందును అన్నింటియందును చూడగలరు. నా యందు ప్రేమతో, నన్నే స్మరించుచు, నా గాథలను, గుణగణములను గానము చేయుచు, ఇతర భక్తులతో ముచ్చటించుచున్నచో భక్తి క్రమముగ వృద్ధిచెందును. ఉత్తమ సంస్కారములున్న వారింట జన్మించియు, సకలశాస్త్రములు చదివియు, నా యందు భక్తిలేని వానికంటెను, హీనస్థితిలో నుండియు, చదువు సంస్కారములు లేకున్నను నా యందు అచంచల భక్తివిశ్వాసములున్నవాడే శ్రేష్ఠుడు. నిజమైన భక్తునకు భగవన్నామము వినబడినను, భగవత్ స్వరూపము కనబడినను, ఒడలు పులకించును. ఆనందబాష్పములు కురియును, గొంతు గద్గదమగును. హృదయము ద్రవించి పొంగిపోవును. అతడు నవ్వును, ఏడ్చును, గంతులు వేయును, గొంతెత్తి పాడును, మైమఱచి పరవశించిపోవును. అతని కర్మలు కాలిపోవును; అజ్ఞానము తొలగిపోవును. అంతఃకరణము పరిశుద్ధమగును. అతడు ఇంద్రియ విషయలాలస ప్రలోభములకు లోనుగాడు. నిప్పువలె పవిత్రుడై యుండును.

ఉద్ధవా! నీవు అటువంటి భక్తుడవు గావున నాకు ప్రియతముడవు. ఉత్తమభక్తుడే నాకు అత్యంత ప్రియతముడని తెలుసుకొనుము''అని భగవానుడు చెప్పగా భగవంతుని ధ్యానము చేయుపద్ధతిని తెలియజేయుమని ఉద్ధవుడు ప్రార్థించెను. ధ్యానము గురించి కరుణామయుడిట్లు చెప్పెను:

ఉద్ధవా! నీకు ధ్యానపద్ధతిని చెప్పెద వినుము. ధ్యానమునకు ఒక ప్రశాంతమైన, శుభ్రమైన స్థలము నెన్నుకొనవలెను. అది, అతి ఎత్తుగాగాని, అతి పల్లముగాగాని లేనట్టి సమతల స్థానమై యుండవలెను. ధ్యానము చేయువాడు, ఎక్కువ సమయము సుఖముగా కూర్చొనగలుగు ఆసనము నేర్పరచుకొనవలెను. శరీరము, మెడ, తలను, నిటారుగా నుంచుకొని, చేతులను తొడలపై నిడుకొని, నాసికాగ్రముపై దృష్టిని కేంద్రీకరింపవలెను. ప్రాణవాయువు సంచరించు మార్గములైన ఇడపింగళ అనబడు నాడులను, రేచక కుంభక, పూరకములచే శోధింపవలెను. ప్రాణవాయువును నియంత్రించుట అలవాటైన పిమ్మట ఇంద్రియములు మనస్సు అదుపులోనికి వచ్చును. ప్రాణాయామముచే నాడీ శుద్ధిచేసుకొని, ఓంకారమును మందముగ నుచ్చరింపవలెను. ఓంకార

నాదము శరీరమంతటను వ్యాపించి, ఉత్తేజపరచునట్లు అనుభూతి చెందవలెను. ఇట్లు దినమునకు మూడుమార్లు చేయవలెను. ప్రతిసారి పదేసి ప్రాణాయామములు ఓంకారముతోపాటు చేయవలెను. ఓంకారము నుచ్చరించునప్పుడు గంట నాదమువలె నాడీమార్గమున ధ్వని వినిపించును. ఆ ధ్వని లోపలనే లయించిపోవును. తామర కాడలోని చిన్నినాళము గుండా ఆ ధ్వని వచ్చినట్లును, అది, ఇడా పింగళ నాడుల గుండా ప్రవహించుచున్నట్లును గుర్తింపవలెను. ఈ విధముగ అభ్యసించిన ఒక నెలదినములలో శ్వాసవాయువు అదుపులోనికి వచ్చును. ధ్యానము హృదయ కమలముపై చేయవలెను. వికసించుటకు సిద్ధముగ నున్న కమలపుమొగ్గ తలవంచి నట్లు (చెట్టుననున్న అరటిపువ్వువలె) హృదయము ఉండును. అది, తలపైకెత్తి, పూర్తిగ వికసించి, ఎనిమిది రేకులతోను, మధ్యను బంగారు ఛాయలో నున్న కర్ణికతోను ఉన్నట్లుగ భావించాలి. ఆ కమలమందు సూర్యగోళము, దానిముందు పూర్ణచంద్ర బింబము, దానిముందు అగ్నిజ్వాల, తేజరిల్లుచున్నట్లు దర్శించ వలెను. ఆ అగ్నితేజస్సు ముందర దివ్యమంగళ స్వరూపుడైన భగవానుడు కర్ణికపై నిల్చొని యున్నట్లు చూడవలెను. ఆ మూర్తి, శ్యామల వర్ణముగను, ప్రశాంతమైన దివ్యసుందర వదనము గలదిగను, చక్కని కంఠము, కపోలములు కలిగి చతుర్బాహువులతోను, శంఖచక్రగదా పద్మముల ధరించి, పట్టుపీతాంబరము ధరించియున్నట్లుగను, దర్శించవలెను. దివ్యకాంతులను వెదజల్లే మకరకుండలములు, కౌస్తుభమణి, మణిమయ కంకణములు, బంగారు మొలత్రాడు, కాలియందెలు భుజకీర్తులు, కిరీటము, ధరించియున్న భగవానుని దర్శించాలి. వక్షస్థలముపై శ్రీదేవి, శ్రీవత్సచిహ్నము, ఎన్నడును వాడిపోవని వనమాల, ఉన్నట్లుగ చూడవలెను. సర్వాంగసుందర సుకుమార మనోహర రూపముతోను, మందస్మిత ప్రసన్న వదనము, కరుణార్ద్ర పూర్ణమైన కన్నులతోను, ఉన్న భగవానుని, కన్నుల పండువుగా తిలకించాలి. పాదములనుండి కిరీటము వరకు పరిశీలనగా పరికించి, మరల కిరీటము నుండి పాదములవరకు, ప్రతి అంగమును ఆభరణమును, మాటిమాటికి తిలకించుచు, ఆ దివ్యమోహన రూపమును మనఃఫలకముపై ముద్రించుకొని, కన్నుమూసినను, కన్ను తెరచినను, చూడగలుగునట్లు అభ్యసింపవలెను.

ఇంద్రియములను విషయములపై చరింపనివ్వకుండ అరికట్టి, బుద్ధిని పరమాత్మయందు నిలపవలెను. మనస్సును స్వేచ్ఛా సంచారము చెయ్యకుండ నిగ్రహించవలెను. ఈ విధముగ ధ్యానము చేయుచు, సుందరవదనము పైనను, చివరకు మందహాసముపైనను, ధ్యానమును కేంద్రీకరింపవలెను. ఈ విధముగ మనస్సులోనున్న ఆ దివ్యస్వరూపమే విశ్వమంతటను వ్యాపించి యున్నట్లుగ దర్శింపవలెను. అప్పుడు ఇంద్రియ మనోబుద్ధులతో నున్న తన శరీరముగాని, ధ్యానము చేయుచున్న "తాను" గాని, చేయబడుచున్న ధ్యానక్రియగాని, స్పృహలో నుండవు. తన హృదయములో ఆవిర్భవింప జేసుకొన్న తేజస్వరూపుడైన ధ్యేయమూర్తియొక్క తేజస్సులో నైక్యమగును. ఇదే సమాధిస్థితి. ఈ సాధనద్వారా జీవునికి దేహేంద్రియ మనోబుద్ధులతో నున్న తాదాత్మ్యము తొలగిపోవును. ఈ సమాధిస్థితిని అభ్యాసముచే పొడిగించుకొనవలెను. ఇదియే ధ్యాన సాఫల్యము -

అని భగవానుడు చెప్పెను.

చరమ సందేశము : చివరకు భగవానుడిట్లు చెప్పెను:

"ఉద్ధవా! నా అంతిమ సందేశమును వినుము. నీ మనోబుద్ధులను నాకే అంకితము చేయుము. నన్ను సంతోషపెట్టు విధముగా ప్రవర్తింపుము. నీ కర్మలన్నియు నా కొఱకే చేయుము. నన్నే ఎల్లప్పుడు స్మరించుచుండుము. ఎటువంటి భేదభావము లేకుండ నాచే సృష్టింపబడిన జీవరాసులయందు నా యొక్క ఉనికిని గుర్తించి వాటిని గౌరవించవలెను. ఎటువంటి సంకోచము, సిగ్గు లేకుండ, కుక్క, గాడిద, చండాలుడు, గోవు యొక్క పాదములకును, సాష్టాంగ ప్రణామములు చేసి, వాటియందుండు నన్ను నమస్కరించునట్లు భావింపవలెను. విశ్వాసమున్నవారికే నా ఉపదేశములను వినిపింపవలెను. నాస్తికులకు, నమ్మకము లేనివారికేమియు చెప్పవలదు.

"బదరికాశ్రమమునకు పోయి, అలకనందా నదిలో స్నానముచేసి, వృక్ష బెరడులను ధరించి, కందమూలములను భుజించుచు, దేనియందును ఆసక్తి లేనివాడవై, శీతోష్ణాదులను సహింపుచు, నేను చెప్పిన విషయములను గుర్తుంచుకొని, నన్నే నిరంతరము స్మరింపుచుండుము. ప్రకృతి పరిధిని దాటి

నీవు నన్ను చేరగలవు" - అని చెప్పగా, ఉద్ధవుడు భగవానునికి నమస్కరించి, ప్రదక్షిణముచేసి, ఆనంద బాష్పములతో రుద్ధకంఠముతో నిట్లనెను :

"స్వామీ! యోగీశ్వరా! శ్రీకృష్ణపరమాత్మా! నా యందత్యంత కరుణతో నీవు నాకనుగ్రహించిన జ్ఞానమువలన నా మోహము నశించినది. బంధుజనుల యందున్న మోహము తొలగిపోయినది. నీ ఆదేశము ప్రకారమే చేసెదను" అని స్వామి పాదములను శిరస్సుపై నుంచుకొని, ఆ పాదములను విడువలేకను, స్వామినుండి దృష్టి మరల్చలేకను, స్వామి పాదుకలను నెత్తిపై పెట్టుకొని ముందుకు నడవని తన పాదములను నెట్టుకొనుచు, ముందుకు సాగిపోయెను మహాత్ముడైన ఉద్ధవుడు. బదరీ విశాల ధామమును చేరి, శ్రీకృష్ణుని ఆదేశానుసారముగ ధ్యానము చేసి పరమపదమును పొందెను -

అని శుకయోగీంద్రుడు పరీక్షిత్తునకు చెప్పి, మఱల నిట్లనెను:

రాజా! శ్రీకృష్ణునిచే ఉద్ధవునకు చెప్పబడిన ఈ భాగవత రహస్యమును గ్రహించి అనుసరించువారును భాగవతోత్తముల సేవా సత్సంగము చేసినవారును, మోహము తొలగినవారై మోక్షపదమును పొందగలరు. ఇందులకు సందేహము లేదు.

భాగవత భక్తితత్త్వము సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

# బ్రహ్మాదికృత దేవకీ గర్భగత విష్ణు స్తుతిః

సత్యవ్రతం సత్యపరం త్రిసత్యం సత్యస్య యోనిం నిహితం చ సత్యే ।
సత్యస్య సత్యమృతసత్యనేత్రం సత్యాత్మకం త్వాం శరణం ప్రపన్నాః ॥

ఏకాయనోఽసౌ ద్విఫలస్త్రిమూలః చతూరసః పంచవిధః షడాత్మా ।
సప్తత్వగష్టవిటపో నవాక్షో దశచ్ఛదీ ద్విఖగో హ్యాదివృక్షః ॥

త్వమేక ఏవాస్య సతః ప్రసూతిః త్వం సన్నిధానం త్వమనుగ్రహశ్చ ।
త్వన్మాయయా సంవృతచేతసస్త్వాం పశ్యంతి నానా న విపశ్చితో యే ॥

బిభర్షి రూపాణ్యవబోధ ఆత్మా క్షేమాయ లోకస్య చరాచరస్య ।
సత్త్వోపపన్నాని సుఖావహాని సతామభద్రాణి ముహుః ఖలానామ్ ॥

త్వయ్యంబుజాక్షాఖిలసత్త్వధామ్ని సమాధినావేశితచేతసైకే ।
త్వత్పాదపోతేన మహత్కృతేన కుర్వంతి గోవత్సపదం భవాబ్ధిమ్ ॥

స్వయం సముత్తీర్య సుదుస్తరం ద్యుమన్
భవార్ణవం భీమమదభ్రసౌహృదాః ।

భవత్పదాంభోరుహనావమత్ర తే
నిధాయ యాతాః సదనుగ్రహో భవాన్ ॥

యేఽన్యేఽరవిందాక్ష విముక్తమానినః
త్వయ్యస్తభావాదవిశుద్ధ బుద్ధయః ।
ఆరుహ్య కృచ్ఛ్రేణ పరం పదం తతః
పతంత్యధో నాదృతయుష్మదంఘ్రయః ॥

తథా న తే మాధవ తావకాః క్వచిద్ భ్రశ్యంతి మార్గాత్త్వయి బద్ధసౌహృదాః ।
త్వయాభిగుప్తా విచరంతి నిర్భయాః వినాయకానీకపమూర్ధసు ప్రభో ॥

సత్త్వం విశుద్ధం శ్రయతే భవాన్ స్థితౌ శరీరిణాం శ్రేయ ఉపాయనం వపుః ।
వేదక్రియా యోగతపస్సమాధిభిః తవార్హణం యేన జనః సమీహతే ॥

సత్త్వం న చేద్ధాతరిదం నిజం భవేత్ విజ్ఞానమజ్ఞానభిదాపమార్జనమ్ ।
గుణప్రకాశైరనుమీయతే భవాన్ ప్రకాశతే యస్య చ యేన వా గుణః ॥

న నామరూపే గుణకర్మజన్మభిః నిరూపితవ్యే తవ తస్య సాక్షిణః ।
మనోవచోభ్యామనుమేయవర్త్మనో దేవ క్రియాయాం ప్రతియంత్యథాపి హి ॥

శృణ్వన్ గృణన్ సంస్మరయంశ్చ చింతయన్
నామాని రూపాణి చ మంగలాని తే ।
క్రియాసు యస్త్వచ్చరణారవిందయోః
ఆవిష్టచేతా న భవాయ కల్పతే ॥

దిష్ట్యా హరేఽస్యా భవతః పదో భువో
భారోఽపనీతస్తవ జన్మనేశితుః ।
దిష్ట్యాంకితాం త్వత్పదకైః సుశోభనైః
ద్రక్ష్యామ గాం ద్యాం చ తవానుకంపితామ్ ॥

న తేఽభవస్యేశ భవస్య కారణం వినా వినోదం బత తర్కయామహే ।
భవో నిరోధః స్థితిరప్యవిద్యయా కృతా యతస్త్వయ్యభయాశ్రయాత్మని ॥

మత్స్యాశ్వకచ్ఛపనృసింహవరాహహంస-
రాజన్యవిప్రవిబుధేషు కృతావతారః ।
త్వం పాహి నస్త్రిభువనం చ యథాధునేశ
భారం భువో హర యదూత్తమ వందనం తే ॥

❖ ❖ ❖